అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక
శుక్రవారం 15-12-2023

సంపుటి : 9 | సంచిక : 344 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ఇంధనశాఖ కార్యదర్శిగా రిజ్వీ...

వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్...

- పలువురు ఐఏఎస్‌ల బదిలీలు
- మరికొంత మందికి అదనపు బాధ్యతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ట్రాన్స్‌కో, జెన్‌కో సహా వివిధ శాఖలకు చెందిన అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓఎస్డీగా కృష్ణ భాస్కర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంధన శాఖ కార్యదర్శిగా అలీ ముర్తుజా రిజ్వీని నియమించిన ప్రభుత్వం.. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగానూ రిజ్వీకి అదనపు బాధ్యతలు అప్పగించింది. హెచ్ఎండీఏ...13లో



బాధ్యులెవరు..?

భద్రతావైఫల్యంపై చర్చించాలన్నందుకే 14 మంది ప్రతిపక్ష ఎంపీలపై వేటు

- లోక్‌సభలో 13 మంది, రాజ్యసభలో ఒకరు
- హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని కోరటం నేరమా..?
- ప్రతిపక్షాల ఆగ్రహం.. ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో జరిగిన పొగబాంబుల దాడి ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసినందుకు14 మంది ప్రతిపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. లోక్‌సభలో 13మంది, రాజ్యసభలో ఒకరు సస్పెన్షన్‌కు గురయ్యారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిసేవరకూ ఈ వేటు వర్తిస్తుంది. లోక్‌సభలో బుధవారం చోటుచేసుకున్న ఘటనపై పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు గురువారం ఆందోళన చేపట్టాయి. భద్రతా వైఫల్యంపై చర్చ చేపట్టాలని, కేంద్ర హోం మంత్రి సమాధానం ...2లో

ప్రజాస్వామ్య హత్య



ప్రతిపక్ష ఎంపీలపై వేటు వేయటం "ప్రజాస్వామ్య హత్య". "భద్రత కోసం హౌస్ కమిటీని ఎందుకని పునర్నిర్మించలేదు. జాయింట్ సెక్రెటరీ, సెక్యూరిటీ హెడ్‌లను నియమించలేదు. చొరబాటుకు స్పాన్సర్ చేసిన బీజేపీ ఎంపీని ఎందుకు ప్రశ్నించలేదు. ప్రధాని, కేంద్ర హోం మంత్రి జవాబుదారీతనం కోసం డిమాండ్ చేసిన ఆ 14 మంది ప్రతిపక్ష ఎంపీలు సస్పెండ్ చేస్తారా...! ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్య హత్యే".

సీపీఐ(ఎం)ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

అప్రజాస్వామిక చర్య



" ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయటం "అప్రజాస్వామిక చర్య". బీజేపీ ప్రభుత్వం పార్లమెంటును "రబ్బర్ స్టాంప్"గా కుదించేసింది. లోక్‌సభ భద్రతా ఉల్లంఘన అంశంపై చర్చకు డిమాండ్ చేస్తే 14 మంది ప్రతిపక్ష ఎంపీలపై వేటు వేయటం సరైంది కాదు.... అక్రమార్కుల ప్రవేశానికి సహకరించిన బీజేపీ ఎంపీపై ఎందుకని చర్యలు తీసుకోవడం లేదు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే." కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్

వైఫల్యానికి బాధ్యులంటూ...

8 మంది అధికారుల సస్పెన్షన్

- నిందితులపై ఉపా కేసు 13లో..
- బీజేపీ ఎంపీ జోలికెళ్లని మోడీ సర్కార్
- పార్లమెంట్‌లో ఆంక్షలు...భద్రత కట్టుదిట్టం



అధ్యక్షా...

శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, కేటీఆర్, కూనంనేని సహా పలువురి శుభాకాంక్షలు

- స్పీకర్ స్థానం వరకూ తోడ్కొని వెళ్లి కూర్చోబెట్టిన సభ్యులు
- అసెంబ్లీ శుక్రవారానికి వాయిదా

రాష్ట్ర మంత్రివర్గ భేటి.. నేటి గవర్నర్ ప్రసంగానికి ఆమోదముద్ర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభాపతి పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయటం, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తోపాటు మిగతా పక్షాలన్నీ మద్దతు తెలపటంతో ప్రసాద్‌కుమార్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆయనకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు సహా మిగతా సభ్యులందరూ అభినందనలు తెలిపారు. నాలుగు రోజుల విరామం అనంతరం గురువారం ఉదయం 10.30 గంటలకు శాసనసభ ఆరంభం కాగానే ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ... సభాపతిగా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తోపాటు మిగతా పక్షాలకు చెందిన సభ్యులందరూ ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సభ్యుల ఆత్మీయ ఆలింగనాలు, అభినందనల వెల్లువ నడుమ సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర ...13లో

ప్రజాసమస్యలపై చర్చకే తొలి ప్రాధాన్యం

- సభా సంప్రదాయాలను కొనసాగిస్తా
- ప్రశ్నోత్తరాలూ చేపడతాం : నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ 3లో..

స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం సంతోషకరం : భట్టి విక్రమార్క

ప్రజాస్వామ్య అత్యున్నత దేవాలయంగా భావించే అసెంబ్లీలో స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కావడం సంతోషకరమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనికి సహకరించిన స్వపక్ష, విపక్ష, మిత్రపక్ష సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కలిసి పనిచేద్దామని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అర్థవంతంగా చర్చలు జరిగేలా..ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే దిశగా స్పీకర్ సలహాలు, సూచనలు ఇస్తారని ఆశిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై లోతుగా చర్చించడానికి సభలో గౌరవ సభ్యులకు అధిక సమయం ఇవ్వాలని కోరారు. గౌరవసభ్యులందరూ సభామర్యాదలను పాటిస్తూ వారి హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సభ అందరిదీ..హక్కులను కాపాడే బాధ్యత స్పీకర్‌ది : కేటీఆర్

సభ అందరిదనీ, ప్రతి సభ్యుడి హక్కులను కాపాడేలా, ప్రజల తరఫున మాట్లాడేవారి గొంతును వినిపించేలా బాధ్యతను సమర్థవంతంగా స్పీకర్ నిర్వర్తించాలని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల తారకరామారావు ఆకాంక్షించారు. ఎంపీటీసీ నుంచి శాసనసభాధిపతి వరకు ఎదిగిన స్పీకర్ ప్రసాద్ కుమార్ రాజకీయ ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో మంత్రిగా ఆయన సిరిసిల్లకు వచ్చారని, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేశారని కొనియాడారు. మాజీ స్పీకర్లు మధుసూదనా చారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి నెలకొల్పిన సాంప్రదాయాలను, కాపాడిన విలువలను పరిరక్షించాలని కోరారు.

సభను సమన్వయం చేయండి

- అసెంబ్లీ కుటుంబానికి మీరే పెద్దదిక్కు
- సమాజ రుగ్మతలను పారదోలే దిశగా చర్చలకు అవకాశమివ్వండి
- చెన్నారెడ్డిలా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎదగాలి
- స్పీకర్ ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నిజాం కాలంలో వైద్యానికి చాలా ప్రసిద్ధి పొందిన ప్రాంతం. అనేక రుగ్మతలతో బాధపడేవారు వికారాబాద్ గుట్టల్లో ఉండి వ్యాధులను నయం చేసుకునేవారు. అలాంటి ప్రాంతం నుంచి వచ్చిన ప్రసాద్ సమాజ రుగ్మతలను పారదోలే దిశగా సభలో చర్చలు జరిగేలా చూస్తారని ఆకాంక్షిస్తున్నాను' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం శాసనసభలో స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నిక అనంతరం ధన్యవాద తీర్మానం సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పీకర్‌కు అభినందనలు తెలిపారు. ఆయన స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి ప్రత్యక్షంగా సహకరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, ఎంఐఎం ...2లో

కక్ష సాధింపులుండవ్



- బీఆర్ఎస్ 24 గంటల విద్యుత్ ఇవ్వలేదు
- కొత్త భవనాలు నిర్మించం.. పాతవే వాడుకుంటాం
- జర్నలిస్టులకు ఇండ్లస్థలాలపై మంత్రులతో మాట్లాడతా
- కమిట్ అయ్యాం..ఇస్తాం 13లో..
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలోనే క్యాంపు ఆఫీసు
- పొదుపు చర్యల దిశగా అడుగులు : మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్

మథుర కృష్ణ జన్మభూమి కేసులో

షాహీ ఈద్గాను సర్వే చేయండి

అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు 13లో..



కరాచీ బేకరీ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

ఆరుగురి పరిస్థితి విషమం

- పైప్ నుంచి గ్యాస్ లీక్‌తో ఎగిసిన మంటలు 13లో..
- సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి
- మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశం
- ఉత్తరప్రదేశ్‌కి చెందిన వలస కార్మికులుగా గుర్తింపు





పొంగులేటి శ్రీనివాసరెడ్డి




భట్టి విక్రమార్క



సీతక్క



శ్రీధర్‌బాబు



ఉత్తమ్



దామోదర రాజనర్సింహ

సమాచార, రెవెన్యూ శాఖ మంత్రిగా

పొంగులేటి బాధ్యతల స్వీకరణ

భట్టి, శ్రీధర్ బాబుతో సహా చార్జి తీసుకున్న పలువురు అమాత్యులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వేముల వీరేశం, ఆదినారాయణ, బాలు నాయక్, ఆది శ్రీనివాస్, యశస్వినీ రెడ్డి తదితరులు హాజరయ్యారు. భువనగిరి జిల్లా రాయగిరిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి పది ఎకరాల భూమిని కేటాయిస్తూ పొంగులేటి మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాల డీపీఆర్ఓలకు అధునాతన కెమెరాలను అందజేసే ఫైల్‌తో పాటు. గృహ నిర్మాణ శాఖకు చెందిన పలు పరిపాలనా సంబంధిత ఫైళ్లపై ఆయన సంతకాలు చేశారు. పొంగులేటితో పాటు పలువురు మంత్రులు సైతం తమకు కేటాయించిన శాఖల బాధ్యతలను స్వీకరించారు. ఆర్థిక, ప్రణాళికలు, ఇంధన శాఖ మంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగాదుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖ మంత్రిగా ధనసరి అనసూయ (సీతక్క) భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి

సమాచార శాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 13లో..



దేశంలో మహిళలు అనేక రంగాలలో పురోభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ఇప్పటికీ వారిని ఇంటి పని మనిషిగానే పరిగణిస్తున్నారు. ఇది నిష్టుర సత్యం. వాస్తవానికి చాలా మంది గృహిణులు ఇంటి పనికే పరిమితమవుతూ బండెడు చాకిరీ చేస్తున్నారు. వారికి నిర్దిష్ట పని గంటలు, వారాంతపు సెలవు దినాలు ఉండవు. పైగా అత్తింటి వేధింపులు అదనం. ఈసడింపులు, ఛీత్కారాలు నిత్యకృత్యం. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన నివేదిక పలు చేదు నిజాలను బయటపెట్టింది.

ఆత్మహత్యలు కావవి...హత్యలే

పెరుగుతున్న గృహిణుల మరణాలు

- అత్తింటి వేధింపులే ప్రధాన కారణం
- తోడవుతున్న సామాజిక సమస్యలు
- పురుషాధిక్య ప్రపంచంలో వీరి గోడు వినేదెవరు?

న్యూఢిల్లీ : గత సంవత్సరం దేశవ్యాప్తంగా 25,309 మంది గృహిణులు బలవన్మరణానికి పాల్పడ్డారని ఆ నివేదిక తెలిపింది. గత ఐదు సంవత్సరాలతో పోలిస్తే 2022లో చోటుచేసుకున్న గృహిణుల ఆత్మహత్యల సంఖ్యే అధికంగా ఉంది. మొత్తం ఆత్మహత్యలలో ఇది 14.8% కావడం ఆందోళన కలిగించే విషయం.

2021లో 23,178 మంది, 2020లో 22,372 మంది గృహిణులు ప్రాణాలు తీసుకున్నారు. గత ఐదు సంవత్సరాలలోనే కాదు. ఎన్‌సీఆర్‌బీ 1997 నుండి వృత్తిపరమైన ఆత్మహత్యల సమాచారాన్ని సేకరిస్తోంది. అప్పటి నుండి ఇప్పటి వరకూ ప్రతి సంవత్సరం 20 వేల మందికి పైగానే గృహిణులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. 2009లో ఈ తరహా ఆత్మహత్యలు 25,092 నమోదయ్యాయి. 2021 వరకూ అదే అత్యధికం. గత సంవత్సరపు ఆత్మహత్యల సంఖ్య ఈ రికార్డును అధిగమించింది. ఈ ఆత్మహత్యలన్నింటికీ 'కుటుంబ సమస్యలు' లేదా 'వివాహ సంబంధమైన విషయాలు' కారణమని ఎన్‌సీఆర్‌బీ చెబుతోంది. అయితే సంవత్సరాల తరబడి వేలాది మంది గృహిణులు ఎందుకు అర్థాంతరంగా ప్రాణాలు తీసుకుంటున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. నిజం చెప్పాలంటే ఇవి ఆత్మహత్యలు కావు. హత్యలే.

రైతుల కంటే అధికమే

గత కొన్ని సంవత్సరాలకు సంబంధించి ఎన్‌సీఆర్‌బీ అందించిన సమాచారాన్ని ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	62,890	▲	1090
22 క్యారెట్లు	57,650	▲	1000
కిలో వెండి	79,500	▲	2500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	95
రిటైల్ (లైవ్)	రూ.	117
స్కిన్‌తో	రూ.	170
స్కిన్‌లెస్	రూ.	193

సభను సమన్వయం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల నేతలకు, పరోక్షంగా మద్దతు తెలిపిన బీజేపీకి ధన్యవాదాలు తెలిపారు. సభను సాంప్రదాయకంగా ముందుకు తీసుకెళ్లడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంప్రదాయం మున్ముందు కూడా ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రసాద్ తన చిన్నతనం నుంచే ఉమ్మడి కుటుంబ బాధ్యతలను విజయవంతంగా సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. శాసనసభ అనేది స్పీకర్‌కు కుటుంబం లాంటిదనీ, పలుపార్టీల సభ్యులున్న సభను ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన ప్రసాద్ కుమార్ సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా నడిపిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సభలో సభ్యులందరి హక్కులను ఆయన కాపాడుతారనే పూర్తి విశ్వాసం తనకుందన్నారు.

ఎంపీటీసీ, ఎంపీపీ, ఎమ్మెల్యే, స్పీకర్ స్థాయికి ప్రసాద్ ఎదిగిన తీరును వివరించారు. వికారాబాద్‌ను శాటిలైట్ సిటీగా అభివృద్ధి చేయించడంలో ప్రసాద్ కృషి మరువలేనిదని చెప్పారు. ఆయన చొరవతోనే అక్కడకు మెడికల్ కాలేజీ వచ్చిందన్నారు. అప్పా జంక్షన్ నుంచి వికారాబాద్ మన్నెగూడా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణకు ఆయన చొరవ చూపిన విషయాన్ని గుర్తుచేశారు.

ప్రజల గొంతుకలకు అధిక సమయమివ్వాలి : కూనంనేని

సమయాన్ని సాంకేతికంగా కేటాయించకుండా ప్రజాసమస్యలను లేవనెత్తే గొంతుకలకు సభలో తగిన సమయం ఇవ్వాలని సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయం పవిత్ర వ్యాపకమనీ, సభ దేవాలయం లాంటిందని చెప్పారు. విడివిడి, వ్యక్తిగత ఆలోచనల్ని బయటనే వదిలేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అర్థవంతమైన చర్చ జరపాలని సభ్యులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బయట నిత్యం పోరాడే కమ్యూనిస్టు పార్టీల సభ్యులు సభలో తక్కువగా ఉండటం బాధాకరమన్నారు.

సభా నిర్వహణకు సహకరిస్తాం : బలాల

స్పీకర్‌కు ఎంఐఎం సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల శుభాకాంక్షలు తెలిపారు. సభను సజావుగా నడిపేందుకు ఎంఐఎం సభ్యులంతా సహకరిస్తారని హామీనిచ్చారు. సభలో అర్థవంతమైన చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

అభ్యుదయ ఆలోచనలతో ముందుకెళ్లాలి : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజా సమస్యల పరిష్కారం మీద నిత్యం చొరవ చూపే శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభ్యుదయ ఆలోచనలతో ముందుకెళ్తారని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ యాక్టులో ప్రసాద్ ప్రధాన భాగస్వామిగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. సభ్యులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూ సభను సజావుగా నడపాలని కోరారు. సభ్యులందరూ స్పీకర్‌కు సహకరించాలని విన్నవించారు.

గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రులు దనసరి అనుసూయ(సీతక్క), తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, కాంగ్రెస్ సభ్యులు పద్మావతిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఆది శ్రీనివాస్, రాజ్‌ఠాకూర్, లక్ష్మణ్, రాంమోహన్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మనోహర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, కె.సత్యనారాయణ, భూపతిరెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, డాక్టర్ వంశీకృష్ణ, శంకర్, బీఆర్‌ఎస్ సభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, కాలేయాదయ్య, దానం నాగేందర్, కడియం శ్రీహరి తదితరులు మాట్లాడారు.

పుల్లూరు టోల్‌ప్లాజాను 'బీ' ఏరియాకు మార్చాలి

- సీపీఐ(ఎం) ఎంపీ ద్వారా సమస్యను పరిష్కరించండి
- పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులుకు టోల్‌ప్లాజా ఉద్యోగుల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జోగులాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజాను కేంద్ర కార్మిక శాఖ ద్వారా వచ్చే కనీస వేతనాల జీవోలో సీ ఏరియా నుంచి బీ ఏరియాకు మార్చాలని నేషనల్ హైవే పుల్లూరు టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కోరింది. ఈ మేరకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం అధ్యక్షులు ఎ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బి మద్దయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ పీటర్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఐ(ఎం) ఎంపీ ద్వారా కేంద్ర కార్మిక శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడి ఈ సమస్య పరిష్కరించేలా ప్రయత్నించాలని కోరారు. పుల్లూరు టోల్‌ప్లాజాలో 77 మంది కార్మికులు వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారని తెలిపారు. కేంద్ర కార్మిక శాఖ ద్వారా ఇచ్చే కనీస వేతనాల జీవోలో పుల్లూరు టోల్‌ప్లాజా సీ ఏరియా కింద ఉందని వివరించారు. అందువల్ల తమకు జీతాలు తక్కువగా వస్తున్నాయని పేర్కొన్నారు. తాము తెలంగాణలోని ఆలంపూర్ నియోజకవర్గం, ఏపీ కర్నూలు నగరానికి చెందిన వాళ్లం ఆ టోల్‌ప్లాజాలో పనిచేస్తున్నామని తెలిపారు. ఇది కర్నూల్ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందని పేర్కొన్నారు. గతంలో పుల్లూరు టోల్‌గేటును జోగులాంబ టోల్‌గేట్‌గా మారుస్తూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గతేడాది మార్చి 24న సర్క్యులర్ ఇచ్చారని తెలిపారు. కానీ అది ఇంత వరకు అమలు కాలేదని పేర్కొన్నారు. ఆ సర్క్యులర్‌ను అమలు చేస్తూ పేరు మార్చడంతోపాటు కనీస వేతనాల జీవోలో సీ ఏరియా నుంచి బీ ఏరియాకు మార్చాలని కోరారు.

ఆత్మహత్యలు కావవి...హత్యలే

పరిశీలిస్తే ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో ఎక్కువ మంది దినసరి వేతన కార్మికులే. గృహిణులు, స్వయం ఉపాధి పొందిన వారు, నిరుద్యోగులు, విద్యార్థులు, అన్నదాతలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. 2018-2022 మధ్య కాలంలో ప్రతి ఏటా ఆత్మహత్యలు చేసుకున్న గృహిణుల సంఖ్య బలవన్మరణానికి పాల్పడిన రైతులతో పోలిస్తే రెట్టింపు కంటే అధికంగా ఉంది. ఇది నిజంగా కలవరపరిచే విషయమే.

సామాజిక సమస్యే

గృహిణుల ఆత్మహత్యలను కుటుంబ లేదా వ్యక్తిగత సమస్యగా ఎన్‌సీఆర్‌బీ చూస్తోంది. కానీ ఇది తీవ్రమైన సామాజిక సమస్య. పితృస్వామ్య వ్యవస్థ, నిరుద్యోగం, కులం, పేదరికం, వనరుల కొరత, మానసిక ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం...ఇవన్నీ గృహిణుల బలవన్మరణానికి...కాదు...కాదు హత్యలకు కారణాలే. ఎన్‌సీఆర్‌బీ నివేదికను లోతుగా అధ్యయనం చేస్తే మహిళలు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రధానంగా వరకట్నమో లేక సంతాన లేమో కారణంగా కన్పిస్తుంది.

అత్తింటి ఆరళ్లే కారణం

మహిళలు ఉద్యోగాలను సైతం త్యాగం చేసి కుటుంబం కోసమే పాటుపడుతున్నారంటూ కొందరు ప్రశంసిస్తున్నారు. అదే సమయంలో ఇంటి పనికే పరిమితమవుతున్న గృహిణుల మానసిక, శారీరక, భావోద్వేగ అవసరాలను పూర్తిగా విస్మరిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన సమాచారాన్ని విశ్లేషిస్తే 2016-2021 మధ్యకాలంలో మహిళలపై జరిగిన ప్రతి మూడు నేరాలలో రెండు నేరాలు వారి భర్త లేదా అతని బంధువులు పాల్పడినవేనని తేలింది. దేశంలో మహిళలపై జరుగుతున్న దాష్టీకాలు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలకు వారి భర్తలో లేదా అతని బంధువులో కారణమని గణాంకాలు వేలెత్తి చూపుతున్నాయి.

ఫిర్యాదుకు వెనకడుగు

ఈ గణాంకాలు వాస్తవ పరిస్థితిలో కేవలం ఓ చిన్న భాగానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నాయని మహిళా హక్కుల కార్యకర్త అమృతా జోహ్రీ తెలిపారు. వాస్తవానికి మహిళలపై జరుగుతున్న అనేక నేరాలు వెలుగు చూడడం లేదు. కులం, సంస్కృతి, పురుషాధిక్యం, పోలీసులు లేదా సమాజం పట్ల భయం వంటి కారణాలతో బాధిత మహిళలు, వారి బంధువులు పోలీసులను ఆశ్రయించడం లేదు. ఇప్పటికీ కుటుంబాలలో పురుషాధిక్యత కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. గృహ హింస తగ్గుముఖం పట్టకపోవడానికి ఇది ప్రధాన కారణమని అమృత అంటారు. ఇంటిలో కొడుకు, కూతురు మధ్య చూపే తేడా చివరికి కోడలి పట్ల వేధింపులకు కారణమవుతోంది. ఇక గృహిణుల మానసిక స్థితిని పట్టించుకోకపోవడం లేదా అవసరమైన చికిత్స చేయించకపోవడం వల్ల వారు నిరాశానిస్పృహలకు లోనై చివరికి ప్రాణాలు తీసుకుంటున్నారు. కాబట్టి సకాలంలో సమస్యను గుర్తించడం చాలా అవసరం. అలాంటి మహిళలకు కుటుంబం, సమాజం సానుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది.

ఆర్థిక స్వాతంత్ర్యం కరువు

2021లో ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వేలో...తమ భర్తలు గృహహింసకు పాల్పడుతున్నారంటూ 30% మంది మహిళలు తెలిపారు. ప్రతిరోజూ జరుగుతున్న దాష్టీకాల కారణంగా గృహిణులు అణచివేతకు గురవుతూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన మరో విషయమేమంటే ఇంటి పనిలో ఉండే మహిళలకు ఆదాయ వనరు అంటూ ఏమీ ఉండదు. ప్రతి రూపాయి కోసం భర్తపై ఆధారప డాల్సిన పరిస్థితి. వారికి ఆర్థిక స్వాతంత్ర్యం అంటూ ఏమీ ఉండదు. దీనివల్ల వినోదం, శారీరక లేదా మానసిక వైద్యం వంటి కనీస అవసరాల ను వారు సొంతగా తీర్చుకోలేక పోతున్నారు. పైగా విద్య అవగాహన లేక పోవడంతో వారికి తమ హక్కులు తెలియడం లేదు.

కోరికలకు సమాధి కట్టి...

ఎంతటి కష్టాలు వచ్చినా సహనంతో భరించాలంటూ మహిళలకు పితృస్వామ్య వ్యవస్థ బోధిస్తుంది. అనేక మంది బాలికలకు చిన్న వయసులోనే, మానసిక వికాసం కలగకముందే వివాహం చేస్తున్నారు. ఫలితంగా వారు ఆ వయసులోనే గృహిణిగా, కోడలిగా బాధ్యతలు మోస్తూ రోజంతా ఇంటిపని, వంటపనికే పరి మితమవుతున్నారు. ఇంత చేస్తున్నా వారిపై లెక్కలేని ఆంక్షలు విధిస్తారు. స్వేచ్ఛ కూడా చాలా తక్కువగానే లభి స్తుంది. తమ కనీస అవసరాల కోసం డబ్బు సంపాదిం చుకునే అవకాశాలు కూడా ఉండవు. ఇలాంటి వాతావరణం లో వారు విద్యావంతులు ఎలా అవుతారు? తమ కలల్ని ఎలా నెరవేర్చుకుంటారు? చివరికి వారు తమ కోరికలు, లక్ష్యాలకు సమాధి కడతారు. నిరుత్సాహానికి లోన వుతారు. తమలో తాము ఉక్కిరిబిక్కిరై సహన శక్తిని కోల్పో తారు. అంతిమంగా ఆత్మహత్యకు పాల్పడి తనువు చాలిస్తారు.

పుక్కిటి పురాణాలు తలకెక్కి...

మానసిక అనారోగ్యానికి గురవుతున్న మహిళలు తమ సమస్యను బయటికి చెప్పుకోలేకపోతున్నారు. పుక్కిటి పురాణాలు కూడా మహిళల్ని చీకట్లోకి నెడుతున్నాయి. చిన్నప్పటి నుండే వారికి త్యాగాలు, తల్లిప్రేమ వంటి విషయాలను తలకెక్కిస్తారు. దీంతో వారు తమ గురించి కూడా ఆలోచించే శక్తిని కోల్పోతారు. మెనోపాజ్ దశకు చేరిన మహిళల్లో మానసిక ఒత్తిడి, చికాకు అధికంగా ఉంటాయి. ఇవి తీవ్రమైనవి కాకపోయినప్పటికీ వాటి వాస్తవికతలు, ప్రభావం మాత్రం తీవ్రంగానే ఉంటాయి. ఇలాంటి సమయాలలోనే వారి పట్ల సున్నితంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

శిక్షలు తక్కువే

మహిళలు తమపై జరుగుతున్న అకృత్యాలపై గళం విప్పి పోలీసులను ఆశ్రయించినా పెద్దగా ఫలితం ఉండడం లేదు. పోలీస్ స్టేషన్, న్యాయస్థానం చుట్టూ తిరగడం తోనే సమయం సరిపోతోంది. 2021తో పోలిస్తే 2022లో మహిళలపై నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడిన కేసుల సంఖ్య 3% తగ్గింది. మహిళలపై జరుగుతున్న నేరాలలో 54.2% నేరాల లోనే శిక్షలు పడుతున్నాయి. కోవిడ్ సమయంలో అంటే 2020లో 59% నేరాలకు శిక్ష పడింది. 2022లో న్యాయస్థానాల్లో ఏకంగా 89% కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పోలీస్ స్టేషన్, కోర్టు చుట్టూ తిరుగుతుండడం అంత తేలిక కాదు. సంవత్సరాల తరబడి కేసులు అపరిష్కృతంగా ఉంటున్నాయి.

ఆత్మహత్యలకు మన దేశంలో పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. పత్రికలలో మాత్రమే అవి పతాక శీర్షికలుగా ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ పెద్దగా అవగాహన ఉండడం లేదు. గ్రామాలలో మహిళలు ఆత్మహత్య చేసుకుంటే శవపరీక్ష కూడా చేయడం లేదు. వాటిని ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా చిత్రిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళాభ్యున్నతిపై ప్రభుత్వాలు, పార్టీలు చెప్పే మాటలు కేవలం ఎన్నికల నినాదాలుగానే మిగిలిపోతున్నాయి. ఆత్మహత్య చేసుకోవాలన్న భావనకు లోనయ్యే మహిళలు ఒక్క నిమిషం ఆలోచించి, ఆసరా వెబ్‌సైట్ ద్వారా సాయం పొందేందుకు ప్రయత్నించాలి. పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర హెల్ప్‌లైన్లను కూడా సంప్రదించి స్వాంతన పొందవచ్చు.

బాధ్యులెవరు..?

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలని డిమాండ్ చేశాయి. వారి ఆందోళనల మధ్యే కొంతసేపు సభ సాగింది. అయితే, ప్రతిపక్ష ఎంపీలు వెల్లోకి దూసుకెళ్లి నినాదాలు హోరెత్తించారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. అంతకు ముందు లోక్‌సభలో రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "ఈ ఘటనను ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. దీనిపై స్పీకర్ పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది. పాస్‌లు ఇచ్చే విషయంలో మనం మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం" అని వెల్లడించారు.

తొలుత 14 మంది..తేరుకుని 13 మంది ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్

మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. పార్లమెంట్‌లో జరిగిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలనే డిమాండ్ హోరెత్తింది. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే లోక్‌సభ నుంచి ఐదుగురు కాంగ్రెస్ ఎంపీలపై సస్పెన్షన్ విధిస్తూ పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తీర్మానం ప్రవేశపెట్టారు. దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించి, వారిపై వేటు వేశారు.

సస్పెండ్ అయిన వారిలో కాంగ్రెస్ ఎంపీలు టిఎన్ ప్రతాపన్, హిబీ ఈడెన్, ఎస్ జ్యోతిమణి, రమ్య హరిదాస్, డిన్ కురియకోస్ ఉన్నారు. సభా నియమాలను ఉల్లంఘించినందుకు, సభా కార్యకలాపాలకు అడ్డుపడినందుకు ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం సభను మధ్యాహ్నం 3 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. అప్పుడు మరో తొమ్మిది మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారు. వీరిలో కాంగ్రెస్ ఎంపీలు బెన్నీ బెహనన్, వికె శ్రీకందన్, మహ్మద్ జావేద్, మాణికం ఠాగూర్, సీపీఐ(ఎం) ఎంపీలు పిఆర్ నటరాజన్, ఎస్. వెంకటేశన్, డీఎంకే ఎంపీలు కనిమొళి కరుణానిధి, ఎస్‌ఆర్ పార్థిబన్, సీపీఐ ఎంపీ కె. సుబ్బరాయన్‌లు ఉన్నారు. ఆ తరువాత సభ ప్రారంభమైన రెండు నిమిషాలకే నేటికీ (శుక్రవారం) వాయిదా వేశారు.

నేను లేకపోయినా.. సస్పెండ్ చేశారు: డీఎంకే ఎంపీ ఎస్‌ఆర్ పార్థిబన్

డీఎంకే ఎంపీ ఎస్‌ఆర్ పార్థిబన్ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్ జాబితాలో తన పేరు నమోదు కావడం "జోక్" అని అన్నారు. "నేను అనారోగ్యంతో ఉన్నందున సభలో లేను" అని అన్నారు.

సభలో లేని సభ్యుడ్ని చేర్చారన్న విమర్శలు రావటంతో..డీఎంకే ఎంపీ పార్థిబన్ పేరును తొలగిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.

రాజ్యసభలోనూ...

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భద్రతా వైఫల్యంపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో చైర్మెన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగింది. దీనిపై చర్చ జరగాలని టీఎంసీ పక్షనేత డెరిక్ ఒబ్రెయిన్ డిమాండ్ చేశారు. వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు ఇచ్చారు. దానిపై రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ ఆగ్రహానికి గురయ్యారు. 'డెరెక్ వెంటనే సభ నుంచి బయటకు వెళ్లిపోవాలి.

సభ నిబంధనలను గౌరవించనని ఆయన చెప్పారు. ఇది తీవ్రమైన ఉల్లంఘన. ఇది సిగ్గుచేటు' అని ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ చైర్మెన్ ప్రకటించారు. ఈ సెషన్ మొత్తం ఆయనపై వేటు కొనసాగనున్నట్టు తెలిపారు. రూల్ 256 (2) ప్రకారం కౌన్సిల్ సర్వీస్ నుంచి సస్పెండ్ చేసిన డెరెక్ ఒబ్రెయిన్ ప్రవర్తనను తీవ్రంగా పరిగణించాలని, ఆయన "క్రమశిక్షణా రాహిత్యాన్ని" హౌస్ ప్రివిలేజెస్ కమిటీకి సూచించాలని, మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని కేంద్ర మంత్రి, రాజ్యసభా నేత పీయూశ్ గోయల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాజ్యసభ ఆమోదించింది. ఈ ప్రకటనను ప్రతిపక్షాలు వ్యతిరేకిం చాయి. దీని తరువాత కూడా ఎంపీ ఇతర సభ్యులతో కలిసి సభలో తన ఆందోళన కొనసాగించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభకు వచ్చి, పొగబాంబుదాడి ఘటనపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సభను మధ్యాహ్నం 2:30 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. ఈ ఆందోళనల మధ్య మరో రెండు సార్లు సభ వాయిదాపడింది. ఆ తరువాత కూడా సద్దుమణగకపోగా ప్రతిపక్షాల ఎడతెగని నిరసనలతో నేటి (శుక్రవారం)కి వాయిదా పడింది.

భద్రతా వలయంలో అసెంబ్లీ

- పార్లమెంట్ ఘటన నేపథ్యంలో ముందస్తు చర్యలు
- ఎమ్మెల్యేల వాహనాలు సైతం క్షుణ్ణంగా తనిఖీ
- అమరవీరుల స్థూపం చుట్టూ పోలీసుల పహారా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీకి కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక భద్రతా దళాలతో మూడంచెల వలయాన్ని ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఘటన నేపథ్యంలో గతంలో ఏన్నడూ లేని విధంగా ఉదయం నుంచీ సమావేశం ముగిసే వరకు అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. లక్‌డీకాపూల్, రవీంద్ర భారతి, ఏజీ ఆఫీస్, నాంపల్లి, బషీర్ బాగ్ వరకు మఫ్టీలో పహారా కాసారు. అసెంబ్లీ ఎదురుగా రోడ్డుకిరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారంతో పాటు మూడు గేట్ల వద్ద మెటల్ డిటెక్టర్లను అమర్చారు. అసెంబ్లీలోకి ప్రవేశించే అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతించారు. ఎమ్మెల్యే వాహనాల్లో పీఏ, గన్‌మెన్‌తో కలిపి ఇద్దరి కన్నా ఎక్కువ మంది ఉంటే వారిని ప్రవేశ ద్వారం వద్దనే దింపేసారు. పాసులు లేని వారిని అనుమతించలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన చాలా మంది పాసులు లేక గేట్ల ముందు పడిగాపులు కాశారు.. ఎమ్మెల్యేల పీఏలు వ్యక్తిగతంగా ఫోన్లు చేసినా పోలీసులు విజిటర్స్‌ను వదలలేదు.

పోలీసుల వలయంలో గన్ పార్క్

అసెంబ్లీ మందున్న గన్ పార్కు చుట్టూ పోలీసు వలయాన్ని ఏర్పాటు చేశారు. గన్ పార్కుకు ఇరు వైపులా రోప్ పార్టీలను అందుబాటులో ఉంచారు. మీడియాతో పాటు పాసులున్న వారిని మాత్రమే లోనికి అనుమతించారు. అమర వీరులకు నివాళులర్పించే నెపంతో విపక్షాలతో పాటు ఇతర సంఘాలు ఆందోళన చేపట్టకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

నేడు కేసీఆర్ డిశ్చార్జి

- మాజీ స్పీకర్ పోచారం సహా పలువురి పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కానున్నారు. ఆయన అక్కడి నుంచి నందినగర్‌లో గల తన సొంత ఇంటికి వెళ్లనున్నారు. కేసీఆర్‌కు ఆరు నుంచి ఎనిమిది వారాలు విశ్రాంతి అవసరమని డాక్టర్లు చెప్పిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన మరి కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోనున్నారు. మరో వైపు గురువారం కూడా ఆయన్ను పలువురు పరామర్శించారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సినీ నటుడు నరేశ్, పెద్దమ్మ తల్లి దేవస్థానం చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ కోలేటి దామోదర్, నిజామాబాద్ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి తదితరులు కేసీఆర్ ను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తొలిమెట్టు, ఉన్నత కార్యక్రమాలు రద్దు చేయండి

- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలి
- సీఎం, డిప్యూటీ సీఎంకు ఎస్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్టీయూటీఎస్ కోరింది. వినూత్న కార్యక్రమాల పేరుతో పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి వంటి కార్యక్రమాలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల కు పదోన్నతులు వెంటనే కల్పించాలనీ, బదిలీల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఇప్పటికీ



చాలా జిల్లాల్లో ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లోనూ మౌలిక వసతులు కల్పించాలనీ, స్కావెంజర్లను నియమించాలని కోరారు.

మెట్రో రైలుపై సీఎం నిర్ణయం భేష్

టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మెట్రోరైలు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు టీపీసీసీ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ పేర్కొన్నారు. పాత నగరంలో దాని విస్తరణ జరక్కపోవడానికి బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలే కారణమని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించి మెట్రో రైల్ విస్తరణ పనులు ఆపేసిందని ఆరోపించారు.

గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎంఐఎం పాత బస్తీలో మెట్రో విస్తరణ పనుల విషయంలో సరైన ప్రణాళిక లేకుండా చేయడంతో పనులు ఆగిపోయాయని చెప్పారు.ఇందుకు సంబంధించి కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని చెప్పారు.

జనవరిలో హైకోర్టు నూతన భవనానికి శంకుస్థాపన

వందెకరాల్లో నిర్మాణానికి ఏర్పాట్లు చేయండి :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చేనెలలో తెలంగాణ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

గురువారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోకో ఆరాధే, పలువురు ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో సంబంధిత అంశంపై సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం హైకోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవశ్యకతను చీఫ్ జస్టిస్, న్యాయవాదులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రాజేంద్రనగర్ పరిధిలో 100 ఎకరాల్లో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. కొత్త జిల్లాల్లో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కూడా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. ఇప్పుడున్న హైకోర్టు భవనం వారసత్వ భవనం కాబట్టి దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని సీఎంఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ భవనానికి మరమ్మతులు చేసి సిటీ కోర్టుకు లేదా ఇతర కోర్టు భవనాలకు వినియోగించుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై చర్చకే తొలి ప్రాధాన్యం

సభా సంప్రదాయాలను కొనసాగిస్తా

- ప్రశ్నోత్తరాలూ చేపడతాం
- బీఏసీ నిర్ణయాలను అమలు చేస్తాం
- జీరో అవర్ ప్రశ్నలకు జవాబులు పంపిస్తాం
- భద్రతా వ్యవస్థను పటిష్టం చేస్తాం
- మహిళా ఎమ్మెల్యేలను ప్రోత్సహిస్తాం
- మీడియాను గౌరవిస్తాం నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



శాసనసభలో ప్రజాసమస్యలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి చర్చిస్తాం.. సభా గౌరవాన్ని కాపాడు కుంటాం..సంప్రదాయాలను కొనసాగిస్తాం.. ఎమ్మెల్యేలు జీవరో అవర్‌లో అడిగే ప్రశ్నలకు జవాబులను పంపించే ప్రయత్నం చేస్తాం..గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాం మాదిరిగానే మీడియాను గౌరవిస్తాం..శాసనసభ భద్రతను సమీక్షించి పటిష్టం చేస్తాం..సమస్యలు తలెత్తకుండా చూస్తాం..నిబంధనలకు అనుగుణంగా పార్టీలకు సభాసమయం కేటాయిస్తామని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సభను ప్రజాసమస్యలపై చర్చకు వేదికగా మారుస్తామని చెప్పారు.

బీఏసీలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం అసెంబ్లీని నిర్వహిస్తామని వివరించారు. గురువారం అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో నవతెలంగాణ స్పెషల్ కరస్పాండెంట్ బి.బసవపున్నయ్యకు స్పీకర్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

స్పీకర్‌గా ఎన్నికైన మీకు శుభాకాంక్షలు, ఇంత పెద్ద బాధ్యతను ఎలా భావిస్తున్నారు.

దన్యవాదాలు. గొప్ప అనుభూతి కలుగుతోంది. సంతోషంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ పెద్దబాధ్యత నామీద పెట్టినట్టయింది. తెలంగాణ అసెంబ్లీకి తొలి దళిత స్పీకర్‌ను నేనే. ఉన్నతస్థాయి బాధ్యతలు అప్పగించినందుకు ధన్యుడిని. నన్ను ఎన్నుకున్నందుకు అసెంబ్లీలోని ఎమ్మెల్యేలు అందరికి దన్యవాదాలు. ఈమేరకు సహకరించిన ఏఐసీసీ అధినేత సోనియాగాంధీ, ఖర్గే, రాహుల్, ప్రియాంక, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రతిపక్షనేత కె.చంద్రశేఖర్‌రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయను. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తా. వ్యవస్థను అధ్యయనం చేయడం ద్వారా శాసనసభను సరైనదారిలో నడిపిస్తా. అందరి సహకారం తీసుకుంటా.

స్పీకర్‌గా మీ తొలి ప్రాధాన్యత ఏమిటి ?

అసెంబ్లీ స్పీకర్‌గా నా తొలి ప్రాధాన్యత సభలో ప్రజాసమస్యలపై విస్తృతమైన చర్చకు అవకాశమివ్వడం. అధికార, ప్రతిపక్షాలకు నిబంధనల మేరకు సమయాన్ని కేటాయిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిచేయడం. సమయం వృధా కాకుండా చూసుకోవడం. ఈ విషయంలో శాసనసభ వ్యవహారాల మంత్రి, అసెంబ్లీ కార్యదర్శి, ఇతర అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటా. సభానాయకుడు, ప్రతిపక్ష నేతతో సమన్వయం చేసుకుంటూ సభను సజావుగా ముందుకుతీసుకుపోతా. అసెంబ్లీ హుందాతనాన్ని కాపాడతా. ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తా. చర్చల ఫలితాలు ప్రజలకు దక్కేలా చూస్తా.

గతంలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సరిగ్గా నిర్వహించడంలేదనే విమర్శలు ఉన్నాయి కదా ?

నేను మూడుసార్లు వికారాబాద్ నుంచి అసెంబ్లీకి ప్రాతినిథ్యం వహించాను. సభాసంప్రదాయాలపై అవగాహన ఉంది. ఇంకా పెంచుకుంటా. గతంలో ప్రశోత్తరాలు, జీవరో అవర్ జరిగిన తీరు కూడా తెలుసు. సభా మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశోత్తరాల కార్యక్రమాన్ని చేపడతాం.ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరేలా సభనడుస్తుంది. ప్రతిపక్షాలకూ అవకాశం ఉంటుంది. మహిళా ఎమ్మెల్యేలను దృష్టిలో పెట్టుకుని సమయం అదనంగా ఇచ్చే ప్రయత్నం చేస్తాం. అంతిమంగా సభ ప్రజాశ్రేయస్సుకు ఉపయోగపడుతుంది.

అసెంబ్లీ నిర్వహణలో బీఏసీ కీలకం, అందులో జరిగిన నిర్ణయాలు అమలు చేస్తారా ?

అవును నిజమే. బీఏసీ శాసనసభ నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇందులో స్పీకర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత, అన్ని పార్టీలు, అసెంబ్లీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. సభా నిర్వహణకు సంబంధించి అన్ని అంశాలపై బీఏసీలో చర్చిస్తారు. ఇందులో జరిగిన ప్రతినిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేస్తాం. ప్రజల కష్ట, నష్టాలు సభలో చర్చకు రావాలంటే బీఏసీ కీలకం. పద్దులపై సుదీర్ఘంగా చర్చ నడుస్తుంది. బడ్జెట్ తదితర అంశాలపైనా కీలకంగా మాట్లాడతాం. ఈనేపథ్యంలో బీఏసీకి చాలా ప్రాధాన్యత ఉంది.

ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల తొలిరోజు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్పీకర్ ఆధ్వర్యంలో 'తేనీటివిందు' నిర్వహణ సాంప్రదాయం ఉండేది. దాన్ని పునరుద్దరించే అవకాశం ఉందా ?

ఇది మంచి సంప్రదాయమే. దీనిపై ముఖ్యమంత్రి, కార్యదర్శితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

సభ్యుల ప్రశ్నలకు జవాబులు పంపడం లేదనే అరోపణలు ఉన్నాయి కదా ?

అసెంబ్లీలో స్పీకర్‌గా నేను పూర్తిస్థాయిలో, పారదర్శకతతో, బాధ్యతగా పనిచేస్తా. సభా నిబంధనల ప్రకారం సభను కచ్చితంగా నడిపిస్తాం. జీరో అవర్‌ను బీఏసీ నిర్ణయం ప్రకారం కొనసాగిస్తాం. శాసనసభ్యులు వేసే జీరో అవర్ ప్రశ్నలకు మంత్రులచేత సమాధానాలు రాబడతాం. అంతేగాక వాటి సమాధానాలు ఎమ్మెల్యేలకు అందేలా జాగ్రత్తలు తీసుకుంటాం. ఎక్కడా రాజీపడబోం.

పార్లమెంటులో అగంతకుల చొరబాటుపై మీ కామెంట్ ?

నో కామెంట్. ఒక్కటి మాత్రం చెప్పగలను. తెలంగాణ శాసనసభ భద్రతపై సమీక్షిస్తాం. సీఎంగారితో కలిపి బీఏసీలోనూ చర్చిస్తాం. ఇప్పుడు మూడంచెల భద్రతా వ్యవస్థ అమల్లో ఉంది. దాన్ని మరింత పటిష్టం చేస్తాం. ఇబ్బందులు రాకుండా పకడ్బంధి చర్యలు తీసుకుంటాం.

మీడియాకు సరైన గౌరవం దక్కడం లేదనే విమర్శలున్నాయి ?

మీడియాను తప్పకుండా గౌరవిస్తాం. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎలాంటి గౌరవం దక్కిందో దాన్ని పునరుద్దరిస్తాం.



దత్తు మరణం తీరని లోటు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర సలహాదారులు ఎంఏకే దత్తు లేని లోటు ఎవరూ పూడ్చలేనిదని, ఆయన మృతి పౌర సమాజానికి తీరని లోటని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన ఎంఏకే దత్తు సంస్మరణ సభ గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పౌర స్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాదే శ్యామ్ హాజరయ్యారు.

ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎంఏకే దత్తు ఏ ఆశయం కోసమైతే నిలబడ్డారో ఆ ఆశయ సాధన కోసం చివరి వరకు కట్టుబడి ఉన్నారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం యావత్ సమాజానికి, ఉద్యమాలకు, తెలంగాణ పౌర వేదికకు తీరని లోటన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి అంశంపైనా తన అనుభవాలను ఇతరులకు తెలియజేస్తూ.. వారి నుంచి తనకు తెలియని వాటిని గ్రహించడం దత్తు గొప్పతనం అన్నారు. తమ ఇద్దరి ఆలోచనలు ఒకే విధంగా ఉండేవని, సమ సమాజ స్థాపన, ఉపాధ్యాయులు, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడూ ఒకే విధంగా ఆలోచించే వాళ్లమని చెప్పారు. ప్రతి పనిలో నిమగ్నమై పూర్తిచేసే వరకు ఏకాగ్రతతో దత్తు పని చేసేవారని గుర్తు చేశారు. అటువంటి గొప్ప ఉపాధ్యాయున్ని, ఉద్యమ నాయకున్ని కోల్పోవడం బాధాకరమన్నారు. సమాజాన్ని, కుటుంబాన్ని ఒకే విధంగా చూసే అతి కొద్దిమంది నాయకులలో దత్తు ఒకరని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ఓయూలో విద్యార్థుల ఆందోళన

- యూనివర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి
- పరిపాలనా భవనం వద్ద ముళ్లకంచెలు, బారికేడ్ల తొలగింపునకు యత్నం
- విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పరిపాలనా భవనం వద్ద ముండ్లకంచెలను, బారీకేడ్లను తొలగించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. గురువారం ఓయూ లైబ్రరీ నుంచి వందలా మంది విద్యార్థులు ర్యాలీగా పరిపాలన భవనం వద్దకు చేరుకొని ధర్నా చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ముండ్లకంచెలు తొలగించేందుకు యత్నించారు. పోలీసులు అక్కడకు చేరుకుని విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఓయూలో వీసీ ప్రొ.రవీందర్ నియంతగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి వేదికైన ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో సభలు, సమావేశాలు పెట్టుకోకుండా ఆంక్షలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశాస్త్రీయంగా అన్ని కోర్సుల ఫీజులు పెంచి పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువును దూరం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే యూనివర్సిటీలో మౌలిక వసతులు, పూర్తిస్థాయిలో శాశ్వత ప్రొఫెసర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం లేకుండా పరిపాలన భవనం చుట్టూ ముండ్లకంచెలు, బారీకేడ్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఎన్నో ఏండ్లుగా యూనివర్సిటీలో పనిచేసిన కార్మికులను తొలగించి ఆ స్థానంలో బి సెక్యూర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని వీసీ విద్యార్థులను కలవకుండా నియంతలా వ్యవహరిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ముండ్లకంచెలు, బారీకేడ్లను తొలగించాలని విన్నవించుకున్నా పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు రీసెర్చ్, స్కాలర్స్ భారీ ర్యాలీతో వెళ్లి వాటిని తొలగించే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. పరిపాలన భవనం వద్ద ముండ్లకంచెలను, బారీకేడ్లను తొలగించే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, సాయంత్రం ఓయూ ఏసీపీ చొరవతో విద్యార్థులు వీసీ ఛాంబర్‌లో వీసీతో భేటీ అయ్యారు. వారి డిమాండ్‌లను వీసీ ముందు ఉంచారు.

రిమ్స్‌లో వైద్య విద్యార్థులపై దాడి

- ఘటనకు బాధ్యుడైన అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెండ్
- దాడి చేసిన వారిపై కేసు, అరెస్ట్

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రిమ్స్ కళాశాలలో బుధవారం అర్ధరాత్రి వైద్య విద్యార్థులపై దాడి కలకలం సృష్టించింది. బయటి వ్యక్తులు క్యాంపస్‌లోకి చొరబడి విద్యార్థులపై దాడి చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘర్షణలో హౌజ్ సర్జన్లు కవిరాజ్, భరత్, నవీన్, అభిషేక్, పసుపులేటి నవీన్, డాక్టర్ విజయ్‌కి గాయాలయ్యాయి. ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తూ రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.క్రాంతికుమార్‌ను టర్మినేట్ చేస్తూ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఉత్తర్వులు జారీ చేశారు. డా.క్రాంతికుమార్‌తో పాటు బయటి వ్యక్తులు శివ, వసీం క్యాంపస్‌లోకి వెళ్లి విద్యార్థులపై దాడి చేశారు. అదే రాత్రి వైద్య విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డా.క్రాంతికుమార్, వసీం, శివను అరెస్టు చేశారు.

విధులు బహిష్కరించి.. దిష్టిబొమ్మ దగ్ధం..

వసతులు కల్పించాలని రిమ్స్ డైరెక్టర్‌ను కోరిన హౌజ్ సర్జన్లపై అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్ బయటి వ్యక్తులతో కలిసి వచ్చి దాడి చేశారని మేడికోలు ఆరోపించారు. ఆయనను వెంటనే టర్మినేట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం విధులు బహిష్కరించి రిమ్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి ఎదుట క్రాంతికుమార్, దుండగుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ అసోసియేషన్ రిమ్స్ అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ.. హాస్టల్ ఆవరణకు బయటి వ్యక్తులు వచ్చి దాడి చేయడంతో తమకు రక్షణ లేకుండా పోయిందన్నారు. క్రాంతికుమార్‌తో పాటు మరో ముగ్గురు దాడిలో పాల్గొన్నారని చెప్పారు. దాడికి పాల్పడిన డైరెక్టర్ బంధువు అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రిమ్స్ నుంచి నేరగా కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు రోడ్డుపై బైటాయించారు. రిమ్స్ డైరెక్టర్‌కు, వైద్యుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు నచ్చజెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవీ వారి వద్దకు వచ్చి మాట్లాడటంతో శాంతించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ సైతం విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి జోగు రామన్న, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ వైద్య విద్యార్థులకు మద్దతు తెలిపారు.

ప్రజలే కేంద్రంగా చర్చలు

తెలంగాణ అసెంబ్లీ దేశానికే రోల్‌మోడల్
సభ్యులు, మీడియా సహకరించాలి : స్పీకర్ ప్రసాద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజలే కేంద్రంగా శాసనసభలో చర్చలు జరిగేలా తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీనిచ్చారు. గురువారం శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన అనంతరం ఆయన సభలో మాట్లాడారు. సభాపతిగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యత అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. ప్రజాస్వామ్య దేవాలయంగా భావించే సభలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే దిశగా చర్చలు జరిగేలా చూస్తానని భరోసానిచ్చారు.

సభలో ఉన్నత విద్యావంతులు, డాక్టర్లు, 57 మంది కొత్తసభ్యులున్నారనీ, వారందరికీ అవకాశాలిస్తానని చెప్పారు. సభాపతి బాధ్యతలు అత్యంత సంక్లిష్టమైనవన్నారు. ప్రజలకు అవసరమైన చట్టాల తయారీలో, సభామర్యాదల్ని కాపాడటంలో తన వంతు పాత్ర పోషిస్తానని హామీనిచ్చారు. సంఖ్యాబలం ఆధారంగా సమయం కేటాయిస్తూనే సభ్యులందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తానన్నారు. ఎక్కడైతే ఫలప్రదమైన, అర్థవంతమైన చర్చలు జరుగుతాయో అక్కడ ఉజ్వల సమాజం రూపుదిద్దుకుంటుందని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ దేశానికే రోల్‌మోడల్ అనీ, ఆ గౌరవాన్ని, సభామర్యాల్ని కాపాడుతూ మనం ముందుకు పోవాలని సభ్యులకు సూచించారు. తన బాధ్యతలను రాజ్యాంగబద్ధంగా నిర్వర్తిస్తానని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం కూడా కావాలని కోరారు.

ఉపాధి కూలీలకు నీళ్లందించే బాధ్యత పంచాయతీలదే

నిర్ణయం తీసుకున్న రాష్ట్ర సర్కారు

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ఉన్న ఎంజీఎన్ఆర్‌జీఎస్ మార్గదర్శకాల్లో భాగంగా పనిప్రదేశాల్లో నీటిని అందజేసే బాధ్యత పంచాయతీలే చూసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ధనసరి అనసూయ (సీతక్క) బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డిలతోపాటు పలువురు ఎమ్మెల్యేలు పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంత రావు, కార్యదర్శి స్మితా సబర్వాల్ వివిధ శాఖల ఉన్నతాధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ పేదిరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో 200 వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాలను మండల సమాఖ్యల ఆధ్వర్యంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుకు ఆమె ఆమోదం తెలిపారు. ఆ ఫైలుపై సంతకం చేశారు. రాష్ట్రంలో 3989 మినీ అంగన్ వాడీ కేంద్రాలుగా ఉన్నాయి. వాటిని మెయిన్ కేంద్రాలుగా మార్చుతూ ఆమోదం తెలిపారు. 3989 మంది అంగన్‌వాడీ సహాయకులను అదనంగా నియమించుకోవడానికి ఆమోదం తెలుపుతూ సంతకం చేశారు. 35,700 అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల నాలుగు రకాల బరువు, ఎత్తు కొలుచేందుకు పోషణ్ అభియాన్ 2.0 పథకం క్రింద 28.56 కోట్ల రూపాయల (కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు) మంజూరుకు సంబంధించిన ఫైలుపై మంత్రి సంతకం చేశారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున శిశు సంరక్షణ(క్రెచ్) కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలతో అనుసంధానించడానికి నిర్ణయం జరిగింది. ఈ కేంద్రాలు ఆరు నెలల నుంచి ఆరేండ్ల పిల్లల కోసం నడుపుతారు. ఈ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు అదనంగా ఇద్దరు శిశు సంరక్షకులను నియమిస్తారు. ఇందుకోసం రూ.1,27,24,800 నిధులను కేటాయించారు. ఉపాధి కూలీలకు నీటిని సరఫరా చేసే బాధ్యత పంచాయతీలదే. ప్రతి కూలీకి రూ.2.5 చొప్పున కనీసం రెండు లీటర్ల నీటిని అందించాలి. దానికి సంబంధించిన బిల్లులను ఎంపీడీఓలకు, పీఓలకు గ్రామ కార్యదర్శులు అందజేయాల్సి ఉంటుంది.

ప్రమాణం చేయనిది వారిద్దరే...

- సభకు హాజరు కాని కేసీఆర్, బీఎల్ఆర్
- ఇప్పటి వరకు 117 మంది ప్రమాణస్వీకారం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాలు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి. రెండోరోజు 16 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. ఇంకా ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. వారిలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్), మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఉన్నారు. ఇప్పటి వరకు 117 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ సమక్షంలో గురువారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆ తర్వాత ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేటీ రామారావు, పాడి కౌశిక్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, టి పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిపి ఎనిమిది మంది ప్రమాణం చేశారు. అయితే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణస్వీకారం చేయబోమని బీజేపీ సభ్యులు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వారు సభకు గైర్హాజరయ్యారు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికైన తర్వాత బీజేపీ సభ్యులు ఆలేటి మహేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, పాయల్ శంకర్, రామారావు పవార్, టి రాజాసింగ్‌తో కలిపి ఎనిమిది మంది ప్రమాణస్వీకారం చేశారు. కేటీ రామారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పవిత్ర హృదయంతో ప్రతిజ్ఞ చేయగా, మిగిలిన వారంతా దైవసాక్షిగా ప్రమాణం చేశారు. పాడి కౌశిక్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసే సమయంలో సందర్శకుల గ్యాలరీలో ఉన్న ఆయన కూతురు 'ఐలవ్ యూ డాడీ' అని గట్టిగా అరిచారు. దీంతో సభలో ఉన్న సభ్యులంతా ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూశారు. రాజాసింగ్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత భారత్ మాతాకి జై అని అన్నారు. అనంతరం సభను శుక్రవారం ఉదయం 11.30 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

మాజీ మంత్రి మల్లారెడ్డిని అరెస్టు చేయాలి

తెలంగాణ గిరిజన సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మేడ్చల్ జిల్లా శామీర్ పేట పరిధిలో పేద గిరిజనులకు చెందిన 47 ఎకరాల భూములను కబ్జా చేసిన మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి భూములను దౌర్జన్యంగా ఆక్రమించడమే కాకుండా బాధితులను గుండాలతో బెదిరించారని తెలిపారు. గిరిజనులతో బలవంతంగా సంతకాలు చేయించటమే కాకుండా తన పేరుపై పట్టా చేయించుకున్నారని పేర్కొన్నారు. అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మల్లారెడ్డికి సహకరించిన తాహశీల్దార్‌లను ఇంతవరకు అరెస్ట్ చేయకపోవడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. గిరిజనుల వారసత్వంగా అనుభవిస్తున్న 33,34,35 సర్వే నెంబర్లలోని 47 ఎకరాల భూమిని సాగుచేస్తున్నట్టు బాధితులు పలుసార్లు పోలీసులకు పిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడమేంటని ప్రశ్నించారు. గతప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టుపక్కల గిరిజనులు, దళితులకు చెందిన వందలాది ఎకరాల భూములను అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆక్రమించారని వివరించారు. వాటిని తిరిగి గిరిజన,దళితులకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. 420, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయిన క్రమంలో మల్లారెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలనీ, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

పండితుల అప్‌గ్రేడేషన్‌కు ఆర్డినెన్స్ తేవాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్‌యూపీపీటీఎస్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పోస్టుల అప్‌గ్రెడేషన్ విషయంలో అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్‌యూపీపీటీఎస్ ప్రభుత్వాన్ని కోరింది. జీవో నెంబర్లు 2,3, 9,10పై హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వచ్చినందున రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తేవాలని సూచించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు కలిసి వినతిపత్రం సమర్పించారు.

భాషా పండితుల జీవితాల్లో వెలుగులు నింపి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ భాష హిందీకి పాఠశాలల్లో వారానికి నాలుగు పీరియెడ్లకు బదులుగా ఆరు పీరియెడ్లు కల్పించాలని సూచించారు. పాఠశాల విద్యలో నాలుగో తరగతి నుంచే హిందీని ప్రవేశపెట్టాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉన్న గ్రేడ్-2 భాషా పండిత వ్యవస్థను రద్దు చేసి అందరినీ స్కూల్ అసిస్టెంట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.



కేసీఆర్‌కు ఆంజనేయ గౌడ్ పరామర్శ

హైదరాబాద్ : తుంటి ఎముక శస్త్రచికిత్స అనంతరం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో కోలుకుంటున్న తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును శాట్స్ మాజీ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ గురువారం పరామర్శించారు. వేగంగా కోలుకుని తెలంగాణ ప్రజల పక్షాన అసెంబ్లీలో వాణి వినిపించాలని ఈ సందర్భంగా ఆంజనేయ గౌడ్ ఆకాంక్షించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టీజేఎమ్‌యూ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఎస్ ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్లకు అనుమితివ్వాలనీ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీజేఎమ్‌యూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీని విలీనం చేయాలనీ, సంస్థ బకాయిలను వెంటనే చెల్లించాలని విన్నవించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీజేఎమ్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి స్వాములయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, జీవీకే రెడ్డి, కళ్యాణి, అరుణ, కుసుమకుమారి, తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ సంస్థ, కార్మికుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చారని హన్మంతు ముదిరాజ్ తెలిపారు.

ఆర్థిక వనరుల్లో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్థిక వనరులను సమకూర్చటంలో రాష్ట్ర దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి బంగారు పళ్లెంలో పెట్టి ఆర్థిక వనరులను అప్పగించామని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే ఆర్బీఐ నివేదికను చూడాలని ఆయన రేవంత్ సర్కార్‌కు సూచించారు. పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ సంపాదించి పెట్టిన రాష్ట్ర ఆర్థిక వనరులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపయోగించుకోవాలని కోరారు. రాష్ట్రానికి మంచి పాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల కన్నా తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. అభివృద్ధి సాధించాయి అని చెప్పుకునే గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాల కన్నా తెలంగాణ ఆర్థిక వనరుల సాధనలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.


సంపాదకీయం

అమెరికా మరింత ఒంటరి!

"ఒకవేళ నేను మరణించాల్సి వస్తే నా గురించి చెప్పటానికి మీరు జీవించి ఉండాలి" అని చెప్పిన కొద్ది రోజులకే కవి, ప్రొఫెసర్ రిఫాత్ అలారిర్‌తో సహా ఆరు గురు కుటుంబ సభ్యులు తలదాచుకున్న ఇంటిని ఇజ్రాయిల్ మిలిటరీ కూల్చివేసి హత్యచేసింది. ఇలాంటి వారెందరో! పిల్లలను కోల్పోయిన తలిదండ్రులు, తల్లో, తండ్రో ఎవరో ఒకరిని కోల్పోయిన పిల్లలు పాతికవేల మంది ఉన్నారన్న వార్తలు మానవత్వం ఏ కాస్త మిగిలి ఉన్నా కలచివేసేవే. అక్టోబరు ఏడు నుంచి పాలస్తీనియన్లపై అత్యంత పాశవిక మారణకాండకు పాల్పడుతున్న యూదు దురహంకార దాడులను విరమించాలని కోరుతూ ఐరాస సాధారణ అసెంబ్లీ మంగళవారం నాడు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇది ఒక హెచ్చరిక తప్ప ఉల్లంఘించిన ఇజ్రాయిల్ మీద చర్య తీసుకొనేందుకు అవకాశం లేదు. యూదు దురహంకారుల మీద రోజురోజుకూ వ్యతిరేకత, ప్రత్యేకించి విశ్వవిద్యాలయాల్లో పెరగటంతో జో బైడెన్‌కు సెగ తగిలింది. దాంతో స్వరంలో తేడా వచ్చింది. అనుసరిస్తున్న విధానాలు, చేపడుతున్న ప్రజాస్వామిక వ్యతిరేక చర్యలు, దుర్మార్గానికి ఇస్తున్న మద్దతు వంటి తీరుతెన్నులతో ప్రపంచంలో అమెరికా మరింతగా ఒంటరి అవుతోంది.

వచ్చే ఏడాది ఎన్నికల్లో తనకు విరాళాలు ఇచ్చే వారితో జరిపిన సమావేశంలో విచక్షణా రహితంగా బాంబు దాడులు చేస్తున్నందున ప్రపంచమంతటా ఇజ్రాయిల్ మద్దతు కోల్పోతున్నదని కూడా అన్నాడు. మానవ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు ఇంతకాలం చెప్పిన అమెరికా ఇప్పుడు ఈ విధంగా మాట్లాడటం విధిలేక తప్ప మరొకటి కాదు. ప్రధాని నెతన్యాహు మంచివాడే గానీ అక్కడి ప్రభుత్వం ఆ దిశగా కదిలేందుకు ఆటంకంగా ఉందని, భద్రతా మంత్రి బెన్ గువిర్ మరికొందరు రెండు దేశాలు ఏర్పడాలన్న పరిష్కారాన్ని కోరుకోవటం లేదని బైడెన్ చెప్పటం నయవంచన.

అమెరికా పాటకు అనుగుణంగా నృత్యం చేసేందుకు నిరాకరిస్తూ అత్యంత సన్నిహిత దేశాలైన కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వ్యతిరేకంగా ఓటేశాయి. పాలస్తీనా సమస్య మీద ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రపంచం నుంచి వేరు పడింది. దాన్ని కంటిరెప్పలా కాపాడుతున్న అమెరికా సైతం చివరికి స్నేహితుల నుంచి కూడా దూరమవుతుందా అన్నట్లుగా ఉంది. ఆ దేశాలు పూర్తిగా తెగతెంపులు చేసుకుంటాయని అనుకోనవసరం లేదు గానీ అమాయక పౌరుల ప్రాణాలు తీస్తున్న ఇజ్రాయిల్ పట్ల అమెరికాతో కలసి నడిచేందుకు అవి సిగ్గుపడుతున్నాయి. పైన పేర్కొన్న మూడు దేశాలు, బ్రిటన్, అమెరికా కలసి 'ఐదు నేత్రాల' పేరుతో గూఢచార సంస్థల సమాచారాన్ని పంచుకుంటున్నాయి. బహుశా దానిలో ఇజ్రాయిల్‌ను సమర్ధించే అంశం ఒక్కటి కూడా దొరికి



ఉండదు. అందుకే అన్నింటా తోడుండే బ్రిటన్, జర్మనీ చివరికి అమెరికా సాయం కోసం అర్రులు చాస్తున్న ఉక్రెయిన్ కూడా ఐరాస ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గాజాలో తక్షణమే దాడులను విరమించాలన్న తీర్మానాన్ని భద్రతామండలిలో గత శుక్రవారం నాడు అమెరికా వీటో చేసిన తరువాత ఐరాస సాధారణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 153, వ్యతిరేకంగా పది, ఓటింగ్‌కు దూరంగా 23 ఉన్నాయి. ఇదే అంశంపై అక్టోబరు 26న జరిగిన ఓటింగ్‌లో 120-14-45 చొప్పున వచ్చాయి. తాజా ఓటింగ్ తీరు దేశాల వైఖరిలో వచ్చిన మార్పుకు నిదర్శనం. నాటి ఓటింగ్‌లో తటస్థంగా ఉన్న మన దేశం ఈ సారి అనుకూలంగా ఓటు వేయాల్సి వచ్చిందంటే అంతర్గతంగా ఇజ్రాయిల్‌ను బలపరచాలని ఎంతగా ఉన్నప్పటికీ వ్యక్తం చేయలేని స్థితి, సభ్య సమాజం వేలెత్తి చూపుతుందన్న భయమన్నది స్పష్టం.

గాజాలో దాదాపు నివాస ప్రాంతాలన్నింటినీ కూల్చివేయటమో, ఉండటానికి పనికిరాకుండా చేయటమో చేశారు. పద్దెమినిది వేలు దాటిన మృతుల్లో సగం మంది పిల్లలే ఉన్నారు. హమాస్ తీవ్రవాదులు దాక్కున్నారంటూ కూల్చివేసిన ఆసుపత్రుల, విద్యా సంస్థల గురించి చెప్పనవసరం లేదు. ఇంత చేసినా బందీలుగా ఉన్న మిగతావారి ఆచూకీ గానీ, హమాస్ సాయుధులు ఎంత మందిని చంపివేసిందీ చెప్పలేని స్థితి ఒకవైపు. మరోవైపు అనేక చోట్ల ఎదురవుతున్న ప్రతిఘటనలో వేలాది మంది ఇజ్రాయిలీ సైనికులు మరణించటమో, కాళ్లు చేతులు పోగొట్టుకోవటమో జరిగిందనే వార్తలు. ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటిస్తూనే గాజాలో అమాయకుల పౌరుల ప్రాణాలు పోతున్నాయంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన సందర్భంగా జో బైడెన్ మంగళవారం నాడు మొసలి కన్నీరు కార్చాడు. వచ్చే ఏడాది ఎన్నికల్లో తనకు విరాళాలు ఇచ్చే వారితో జరిపిన సమావేశంలో విచక్షణా రహితంగా బాంబుదాడులు చేస్తున్నందున ప్రపంచమంతటా ఇజ్రాయిల్ మద్దతు కోల్పోతున్నదని కూడా అన్నాడు. మానవ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు ఇంతకాలం చెప్పిన అమెరికా ఇప్పుడు ఈ విధంగా మాట్లాడటం విధిలేక తప్ప మరొకటి కాదు. ప్రధాని నెతన్యాహు మంచివాడే గానీ అక్కడి ప్రభుత్వం ఆ దిశగా కదిలేందుకు ఆటంకంగా ఉందని, భద్రతా మంత్రి బెన్ గువిర్ మరికొందరు రెండు దేశాలు ఏర్పడాలన్న పరిష్కారాన్ని కోరుకోవటం లేదని బైడెన్ చెప్పటం నయవంచన. పార్టీ ఏదైనా నిజానికి అక్కడి పాలకులు, అధికార యంత్రాంగంలోని వారు దుర్మార్గంలో ఎవరూ ఎవరికి తీసిపోరు, అందరూ అందరే. అలాంటి వారిని బలపరుస్తున్న అమెరికా అధికార, ప్రతిపక్ష నేతలూ వారికేమీ తక్కువకాదు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత పి వి సుబ్బరాజు 1917 మార్చి 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా జిన్నూరు గ్రామంలో జన్మించారు. స్వాతంత్రోద్యమ కాలంలో ఎంతో చైతన్యం కలిగిన గ్రామం అది. అక్కడే ఎలిమెంటరీ స్కూల్, పాలకొల్లు మున్సిపల్ హైస్కూల్లో విద్యాభ్యాసం చేశారు. విద్యార్థి దశలోనే కాంగ్రెసులో చేరి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. అప్పుడే దేశంలో ప్రవేశిస్తున్న సోషలిస్ట్ భావాల పట్ల ఆకర్షితులు అయ్యారు. తర్వాత కాంగ్రెసు సోషలిస్ట్ పార్టీలో చేరారు. పాలకొల్లులో విద్యార్థిగా ఉన్నప్పుడే అప్పటి ప్రముఖ కాంగ్రెసు నాయకుడు ఉద్దరాజు రామం, భీమవరం సభలో కమ్యూనిస్ట్ నేత పుచ్చలపల్లి సుందరయ్య గార్లతో పరిచయం అయ్యింది. ఉపాధ్యాయుడుగా ఉంటే తన భావాలను మరింత వ్యాప్తి చేయవచ్చుననే భావనతో టీచర్ ట్రైనింగ్‌లో చేరి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. కమ్యూనిస్ట్ పార్టీలో ఎన్ని విభేదాలు, చీలికలు వచ్చినా తొలినాళ్లలో పరిచయం అయిన సుందరయ్య, రామం గారి బాటలోనే చివరి వరకు నిలబడ్డారు.

ఉపాధ్యాయ ఉద్యమ చుక్కాని పివి సుబ్బరాజు



ఒక వైపు ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. అదే క్రమంలో 1942 తణుకు సమావేశంలో ఉద్దరాజు రామం, పరకాల పట్టాభిరామారావు, భూపతిరాజు లక్ష్మీనరసరాజులతో పాటు సుబ్బరాజును అరెస్ట్ చేసి తాడేపల్లిగూడెం జైల్లో నిర్బంధించారు. సుబ్బరాజు మంచి ఉపాధ్యాయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సుబ్బరాజు మాస్టారు గాను కమ్యూనిస్ట్ సుబ్బరాజు గాను పేరుగాంచారు. ఆయన కమ్యూనిస్ట్ అని ఓర్వలేని కాంగ్రెస్ వారు అనేక దూర ప్రాంతాలకు బదిలీ చేయించే వారు. ఆయన మొత్తం సర్వీసులో జిన్నూరు, వాలమర్రు, రాయకుదురు, గణపవరం, వెంప, సిద్ధాంతం, వీరవాసరం, యలమంచిలి తదితర దూర ప్రాంతాలకు బదిలీ చేయబడ్డారు. వెళ్ళిన ప్రతిచోట ఒకవైపు ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరు తెచ్చుకోవడం, మరొక వైపు అభ్యుదయ భావాల బీజాలు నాటడం, రెండో విషయాన్ని సహించలేక గ్రామ పెద్దలు ఆయన్ని బదిలీ చేయించడం, విద్యార్థులు దాన్ని వ్యతిరేకించడం ప్రతి సందర్భంలోను జరిగేది. గ్రామగ్రామాన సైకిల్ మీద తిరుగుతూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించారు. ఉద్యమాల్లో రాటుదేలి ఉపాధ్యాయుల హృదయాల్లో చెరగని ముద్రవేసిన సుబ్బరాజు నిరాడంబరత, నిక్కచ్చితనం, ఉద్యమ నిర్మాణ దక్షత ఆయన సొత్తు.

నిద్రాణంలో వున్న పశ్చిమగోదావరి జిలా టీచర్స్ గిల్డ్‌ను పునరుజ్జీవింప చేసి, జిల్లా కార్యదర్శిగా ఎన్నికై సుదీర్ఘ కాలం పని చేశారు. ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్రశాఖకు ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా సేవలందించారు. మహాసభలు నిర్వహించడంలో ఆయన అందెవేసిన చేయి. ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను 1961లో ఏలూరులో, మరొకసారి తాడేపల్లి గూడెంలో జయప్రదంగా నిర్వహించారు. యాభై ఏళ్ల ప్రజా జీవితంలో అలుపెరుగని పోరాటాలు నిర్వహించారు. ధరించే దుస్తులు మొదలు జీవనశైలి వరకు కమ్యూనిస్టతత్వం అడుగడుగునా కనిపించేది. సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రగతిశీల ఉద్యమాలలో భాగస్వామై కష్టాలను లెక్కచేయక, నమ్మిన ఆశయానికి కట్టుబడి జీవితాంతం అచంచలంగా నిలచిన ధన్యజీవి. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య గారికి సుదీర్ఘ సన్నిహిత ఉద్యమ సహచరుడు. ఉద్యమ నిర్మాణం కోసం ఎన్నో అగ్ని పరీక్షల్లో చలించకుండా నిలబడిన వ్యక్తి. అధ్యయనం, అనుభవం, ఆచరణ వల్ల ఏర్పడిన కచ్చితమైన నిర్దిష్టమైన రాజకీయ విశ్వాసాలు కలిగి ఆశయానికి ఆచరణకు తేడా లేకుండా జీవించిన ఆదర్శజీవి సుబ్బరాజు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రజా ఉద్యమాలకు అండదండలందిస్తూ క్రియాశీలకపాత్ర పోషించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని విస్తృత పరిచేందుకు విశేష కృషి చేశారు. సాత్వికుడుగా పేరు పొందారు. ఉద్యమమే ఊపిరిగా తుది శ్వాస వరకు ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితమై విశేష కృషి చేసిన కమ్యూనిస్ట్ పార్టీ ముద్దుబిడ్డ సుబ్బరాజు.

అన్ని ప్రాంతాల, అన్ని మేనేజిమెంట్ల, అన్ని కేడర్ల సమైక్య సంఘంగా చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న ఏర్పడిన సంస్థ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటియఫ్) ఆవిర్భావంలో కూడా సుబ్బరాజు పాలు పంచుకున్నారు. యూటియఫ్ ప్రథమ మహాసభలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికై బాధ్యతలు నిర్వర్తించారు. వెంటనే విజయవాడకు మకాం మార్చి ఆఫీసు కార్యదర్శిగా చాలా సంవత్సరాలు పనిచేశారు. ఐక్యఉపాధ్యాయ పత్రికకు సంపాదకవర్గ సభ్యునిగా కొంతకాలం పని చేశారు. జీవితంలో ఎన్నో ఒడి దుడుకులను చవిచూశారు. ఆర్థికంగా, ఆరోగ్య పరంగా అనేక కుటుంబ సమస్యలు ఎదుర్కొన్నారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఆశయ సాధన, ఉద్యమాల్లో ఏనాడూ వెనకడుగు వెయ్యలేదు. కుటుంబం ఎంతో కష్టదశలో ఉన్నా నైతిక ప్రమాణాలు విడిచి పెట్టలేదు. పార్టీ గాని యూనియన్ గాని ఇచ్చిన ప్రతి బాధ్యత నిర్వహించడంలో శెభాష్ అనిపించుకొనేవారు. తన ఐదు దశాబ్దాల ఉద్యమంలో త్యాగం, శ్రమ, విలువలు, క్రమశిక్షణ ఆయన మిగిల్చిన ఆస్తులు. ఆయన జీవితం, ఉద్యమ కృషి, నమ్మిన ఆశయం పట్ల నిబద్ధత, భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దాయకం. 1983 డిసెంబర్ 15 న సుబ్బరాజు హైదరాబాదు నిమ్స్ ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. ఆయన కుమారులు పి.లచ్చిరాజు (బిఎస్ఎన్ఎల్, విశాఖపట్నం), పి.విష్ణు (బ్యాంకింగ్, హైదరాబాదు) కూడా ఇప్పటికీ అభ్యుదయ ఉద్యమాలకు అండదండలు అందిస్తున్నారు. ఏలూరులో యూటియఫ్ జిల్లా కార్యాలయానికి "పి వి సుబ్బరాజు టీచర్స్ హోమ్" అని పేరు పెట్టి ఆయన నిబద్ధతకు, సేవలకు శాశ్వత రూపం ఇచ్చారు. సుబ్బరాజు వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులను చైతన్యపరుస్తూ సమసమాజ నిర్మాణానికి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి.

(నేడు కామ్రేడ్ పివి సుబ్బరాజు 40వ వర్ధంతి)

- పి.విష్ణు

జ్ఞానం ముసుగులో అజ్ఞానుల ప్రవచనాలు

"మానవులంతా ఒకే జాతివారని చెప్పేందుకు ప్రత్యేక సాక్ష్యాధారాలేం అవసరం లేదు. ఒక కుక్క మరో కుక్కని చూసినపుడు అది తన జాతికి చెందిన జంతువే అని గ్రహించగలుగుతుంది. మనిషికి మాత్రమే తోటి మనిషిని చూసినపుడు అనేక సందేహాలు కలుగుతుంటాయి. అంటే జంతువుకంటే మనిషే నికృష్టంగా ప్రవర్తిస్తున్నా దన్నమాట!" - అని అన్నారు. సామాజిక ఉద్యమకారుడు, తత్త్వవేత్త: నారాయణ గురు.



డాక్టర్ దేవరాజు మహారాజు

ఈ మతం, ఆ మతం అని కాదు దాదాపుగా అన్నీ ఒకటే! బయటికి అన్నీ వేరు వేరుగా కనిపిస్తాయి. కాని, మూర్ఖత్వాన్ని ప్రచారం చేయడంలో ఒకే రకంగా ప్రవర్తిస్తాయి. వేర్వేరు భాషల్లో ప్రవచనాలు, బోధలు, సూక్తులు, దైవ వాక్కుల పేరుతో వేరు వేరు ప్రాంతాల్లోని జనానికి అసత్యాలు బోధిస్తుంటాయి. మూఢ విశ్వాసాలు ప్రచారం చేయడంలో అన్నీ సమైక్యంగా కృషి చేస్తాయి. అసలు విషయం గ్రహించలేక, జనం 'మా మతమే గొప్పది ఇతరులది కాదు' అని పోట్లాడుకుంటూ ఉంటారు. వారిలో వారు ద్వేష భావంతో రగిలిపోతుంటారు. మతం గుప్పిట్లోంచి బయటపడిన వారికే నిజాలు బోధపడతాయి. జీవిత సత్యాలు అర్థమవుతాయి. జై శ్రీరామ్ - అంటూ మనో భావాలు దెబ్బతిన్నాయనే వారు కొందరుంటారు. "మీకు హిందూ మతమే దొరికిందా? ఇతర మతాల్ని విమర్శించే గుండె ధైర్యం మీకు ఉందా? - అని సవాలు విసురుతుంటారు. అలాంటి వారు ఒక విషయం ఆలోచించాలి. ముందు ఎవడి ఇల్లు వాడు శుభ్రం చేసుకుని కాదా వీధిలోకి చూడాలి? ఆ తర్వాత ఎదురిల్లూ ఈ పక్క ఆ పక్క ఇళ్ళూనూ- మీ ఇంట్లో మురికి అలాగే పెట్టుకుని, ఇతరుల ఇళ్ల శుభ్రం చేయడానికి బయలుదేరుతారా? బయలుదేరరు కదా? ఇదీ అలాంటిదే మత మౌఢ్యాన్ని నిరసించేవారు అన్ని మతాల్లోని మౌఢ్యాన్ని నిరసిస్తారు. ఆ విషయం గుర్తు పెట్టుకోవాలి. ముందు కాస్త అవగాహన పెంచుకోవాలి. ఆ తరువాతే నోరు విప్పాలి. ఇక్కడ కొన్ని ఉదాహరణలు ఇస్తున్నాను ఎవరికి వారు విశ్లేషించుకుని, ఆలోచించుకోండి!

1. ఎవడైనా శివనింద చేస్తే వాడి నాలుక ఎడం చేత్తో పట్టుకుని, పైకి లాగి - కత్తితో మొదటికి పరపరా కోసెయ్యాలి.

మతాలు సాగించే పేచీలు ఎలా ఉంటాయో మహాకవి గుర్రం జాషువా వర్ణించిన తీరు చూడండి. "ఒకడు రుద్రాక్ష మాలికలు నెత్తికి చుట్టి/ శివమూర్తియై భూమి కవతరించు/ ఒక దూర్వ పుండ్రంబులురువుగా తగిలించి/ శివలిం గమును జూచి చీదరించు/ ఒకడు రెండును గాని వికట వేషము దాల్చి/ పై వారి మీద సవాలు చేయు/ ఒకడు గంజాయి దమ్ముకు దాసుడై పోయి/ బూడిద గురవడై పుట్టివచ్చు/ మనుజులారా మాది ఘనమైన మతమని/ ఒకడు తరిమి తరిమి ఉగ్గడించు/ పెక్కు మతము లిట్లు పేచీలు సాగింప/ మార్గమేది ఐక్య మత్యమునకు/ చిలిపి రాళ్ళకు నగిషీలు చెక్కి చెక్కి/ కాలమెంత యుగాంతాన గలిపిరొక్కొ/చదువ నేర్చిన వెర్రిని చంపగలరె?..."

2. శివనింద తట్టుకోలేక పోతే ప్రాణం వదిలిపెట్టెయ్యాలి. 3. ఆ రెండింటికీ నువ్వు చాలక పోతే, చెవులు మూసుకుని వెళ్ళిపోవాలి. 4. శివనింద వినరాదు - అనరాదు - చేయరాదు : ఇలాంటి మూర్ఖపు బోధనలు చేసే వారు మనమధ్యనే ఉన్నారు. వివేకం అడుగం టినవారు- గడ్డిపోచ 'పాటి' వారు మన మధ్యనే ఉన్నారు. జాగ్రత్త! వారిని దరికి రానీయకండి. మీ వివేకాన్ని కప్పేసుకోకండి.

మతాలు సాగించే పేచీలు ఎలా ఉంటాయో మహాకవి గుర్రం జాషువా వర్ణించిన తీరు చూడండి. "ఒకడు రుద్రాక్ష మాలికలు నెత్తికి చుట్టి/ శివమూర్తియై భూమి కవతరించు/ ఒక దూర్వ పుండ్రంబులురువుగా తగిలించి/ శివలింగమును జూచి చీదరించు/ ఒకడు రెండును గాని వికట వేషము దాల్చి/ పై వారి మీద సవాలు చేయు/ ఒకడు గంజాయి దమ్ముకు దాసుడై పోయి/ బూడిద గురవడై పుట్టివచ్చు/ మనుజులారా మాది ఘనమైన మతమని/ ఒకడు తరిమి తరిమి ఉగ్గడించు/ పెక్కు మతము లిట్లు పేచీలు సాగింప/ మార్గమేది ఐక్యమత్యమునకు/ చిలిపి రాళ్ళకు నగిషీలు చెక్కి చెక్కి/ కాలమెంత యుగాంతాన గలిపిరొక్కొ/ చదువనేర్చిన వెర్రిని చంపగలరె?..."

ప్రతి శివరాత్రికి ఈశా ఫౌండేషన్ నిర్వాహకుడు జగ్గీ వాసుదేవ్ ఐదు లక్షల యాభైవేల, ఐదు వందల టికెట్లు అమ్ము కుంటూ ఉంటాడు. "దేవుడు, ఆధ్యాత్మికత పేరుతో వ్యాపారం చేస్తున్నాడని" స్వయంగా తమిళనాడు ఆర్థిక మంత్రి పిటిఆర్. పళనివేల్ త్యాగరాజన్ ప్రకటించాడు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలను తమ గుప్పిట్లోంచి వదిలేయాలని, వాటిని భక్తులకు అప్పగించాలనీ జగ్గీ వాసుదేవ్ చేసిన ప్రకటనకు ప్రతిస్పందనగా ఆర్థిక మంత్రి, జగ్గీ బండారం బయట పెట్టాడు. ఆధ్యాత్మికత పేరుతో ధనిక వర్గాన్ని మోసం చేస్తూ, వ్యాపారాలు చేస్తున్న బాబాల - స్వాముల బండారం బయట పెట్టాల్సిందే! ఆదివాసుల భూములు అక్రమంగా ఆక్రమించుకుని 'ఈషా' ఫౌండేషన్ స్థాపించుకున్న మోసగాడు జగ్గీ వాసుదేవ్. తన భార్యను హత్య చేసిన హంతకుడతను. అలాంటి వాడి మీద ప్రభుత్వం ఎందుకు ఉదాసీన వైఖరితో ఉందీ? ఇంతవరకు కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదూ?

ఇటీవల స్వామి ఆనంద్ స్వరూప్ వ్యభిచారం బయట పడింది. ముస్లింలు, క్రైస్తవులు భారతదేశం నుండి వెళ్ళిపోవాలని ప్రబోధించిన శంకరాచార్య పరిషత్ అధ్యక్షుడు స్వామి ఆనంద స్వరూప్ శ్రీలంకలో వేశ్యలతో పట్టుబడ్డాడు. ఒక గదిలో ఒకేసారి ఇద్దరు మహిళలతో దొరికిపోయాడు. వీడియో జర్నలిస్టులు కెమెరాలతో ఆ గదిలోకి ప్రవేశించే సరికి బట్టలు కప్పుకుంటూ ఆ ముగ్గురూ నానా తంటాలు పడ్డారు. స్వామి ఆనంద స్వరూప్ అనే వాడికి దేహశుద్ధి జరిగింది. ఈ మొత్తం చిత్రించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొట్టింది. బుద్ధి, జ్ఞానంలేని వాళ్లు ఈ దేశంలో స్వామీజీలు అయి పోతున్నారు. లేదా బూర్జువా రాజకీయ పార్టీలలో నాయకులై అధికారం చేజిక్కించుకుంటున్నారు. ఈ పరిస్థితి మారాలి! మతాలకు రాజకీయాలకు ఉన్నలింకు తెగితేనే అది సాధ్యం!

కేవలం పదిహేను వందల ఏళ్ళ క్రితం మదీనాలో అంటే దేవదూత అనబడే ప్రొఫెట్ మహ్మద్ జన్మస్థానంలోనే ఖురాన్ అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. సాధారణ శకం 570-632 C.E మధ్య కాలంలో జీవించిన ప్రొఫెట్ మహ్మద్ జ్వరంతో చనిపోయాడని చరిత్రలో నమోదై ఉంది. మరి ఆ దేవదూతను ఏ దేవుడూ బతికించలేదు. ఖురాన్ సృష్టి ప్రారంభం నుండే ఉంది - అని ముస్లిం మత పెద్దలు ప్రచారం చేసుకుంటారు. అన్ని మతాల మత పెద్దలదీ ఇదే వరస! అబద్ధాలనే ప్రచారం చేశారు. ఇంకా చేస్తునే ఉన్నారు. "మా మతంలో చంద్రుడికి చాలా ప్రాముఖ్యం ఇవ్వబడింది. ఎందుకంటే చంద్రుడు రాత్రి వేళల్లో మాకు అవసరమున్నప్పుడు వెలుగునిస్తాడు. సూర్యుడిలాగా పగటి పూట వెలగడు పగటి పూట వెలుతురు ఎవడికి కావాలీ?-దీని వల్ల ఏం తెలుస్తుందంటే మతాలన్నింటిలోకి మా ముస్లిం మతమే తెలివైనదని"- అని అన్నాడు. ఒక ముస్లిం మత పెద్ద మౌలాన హుజూర్ ముఖ్ ముద్దీన్ ఖాన్ - వారి తెలివిగల మతం గురించి ఈ తెలివిగల మతపెద్ద ఎంత తెలివిగా మాట్లాడారో కదా? పగటి వెలుగులన్నీ సూర్యుడిస్తున్నవేనన్న ప్రాథమిక అవగాహన లేని ఈ మౌలాన, మూర్ఖత్వాన్ని ఎవడు ఛేదించాలీ? సూర్యుడి వెలుగులు లేకపోతే చెట్లు, జంతువులు, మనుషులు - ఏవీ బతకలేవని ఈయనకు ఎవరు చెప్పాలి? ఇక, విటమిన్ - డి పరిజ్ఞానం కలగాలంటే ఇంకా ఎన్ని శతాబ్దాలు గడవాలీ?



గొప్పగా చెప్పుకునే ఖురాన్ లోని కొన్ని అంశాలు చూద్దాం. మానవీయ విలువల్ని అది ఎంతగా నిలుప గలుగుతుందో ఆలోచిద్దాం!

అల్లాను నమ్మని వారిని కనిపించిన చోటనే నరికి చంపండి. (2:191) ముస్లింలు, ముస్లింలు కాని వారితో స్నేహం చేయరాదు (3:28) ఇస్లాం తప్ప ఇంకే మతమూ ఒప్పుకోబడదు (3:85) ఇస్లాంను విమర్శించే వారిని వికలాంగులను చేసి వేలాడదీయండి (5:33) ఖురాన్ కాక, ఇతర గ్రంథాలను నమ్మే వారిని భయభ్రాంతులను చేసి వారి తలలు తీయండి (8:12) అల్లాను నమ్మని వారిని భయభ్రాంతులను చేయుటకు ముస్లింలు తమవద్ద ఉన్న అన్ని ఆయుధాలను వాడాలి (8:60) అల్లాను నమ్మనివారు మూర్ఖులు. ముస్లింలు వారితో పోరాడాలి (8:65) అవకాశం దొరకగానే అల్లాను నమ్మని వారిని ఎక్కడ దొరికితే అక్కడ చంపేయండి (9:5) యూదులు, క్రిస్టియన్లు భ్రష్టులు. వారితో పోరాడండి (9:30) మీ ఇంటి చుట్టు పక్కల ఉండే అవిశ్వాసులతో యుద్ధం చేయండి (9:123) అల్లాను నమ్మని వారిని కాలుతున్న బట్టలతో ఇనుప చువ్వలతో, మసిలే నీళ్లతో శిక్షించండి. వారి చర్మం, శరీరం కరిగిపోవాలి (22:19) అల్లాను నమ్మని వారితో శాంతికోసం, సంధికోసం, ప్రయత్నించకండి. వారు దొరికినంతనే నరికేయండి (47:4)

ఇటీవల స్వామి ఆనంద్ స్వరూప్ వ్యభిచారం బయట పడింది. ముస్లింలు, క్రైస్తవులు భారతదేశం నుండి వెళ్ళిపోవాలని ప్రబోధించిన శంకరాచార్య పరిషత్ అధ్యక్షుడు స్వామి ఆనంద స్వరూప్ శ్రీలంకలో వేశ్యలతో పట్టుబడ్డాడు. ఒక గదిలో ఒకే సారి ఇద్దరు మహిళలతో దొరికిపోయాడు. వీడియో జర్నలిస్టులు కెమెరాలతో ఆ గదిలోకి ప్రవేశించే సరికి బట్టలు కప్పుకుంటూ ఆ ముగ్గురూ నానా తంటాలు పడ్డారు. స్వామి ఆనంద స్వరూప్ అనే వాడికి దేహశుద్ధి జరిగింది. ఈ మొత్తం చిత్రించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొట్టింది. బుద్ధి, జ్ఞానం లేని వాళ్లు ఈ దేశంలో స్వామీజీలు అయిపోతున్నారు. లేదా బూర్జువా రాజకీయ పార్టీలలో నాయకులై అధికారం చేజిక్కించుకుంటున్నారు. ఈ పరిస్థితి మారాలి! మతాలకు రాజకీయాలకు ఉన్నలింకు తెగితేనే అది సాధ్యం!

శివనింద చేసిన వాణ్ణి ఏం చేయాలో ఓ హిందూ గురువు చెప్పాడు కదా? అల్లాను నమ్మని వాణ్ణి ఏం చేయాలో ఈ ముస్లిం గ్రంథం కూడా చెపుతోంది. ఇలాంటి మతాలు, మత గ్రంథాలు, మత గురువులూ మనకు అవసరమా? ఇవి మానవ సంక్షేమం కోసం, ప్రపంచ శాంతి కోసం దోహదం చేసేవేనా? ఉగ్రవాదం బలపడడానికి ఇవి కారణం కాదా? నోబెల్ పురస్కార గ్రహీత మలాలా యూసఫ్ జాయ్ ఏమన్నారో గుర్తుచేసుకోండి. "ముందు తరాలకు విద్యను అందించాలి లేకపోతే వారికి ఉగ్రవాదులు తుపాకులు అందిస్తారు" అని ఆమె చెప్పిన మాట నిత్యజీవితంలో మనకు కనపడుతూ ఉంది!

"మన కళ్ళ ముందు ఉన్నా మనం చూడని, చూడలేని విషయాలు అనేకం ఉంటాయి. కొన్ని భయం వల్ల చూడం కొన్ని బలమైన భావజాల ప్రభావం వల్ల మనకు కనిపించవు. ఒక్కోసారి మనకు అలవడిన దృక్కోణం వల్ల గానీ, మనం ఎంచు కున్న దృక్కోణం వల్లగానీ, కొన్ని విషయాలు కళ్ళముందు ఉండి కూడా కనిపించవు. వీటిలో విడి విడి విషయాలే కావు. సామాజిక క్రమాలు కూడా ఉంటాయి. వీటిని మనకు చూపించడం సాహిత్యం చేసే పనులలో ఒకటి" - అన్నారు మానవ హక్కుల ఉద్యమ నేత - బాలగోపాల్ నిజమే! అలాంటి సాహిత్యాన్ని సృష్టించుకుంటూ, దాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం ఇప్పుడు మన అందరి తక్షణ కర్తవ్యం.

- సుప్రసిద్ధ సాహితీవేత్త , విశ్రాంత ప్రొఫెసర్
(మెల్బోర్న్ నుంచి)

బీఆర్ఎస్ ఓటమికి ఇవీ కారణాలే!

తెలంగాణ సాధించి పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలవటం స్వయం కృతమే. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో కీలకపాత్ర వహించిన నేత ఆదే ప్రజల ఆత్మగౌరవాన్ని ఘోరంగా గాయపరచడంతోనే ఈ ఫలితం సంభవించింది అనేది జనవాక్కు. "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంతో అధికారం చేపట్టిన కేసీఆర్ నియామకాలను పూర్తిగా విస్మరించారు. మరోపక్క ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటంతో పాటు, సంఘాలను నిర్వీర్యం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానం లేకుండా చేస్తానన్న మాటను గాలికి వదిలేశారు. తెలంగాణ సాధనలో కీలక భూమిక పోషించిన ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. "ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను" పునరుద్ధరించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో అందులో ఉన్న సభ్య సంఘాలకు సకాలంలో అదర్ డ్యూటీ సౌకర్యం, ఓడి కల్పించలేదు. అనేక ఏండ్ల పాటు పోరాటం చేసి తెలంగాణ సాధించామని చెప్పుకున్నవారు అధికారంలోకి వచ్చాక శ్రామిక ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల్ని పరిష్కరించమని వేడుకుంటే ఆలకించలేదు. నిరసనలు, ధర్నాలు, పోరాటాలు చేస్తే కఠినంగా అణిచివేశారు. నిరసన తెలియజేసేందుకు కూడా అవకాశం లేకుండా ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌ను ఎత్తివేశారు.

నూతన రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం నుంచి బయటికి వచ్చి పాత పెన్షన్ విధానం అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాలతో కనీసం మాట మాత్రంగా కూడా చర్చించకుండానే సీపీఎస్ అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. ఉద్యోగ ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారంలోనూ అంతే సాచివేత వైఖరిని కనబరిచింది. పే రివిజన్ కమిటీ, ఐ.ఆర్ ప్రకటించే సందర్భంలో కూడా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా, నియంతత్వంగా వ్యవహరించారు. టీఎన్జీవో, టీజీవో, మరికొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులను చేరదీసి తమ సమస్యల పట్ల నిరసన తెలియజేయకుండా చేయగలిగారు. ఉద్యోగ ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడకుండా చేయడంలో విజయవంతమయ్యారు. కొందరు నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలను నెరవేరుస్తూ, వారి బలహీనతలను ఆసరా చేసుకుని ఆ సంఘాలను నిర్వీర్యం చేసారు. ముఖస్తుతి చేసే నాయకుల మాటలు నమ్మి ఉద్యోగుల ఆగ్రహాన్ని ప్రభుత్వం పసిగట్టలేదు. ఆ సంఘాలు, నాయకులే మళ్లీ నూతన ప్రభుత్వం పంచన కూడా చేరి తప్పు దారి పట్టించే ప్రయత్నం చేస్తారనడంలో సందేహం లేదు! నూతన ప్రభుత్వం వారి పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

2018 పీఆర్‌సీని 2020 ఏప్రిల్ నుంచి అమలు చేసి 21 నెలల పీఆర్‌సీ ప్రయోజనాలను కృష్ణార్పణం అన్నారు. రెండు నెలల బకాయిలను 18 వాయిదాలలో చెల్లిస్తామని చెప్పి ఈ నాటికీ పూర్తిగా చెల్లించని పరిస్థితి. ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్రం, మరికొన్ని రాష్ట్రాలు మనకన్నా ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ 'దేశంలో అందరి కన్నా మన ఉద్యోగులకే ఎక్కువ జీతాలు చెల్లిస్తున్నాం' అంటూ చౌకబారు ప్రచారం చేస్తూ ఉద్యోగులపై ప్రజలకు ద్వేషం పెంచే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలతో పాటు ఉద్యోగ,



ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆగ్రహం తెలియజేశారు. 1,71,370 ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్స్‌లో సింహభాగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేశారంటే గత ప్రభుత్వంపై ఉద్యోగ ఉపాధ్యాయులు ఎంత అసంతృప్తిగా, ఆగ్రహంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేకపోవడం, జీతాలు ఒకటో తేదీన చెల్లించండి మహాప్రభో అని అడిగితే "కాస్త ఆలస్యం అయితే చచ్చిపోతారా?" అనే విధంగా మాట్లాడటం, ఏరియర్ బిల్స్, జీపీఎఫ్, టిఎస్జిఎల్ఐ, సరెండర్ లీవ్ వంటివి సకాలంలో చెల్లించకపోవడం, రిటైర్ అయిన సందర్భంలో పెన్షన్, గ్రాట్యూటీ, కమ్యూటేషన్ ఇతర బకాయిల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. "ఉద్యోగులు తమ పిల్లల పెండ్లి ఖర్చులకు జీపీఎఫ్ లోన్ పెట్టుకుంటే బారసాల నాటికి గాని రావు" అని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎగతాళిగా చర్చించుకోవడం పరిస్థితికి చక్కని ఉదాహరణ.



జి.వి.నాగమల్లేశ్వరరావు
9676960880

రాష్ట్రం ఏర్పడితే కార్మికుడి కొడుకు మొదలు కలెక్టర్ కొడుకు వరకు అందరికీ ఒకే విధమైన, నాణ్యమైన, ఉచిత విద్యను అందించే విధంగా "కేజీ టు పీజీ విధానం" తీసుకువస్తామని ప్రకటించిన ఉద్యమ కాలంనాటి మాటలు నీటి మూటలు కావడం కూడా బీఆర్ఎస్ ఓటమికి మరో కారణం. కులాల పేరుతో 750 గురుకులాలు స్థాపించి అదే 'కేజీ టు పీజీ' అని నమ్మించ చూడటం విస్తుగొలుపుతుంది. వాటిలో అయినా పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. మన రాష్ట్రంలో 60 లక్షల మంది బడీడు పిల్లలు ఉండగా, నాలుగున్నర లక్షలమంది పిల్లలకు గురుకులాల్లో చదువు చెప్పించి, ఇతర ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకుండా, వాటిలో ఉపాధ్యాయ పోస్టులు నింపకుండా మిగిలిన పిల్లల్ని ప్రయివేట్ పాఠశాలల దయాదాక్షిణ్యాలకు వదిలేయడం ఏ మాత్రం భావ్యమో ఆలోచించాలి? పదేండ్ల కాలంలో ఒకే ఒక్కసారి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారంటే విద్యారంగం పట్ల వారి చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. పరిస్థితి మీద ముఖ్యమంత్రి స్థాయిలో ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదంటేనే విద్యారంగం పట్ల నాటి ప్రభుత్వ చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

అందరికీ సమానమైన విద్యను అందించే విధంగా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని, గురుకులాలను కులాల ప్రాతిపదికన కాకుండా కామన్ డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావాలని, పాఠశాలలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, తరగతి గదులను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడానికి సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని, విద్యావాలంటీర్లను నియమించాలని టీఎస్ యుటిఎఫ్, యూస్‌పీఎస్ చేసిన ప్రతిపాదనలు పట్టించుకోలేదు. రెండు పేజీల్లో ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించుకుందామని చెప్పిన ముఖ్యమంత్రి "కామన్ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పువచ్చి, దానికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చినా, దాన్ని అమలు చేయడంలో చూపిన అశ్రద్ధ వల్ల తిరిగి రాష్ట్ర హైకోర్టు కొట్టేసే పరిస్థితి దాపురించింది. ఫలితంగా ఏండ్ల తరబడి ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించుకోలేని దుస్థితి నెలకొంది.

ఉపాధ్యాయులకు సకాలంలో ప్రమోషన్లు లేవు, బదిలీలు లేవు, 317 జీవోతో ఉపాధ్యాయుల్ని చెట్టుకొకరు, పుట్టకొకరుగా చేసిన పరిస్థితి. ఆరేండ్ల క్రితం అప్‌గ్రేడ్ చేసిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వని పరిస్థితి, 5వేల పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు సృష్టిస్తానని పట్టించుకోలేదు. రాష్ట్రంలో పాఠశాలల పర్యవేక్షణ అధికారుల పోస్టులు దాదాపు అన్నీ ఖాళీగా ఉన్న స్థితి. ఉత్తర్వులు ఇచ్చి కూడా ప్రమోషన్లు, బదిలీలు అమలు చేయలేనటువంటి అసమర్థత. సీఎంఓ అనుమతి లేకుండా విద్యాశాఖ మంత్రి గానీ, అధికారులు కానీ చిన్న నిర్ణయం కూడా తీసుకునే స్వేచ్ఛ లేదు. వీటన్నింటి నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపి నూతన ప్రభుత్వానికి పట్టం కట్టారు.

ఉపాధ్యాయులకు సకాలంలో ప్రమోషన్లు లేవు, బదిలీలు లేవు, 317 జీవోతో ఉపాధ్యాయుల్ని చెట్టుకొకరు, పుట్టకొకరుగా చేసిన పరిస్థితి. ఆరేండ్ల క్రితం అప్‌గ్రేడ్ చేసిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వని పరిస్థితి, 5వేల పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు సృష్టిస్తానని పట్టించుకోలేదు. రాష్ట్రంలో పాఠశాలల పర్యవేక్షణ అధికారుల పోస్టులు దాదాపు అన్నీ ఖాళీగా ఉన్న స్థితి. ఉత్తర్వులు ఇచ్చి కూడా ప్రమోషన్లు, బదిలీలు అమలు చేయలేనటువంటి అసమర్థత. సీఎంఓ అనుమతి లేకుండా విద్యాశాఖ మంత్రి గానీ, అధికారులు కానీ చిన్న నిర్ణయం కూడా తీసుకునే స్వేచ్ఛ లేదు. వీటన్నింటి నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపి నూతన ప్రభుత్వానికి పట్టం కట్టారు. పై విషయాలను నూతన ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని గతంలోలా కాకుండా మెరుగైన పాలనందించాలి. విద్యారంగాన్ని కొత్తపుంతలు తొక్కించాలి. ఉద్యోగ ఉపాధ్యాయులకు అండగా నిలవాలి. పెండింగ్‌లో ఉన్న వారి సమస్యలు పరిష్కరించి కొండంత అండగా తామున్నా మనే భరోసానివ్వాలి. అప్పుడే ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా కొత్త ప్రభుత్వానికి సహకరిస్తారు. లేదంటే షరామామూలే!

ప్రాజెక్టులపై మంత్రుల సమీక్ష

అధికారులపై ఆగ్రహం
పనులు సరిగ్గా జరగడం లేదని విమర్శలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులపై రాష్ట్ర సచివాలయంలోని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక విద్యుత్ శాఖల మంత్రి భట్టి విక్రమార్క ఛాంబర్ లో ఉమ్మడి ఆ శాఖ అధికారులతో ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి నల్లగొండ ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని డిండి, ఉదయ సముద్రం, బ్రాహ్మణవెళ్ళంల, ఎస్ఎల్‌బీసీ టన్నెల్, నక్కలగండి, చర్ల, రిజర్వార్లు, బునాది గాని పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి మూసి కాలువల పెండింగ్ పనులు పురోగతి గురించి వాడివేడిగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ. 2400 కోట్లతో చేపట్టిన ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రీ డిజైనింగ్ పేరిట రూ. 13వేల కోట్లకు ఎందుకు పెంచాల్సి వచ్చిందని అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్ట్ అంచనా వ్యయం పెంచడం వల్ల అదనంగా ఆయకట్టు పెరిగిందా? అంటూ అడిగారు. అందుకు అధికారులు ఏమాత్రం పెరగలేదని అంతే సమాధానం చెప్పారు. ఆయకట్టు పెంచకుండా రీ డిజైనింగ్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను పెంచి ప్రజల సంపదను దుర్వినియోగం చేయడం సరికాదని మంత్రి అన్నారు. ఇప్పటి వరకు సీతారామ ప్రాజెక్టులో జరిగిన పనుల గురించి వాస్తవాలు చెప్పాలని ఆదేశించడంతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు పూర్తయిన బ్యారేజీ కెనాళ్ల పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, చేయాల్సిన భూసేకరణ, కోర్టు కేసులు, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతుల గురించి మంత్రులకు వివరించారు. బ్యారేజ్ నిర్మాణానికి ఇంకా ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ రావాల్సి ఉందని, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. హెడ్ వర్క్స్ దగ్గర పనులు పూర్తి చేయకుండా చివరి కాలువల వద్ద పనులు పూర్తి చేసి ప్రాజెక్టు పురోగతిలో ఉందని చెప్పడం వల్ల కలిగే ప్రయోజనం ఏంటి అన్న దానిపై అధికారులు సమాధానం చెప్పకుండా నీళ్ళు మింగారు. నిజాలను దాచిపెట్టకండి వాస్తవాలు చెప్పండి అంటూ అధికారులను సుతిమెత్తగా మంత్రులు మందలించారు. శబరి, గోదావరి నదులు కలిసిన చోట 365 రోజుల పాటు గ్రావిటీ ద్వారా నీళ్లు వచ్చే ప్రాంతాన్ని విస్మరించి సీతారామ ప్రాజెక్టుగా రీడిజైనింగ్ చేసి లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టడం వల్ల అంచనా వ్యయం పెరిగింది తప్ప, పది సంవత్సరాలుగా అదనంగా ఒక ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా అని అధికారులను నిలదీశారు. గతంలో రూపొందించిన ఇందిరా సాగర్ ప్రాజెక్టును యథావిధిగా కొనసాగిస్తే ఇప్పటివరకు పనులు పూర్తయ్యి నీళ్ళు వచ్చే అవకాశం ఉండేదని, ఇందిరా సాగర్ ప్రాజెక్టు డిజైనింగ్ కరెక్టుగా నే రూపొందించారని అధికారులు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం వచ్చే నాటికి మధిర నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న జాలుముడి, మున్నేరు ఆనకట్టలను పూర్తి చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. వాటిని పూర్తి చేయడానికి కావలసిన అంచనాలు, వ్యయాలను రూపొందించాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తిచేసి ప్రాజెక్టులను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. నల్లగొండ జిల్లాలో మూడు లక్షల ఎకరాలపై సాగునీరు అందించే ఎస్ఎల్బీసీ నక్కలగండి డిండి ప్రాజెక్టుల పనులుఇంకా ఎంత శాతం పనులు పెండింగ్ లో ఉన్నాయి, ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయడం కోసం ఎంత నిధులను ఖర్చు చేసింది, అలాగే ఇంకా ఎంత నిధులు అవసరం ఉన్నాయి. సమృద్ధిగా నిధులు ఇస్తే ఎప్పటిలోగా పూర్తి చేశారన్న అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూలి హెడ్ వర్క్స్ పూర్తి చేయకుండా ఫలితం ఏమంటుందని అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వం రూ.. 200 నుంచి రూ. 300 కోట్లతో పూర్తయ్యే సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేసి వేల కోట్లతో కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడం వల్ల ప్రజలపై భారం మోపిందన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను నాలుగు రకాలుగా విభజించాలని ఆదేశించారు. ఆరు నెలల్లో పూర్తయ్యే ప్రాజెక్టులు, ఏడాదిలోగా పూర్తయ్యే ప్రాజెక్టులు, 18 నెలల్లోగా ప్రాజెక్టులు 24 నెలల్లో పూర్తయ్యే ప్రాజెక్టులు గుర్తించి వాటి కావాల్సిన బడ్జెట్ అంచనా వ్యయాన్ని రూపొందించి వెంటనే నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖలో ఎన్నికలకు ముందు పిలిచిన టెండర్లను వెంటనే నిలిపివేయాలని, వర్క్ అలాట్మెంట్ చేసిన వాటిని కూడా ఆపివేయాలని ఆదేశించారు. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యాముల నిర్మాణం కోసం, ఎమ్మెల్యేల నుంచి వచ్చే సిఫారసులను స్వీకరించి వాటికి కావలసిన నిధుల మంజూరుకి కషి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గత ప్రభుత్వం రీడిజైనింగ్ చేసిన సీతారామ ప్రాజెక్టు వల్ల వెనక్కి పోలేము, ముందుకు పోలేమన్నట్టుగా ఉందని ఇది బ్యాడ్ రీ డిజైనింగ్ లా ఉందని అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అధికారులపై పొంగులేటి ఆగ్రహం

సీతరామ ప్రాజెక్టు పనులకు సంబంధించిన వివరాలు సమగ్రంగా చెప్పని అధికారులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యారేజీ హెడ్ వర్క్ నుంచి చివరి కెనాల్ వరకు ఫేజ్ ల వారీగా జరిగిన పనుల గురించి అధికారులను అడిగారు. తత్తరపాటు సమాధానాలు చెప్పడంతో మీరు చేసే పని పైనే మీకు అవగాహన లేకుంటే ఎలా అంటూ ఈఈని మందలించారు. ప్రతి సాగునీటి ప్రాజెక్టు గురించి చాలా లోతుగా మంత్రులు చర్చించారు. అదేవిధంగా నాగర్జున సాగర్ జలాశయంలో ఉన్న నీటి నిల్వలు, వాడకం గురించి అడిగారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ఇప్పటినుంచే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మత్తు పదార్థాల రవాణాపై గట్టి నిఘా

అధికారులను ఆదేశించిన సందీప్ శాండిల్య

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో మత్తుపదార్థాల రవాణా, వినియోగంపై గట్టి నిఘా వేసి ఉంచాలని రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య అధికారులను ఆదేశించారు. రెండ్రోజుల క్రితం అదనపు డీజీ సందీప్ శాండిల్యను యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. కాగా, రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగాన్ని కఠినంగా అణచివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ టాస్క్‌ను ప్రధానంగా తీసుకొని యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించి అమలు చేయాలని కూడా ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో యాంటీ నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ శాండిల్య రాష్ట్రంలో మత్తుపదార్థాల రవాణా, వినియోగానికి సంబంధించి అధికారులతో సమీక్ష జరిపారు.

ముఖ్యంగా, ఎండీఎంఏ, ఓపీఎం, తదితర మత్తు పదార్థాలు మొదలుకొని గంజాయి స్మగ్లింగ్ వరకు డ్రగ్ పెడ్లర్స్ అనుసరించే వ్యూహాలపై సీరియస్‌గా దృష్టిని కేంద్రీకరించి వాటిని సమర్థవంతంగా నిరోధించాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా, ఏపీలోని వైజాగ్ ఏజెన్సీ ఏరియా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి హైదరాబాద్ ట్రాన్సిట్ కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు గంజాయి స్మగ్లింగ్ జరుగుతున్నదనీ, ఈ అక్రమ రవాణా పలుమార్లు బయటపడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. చక్కటి వ్యూహం, కార్యదీక్షతోనే మత్తు పదార్థాల రవాణా, వినియోగాలను రాష్ట్రంలో కఠినంగా అణచివేయగలమని ఆయన తెలిపారు.

శంషాబాద్ లోని 181 ఎకరాల భూములు హెచ్ఎండిఏవే : హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్ బ్యూరో

తప్పుడు రికార్డులతో ప్రభుత్వ భూములను కాజేయాలన్న ప్రయత్నాలను హైకోర్టు అడ్డుకుంది. తమకు చెందిన 30 ఎకరాల వ్యవహారంపై ప్రభుత్వం జోక్యం లేకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఇద్దరు వ్యక్తులు వేసిన పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. అనేక తప్పుడు పత్రాలనే కాకుండా కోర్టు ఉత్తర్వులు లేకపోయినా ఉన్నట్టుగా నకిలీవి సృష్టించి పిటిషన్లు వేయడాన్ని తప్పుపట్టింది. అక్రమార్కుల తీరును రాష్ట్ర హైకోర్టు తప్పుపట్టింది. వాళ్ల రిట్ పిటిషన్లను డిస్మిస్ చేసింది. శంషాబాద్‌లోని 181 ఎకరాల భూమి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ)కు చెందుతాయని చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం తీర్పునిచ్చింది.

తెలంగాణ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా తేరా రజనీకాంత్ రెడ్డి

నవతెలంగాణ -హైదరాబాద్ బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ రంగంలోనూ కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అదనపు అడ్వొకేట్ జనరల్‌గా కొనసాగుతున్న రాంచందర్ రావు స్థానంలో తేరా రజనీకాంత్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇది అమలులోకి వస్తుందని లీగల్ ఎఫైర్స్ కార్యదర్శి తిరుపతి గురువారం రాత్రి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేకు ఏడు విభాగాలకు ఇంధన పరిరక్షణ అవార్డులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంధన పరిరక్షణకుగాను దక్షిణ మధ్య రైల్వే ఏడు విభాగాల్లోఅవార్డులను సొంతం చేసుకుంది. గురువారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్, విద్యుత్ శాఖ సహాయ మంత్రి కిషన్ పాల్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీలో హైదరాబాద్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పిఆర్ఎస్) భవనం ప్రథమ బహుమతిని పొందింది. రైల్వే వర్క్ షాప్ విభాగంలో విజయవాడలోని వ్యాగన్ డిపో ప్రథమ బహుమతిని అందుకుంది. జోనల్ రైల్వేల విభాగంలో దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు, ప్రభుత్వ కార్యాలయాల వర్గం లో లేఖ భవన్ (దక్షిణ మధ్య రైల్వే అకౌంట్స్ ఆఫీస్ భవనం) ద్వితీయ బహుమతులు పొందాయి. ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో రేణిగుంట రన్నింగ్ రూమ్ గుంతకల్ రన్నింగ్ రూమ్, గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయాలు మెరిట్ సర్టిఫికెట్లు అందుకున్నాయి. న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులందుకున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సమిష్టి పనితనంతోనే వరసగా అవార్డులు సాధించుకోగలుగుతున్నామని అరుణ్ కుమార్ జైన్ తెలిపారు.

నిమ్స్ ఆస్పత్రికి అవార్డు

- దీ ఈ-ఐసీయూ ప్రాజెక్టు సేవలకు గుర్తింపు

నవతెలంగాణ- సిటీబ్యూరో



హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రి అందిస్తున్న సేవలకు గుర్తింపు దక్కింది. ది ఈ-ఐసీయూ ప్రాజెక్టులో అందిస్తున్న సేవలకు కాన్ఫిరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఢిల్లీ - 2023 అవార్డును ప్రదానం చేసింది. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ఆస్పత్రిలోని ఆయన క్యాబిన్‌లో ఈ అవార్డును గురువారం అందుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వం, నేషనల్ హెల్త్ మిషన్ సహకారంతో కొన్నేండ్లుగా ది ఈ-ఐసీయూ ప్రాజెక్టు ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వైద్యులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వకపోయినా ఈ ప్రాజెక్టు సాయంతో అత్యవసర సమయంలో రోగుల ప్రాణాన్ని కాపాడేలా చొరవ తీసుకున్నారు. 2021లో పైలెట్ ప్రాజెక్టు కింద సిరిసిల్లలో తొలి కేంద్రం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలను జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదం, పాము కాటుకు గురికావడం లాంటి అత్యవసర సమయాల్లో ఆ కేంద్రాలకు వచ్చిన రోగులకు ఎలాంటి వైద్యం అందించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను నిమ్స్ నుంచి వైద్య బృందం ఆయా కేంద్రాల్లో ఉన్న వారికి వర్చువల్ పద్ధతిలో వివరిస్తుంది. దీంతో ఎంతో మంది ప్రాణాలు దక్కాయి. మూడేండ్ల వ్యవధిలో 7000మంది అత్యవసర రోగులకు సేవలందించారు. కేంద్రంలో ఉన్న వైద్యులను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేస్తూ నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నందుకు సీఐఐ గుర్తించి 2023 సంవత్సరానికిగాను హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ టెక్నాలజీ అవార్డు -2023ను ఫస్ట్ రన్నర్‌ప్‌గా అందజేసింది. ఈ అవార్డు రావడం పట్ల వైద్యులకు నిమ్స్ డైరెక్టర్ అభినందనలు తెలిపారు. ది ఈ-ఐసీయూ ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ పద్మజను ప్రత్యేకంగా అభినందించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన సినీ దర్శకుడు జీవన్ రెడ్డి, హీరో సందీప్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ సినీ దర్శకుడు జీవన్ రెడ్డి, హీరో సందీప్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వారు వాకాబు చేశారు. ఆయన త్వరగా కోలుకావాలని ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలో ప్రజాసేవలోకి వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు.

కార్యకర్తలు నిరాశకు గురి కావద్దు

- కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గెలుపోటములు సహజమనీ, బీఆర్ఎస్ కార్యకర్తలు నిరాశకు గురి కావాల్సిన అవసరం లేదని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ కోలేటి దామోదర్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి సుస్థిర పాలన అందించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలోనే ఉండాలని సూచించారు. కొంత మంది వ్యక్తుల తమ నియోజకవర్గాల్లో వ్యవహరించిన తీరు వల్లే బీఆర్ఎస్ అధికారానికి దూరమైందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నదని తెలిపారు. కేసీఆర్‌కు అండగా బీఆర్ఎస్ బలోపేతానికి అంకితం కావాలని పిలుపునిచ్చారు.

కాపు సమాఖ్యకు భూమిపై పిల్

నవతెలంగాణ -హైదరాబాద్

హైదరాబాద్ శివారులోని శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని 6.35 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపు కుల సంఘాల సమాఖ్యాకు కేటాయించటాన్ని సవాల్ చేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విశ్వ బలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పు కాపు సంఘాల సమాఖ్యకు ఖానామెట్‌లో సర్వే నెంబర్41/14లోని ఎకరం భూమిని కేవలం వంద రూపాయలకు కేటాయిస్తూ ఐదు నెలల క్రితం జీవో 87ను జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ఎస్.నరేశ్ హైకోర్టులో సవాలు చేశారు. ఈ పిల్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ జె అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. అదే ఏరియాలో కమ్యూనిటీ బిల్డింగులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నిర్మాణాలను నిలిపివేస్తూ గతంలో ఇచ్చినట్టుగానే ఇపన్పుడు కూడా నిర్మాణాలు నిలిపివేయాలని పిటిషనర్ తరుపు న్యాయవాది కోరారు. ప్రభుత్వ వాదనలు విన్న తర్వాతే ఉత్తర్వుల అంశాన్ని పరిశీలిస్తామని హైకోర్టు ఈ సందర్భంగా తెలిపింది. కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన శాఖ చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, వివిధ కాపు సంఘాల సమాఖ్యలను ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.



పిల్లల అదృశ్యంపై వివరాలివ్వండి
పోలీసులను ఆదేశించిన హైకోర్టు

రాష్ట్రంలో చిన్న పిల్లలు అదృశ్యమైన కేసులు, వాటి పురోగతిని వివరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పిల్లల అక్రమ రవాణా, బలవంతంగా యాచక వృత్తిలోకి దించే ముఠాలు, లైంగికవేధింపులు వంటి వాటి నివారణకు తీసుకున్న చర్యలు తెలియజేయాలని చీఫ్ సెక్రటరీ, డీజీపీ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, హోం శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి ఒక ఇంగ్లీషు పత్రికలో వచ్చిన స్టోరీని హైకోర్టు పిల్‌గా పరిగణించింది. దీనిని జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె. అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. రోజుకు పది మంది పిల్లలు అదృశ్యమవుతున్నారనీ, నాలుగు వేలమంది ఆచూకీ తెలియటం లేదని కోర్టు పేర్కొంది. 2022లో 854 మంది అదృశ్యమైతే అందులో 391 మంది ఆడపిల్లలున్నారనీ, పిల్లల మిస్సింగ్‌లో తెలంగాణ దేశంలో 8వ స్థానంలో ఉందంటూ ఆ కథనం వివరించిందని పేర్కొంది. ఈ అంశాలపై హైకోర్టు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేసింది. నాలుగు వారాలకు విచారణను వాయిదా వేసింది.

తలసాని ఓఎస్డీ ముందస్తు బెయిల్ పిటిషన్
కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం

పశు సంవర్ధక శాఖ ఆఫీసులో డాక్యుమెంట్లను ధ్వంసం చేశారనే కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ఓఎస్‌డీగా చేసిన గుండమరాజు కళ్యాణ్ కుమార్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం విచారించింది.ఈ అంశంపై పోలీసుల వైఖరిని తెలియజేయాలని జస్టిస్ కె.సురేందర్ ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో పత్రాలను ధ్వంసం చేశారంటూ అక్కడి వాచ్‌మెన్ ఎం. లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 9న నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆఫీసులోని పత్రాలన్నీ సెక్రటేరియట్‌లోకి ఎప్పుడో తీసుకువెళ్లారనీ, ధ్వంసం అయ్యాయనేది ఊహాజనితమని పిటిషనర్ వాదన. అనంతరం కోర్టు విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

మిగిలిన మెడికల్ సీట్ల భర్తీ చట్టబద్ధమే
హైకోర్టు ఉత్తర్వులు

కాళోజీ నారాయణరావు మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో రెండు విడతల కౌన్సెలింగ్ అయ్యాక మిగిలిన సీట్ల భర్తీ ప్రక్రియలో అక్రమాలు, అవతవకలు జరగలేదని హైకోర్టు స్పష్టం చేసింది. కౌన్సెలింగ్ తర్వాత గత సెప్టెంబరు 27నాటికి మిగిలిన సీట్ల భర్తీలో అక్రమాలు జరిగాయంటూ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కె.టి. సాయి రేవంత్ రెడ్డి, మరొక విద్యార్థి వేసిన పిటిషన్లను కొట్టివేసింది. పిటిషన్‌లోని అభియోగాలకు ఆధారాలు చూపలేదని చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాదే, జస్టిస్ జె.అనిల్‌కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. కౌన్సెలింగ్స్ అయ్యాక మిగిలిన సీట్ల భర్తీకి ఆ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారికి అనుమతించకూడదంటూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయలేదనే విషయాన్ని పిటిషనర్ల తరఫు సీనియర్ లాయర్ పి తిరుమలరావు న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. మొదటి రెండు రౌండ్లలో వెబ్ ఆప్షన్‌లో పాల్గొన్న వాళ్లకు తర్వాత కౌన్సెలింగ్‌లో ఆప్షన్ ఇచ్చేందుకు ఆస్కారం ఉందని వర్సిటీ లాయర్ ఎ.ప్రభాకర్‌రావు తెలిపారు. రెండు కౌన్సెలింగుల తర్వాత మిగిలిన సీట్ల భర్తీ చట్ట ప్రకారమే జరిగిందని హైకోర్టు తేల్చి చెప్పింది.

మహిళల ఉచిత బస్సు పథకానికి రూ.374 కోట్ల విడుదల

తొలి ఫైల్‌పై సంతకం చేసిన ఆర్థిక మంత్రి భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల, ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన పథకానికి ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. గురువారం ఆర్థిక శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మల్లు భట్టి విక్రమార్క రాయితీ రుసుం రూ.374 కోట్లను ఆర్టీసీకి విడుదల చేస్తూ తొలి సంతకం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కోసం వైద్య ఆరోగ్య శాఖకు రూ.298 కోట్లు, వివిధ వర్గాలకు అందిస్తున్న సబ్సిడీలకు గాను విద్యుత్ శాఖకు రూ.996 కోట్లను విడుదల చేశారు. సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ ఏర్పాట్ల కోసం రూ.75 కోట్లను మంజూరు చేయడానికి గిరిజన సంక్షేమ శాఖ పంపిన ప్రతిపాదనలు ఆమోదిస్తూ మరో సంతకం చేశారు.

టీసీసీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు 29

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు ఈనెల 29 వరకు ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాయింగ్ (లోయర్ గ్రేడ్) పరీక్ష ఫీజు రూ.100, డ్రాయింగ్ (హయ్యర్ గ్రేడ్) ఫీజు రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ (లోయర్ గ్రేడ్) ఫీజు రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ (హయ్యర్ గ్రేడ్) ఫీజు రూ.200 చెల్లించాలని కోరారు. ఆలస్య రుసుం రూ.50తో వచ్చేనెల ఐదు వరకు, రూ.75తో 12 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశముందని తెలిపారు. ఇతర వివరాలకు www.bsetelangana.శీఘ్ర వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ ప్రాథమిక కీ విడుదల

- 22 వరకు అభ్యంతరాల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పథకం పరీక్ష ఈనెల 10న నిర్వహించామనీ అందుకు సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేశామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. https//bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు అభ్యంతరాలను ఈనెల 22లోగా dirgovexams.tg@gmail.com ద్వారా పంపించాలని సూచించారు. ఆ తర్వాత వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

డిజిటల్ పరికరాల స్వాధీనం మార్గదర్శకాలకు

- కేంద్రానికి ఆరు వారాల గడువు

న్యూఢిల్లీ : డిజిటల్ పరికరాల స్వాధీనం చేసుకునేందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఖరారు చేసేందుకు కేంద్రప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆరు వారాల సమయం ఇచ్చింది. దర్యాప్తు సంస్థల ద్వారా డిజిటల్ పరికరాలను పరిశీలించడం, స్వాధీనం చేసుకోవడంకు సంబంధించిన సరైన మార్గదర్శకాలు జారీ చేయాలని కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన రెండు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. గురువారం ఈ పిటీషన్ల విచారణ సందర్భంగా కేంద్రంపై జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధులియాలతో కూడిన ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మార్గదర్శకాలను ఖరారు చేసేందుకు మరికొంత సమయం కావాలని కేంద్రం తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ) ఎస్‌వి రాజు కోరడాన్ని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. '2021లో పిటీషన్ విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే జరుగుతోంది. మీకు ఇంకా ఎంత సమయం కావాలి. మీరు సమావేశాలు జరుపుతున్నారు. కానీ, ఫలితం ఎప్పుడు ఉంటుంది' అని ప్రశ్నించింది. దీనికి స్పందించిన ఏఎస్‌జీ 'ఆరు వారాల సమయం కావాలని, అప్పటి వరకూ డిజిటల్ పరికరాల స్వాధీనానికి 2020 సీబీఐ మాన్యువల్‌ను దర్యాప్తు సంస్థలు అనుసరిస్తాయి' అని కోర్టుకు తెలిపారు. దీనికి అనుమతించిన కోర్టు కేంద్రానికి ఆరు వారాల సమయం ఇచ్చింది. తదుపరి విచారణను 2024 ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది.

ఫార్మా సిటీ రద్దుపై ప్రజలు సంతోషంగా ఉన్నారు

- కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, బెల్లయ్య నాయక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముచ్చర్ల ఫార్మాసిటీని రద్దు చేస్తామంటూ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పార్టీ సీనియర్ నేతలు కోదండరెడ్డి, బెల్లయ్యనాయక్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహరెడ్డి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. సీఎం నిర్ణయం పట్ల ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజక వర్గాలకు చెందిన ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సీఎంకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు కృషి చేస్తుందని చెప్పారు. 2017 అక్టోబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ముచ్చర్ల ఫార్మా సిటీ పేరుతో 20 వేల ఎకరాల భూమి సేకరించాయని గుర్తు చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో 19, 330 భూమి కావాలని అడిగినప్పుడు ప్రజలు వ్యతిరేకించారని తెలిపారు. ప్రభుత్వం వేల మంది పోలీసులు పెట్టి వారిని అడ్డుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలి

- బీజేపీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని హెచ్చరించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో ఎమ్మెల్యేలు వెంకటరమణా రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాజాసింగ్ తదితరులు మాట్లాడారు. ప్రగతిభవన్‌ను స్టడీ సర్కిల్‌గా మారుస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించిందని విమర్శించారు.

లాకప్ డెత్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలి

- బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన బిడ్డ నేనావత్ సూర్య నాయక్ లాకప్ డెత్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలని బీఆర్ఎస్ కోరింది. ఈ మేరకు డీజీపీకి వినతి పత్రాన్ని అందజేసినట్టు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ, పోలీసుల దుర్మార్గమైన చర్యవల్ల ప్రాణాలు కోల్పోయిన సూర్య నాయక్ కుటుంబానికి అన్ని విధాలుగా భద్రత కల్పించాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల నిర్వహణలో అవకతవకలు

- రూ.ఒక కోటి నష్టం చేకూర్చిన హరిచందన
- సీఎంఓకు తెలంగాణ ఫార్మా సొసైటీ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆయుష్ డైరెక్టర్ హరిచందన తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డారని తెలంగాణ ఫార్మా సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎ.సంజయ్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి కార్యాలయానికి ట్వీట్ ద్వారా ఫిర్యాదు చేసి, పత్రికా ప్రకటన విడుదల చేశారు. రిటర్నింగ్ అధికారిగా ఆమె విఫలమయ్యారని పేర్కొన్నారు. దీంతో ఫార్మసీ కౌన్సిల్‌కు చెందిన రూ.ఒక కోటి బూడిద పాలయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 53 వేల మంది ఫార్మాసిస్టుల జీవితాలను ఆమె భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ కమిషన్ వేయాలని సంజయ్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

బిజినెస్

అమ్మకానికి అనిల్ అంబానీ ఆస్తులు


- ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ : అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)కు చెందిన పలు రియల్ ఎస్టేట్ ఆస్తులను విక్రయించేందుకు ముంబై ఎన్‌సీఎల్‌టీ ట్రిబ్యునల్ ఆమోదం తెలిపింది. ఆర్‌కామ్ పలు రుణదాతల నుంచి భారీగా అప్పులు తీసుకుని చెల్లించడంలో విఫలం అయ్యింది. దాంతో ఆ సంస్థ దివాళా పిటిషన్ దాఖలు చేయడంతో ఎన్‌సిఎల్‌టి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌కామ్‌కి చెందిన రిజల్యూషన్ ప్రొఫెషనల్ కంపెనీకి చెందిన కొన్ని అపరిమిత ఆస్తుల విక్రయాన్ని చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ ట్రిబ్యునల్ ఆమోదం కోసం రిజల్యూషన్ ప్లాన్‌ను సమర్పించిన తర్వాత సీఐఆర్‌ఎఫ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 29 ప్రకారం దరఖాస్తుదారు కార్పొరేట్ రుణగ్రహీత ఆస్తులను విక్రయించవచ్చని ఈ ట్రిబ్యునల్ స్పష్టం చేస్తుంది.

వాస్తవానికి 2016లో ముఖేష్ అంబానీ రిలయన్స్ జియో ప్రారంభించిన తర్వాత టెలికం రంగంలో తీవ్ర పోటీతత్వం పెరిగి అనిల్ అంబానీ సంస్థ పరిస్థితి చాలా దిగజారింది. ఆర్‌కామ్ భారీ నష్టాల్లోకి జారుకుంది. ఆ తర్వాత తన బ్యాంక్ రుణాలను చెల్లించటంలో విఫలం అయి చివరికి దివాలా ప్రక్రియలోకి వెళ్లిపోయింది. ఆర్‌కామ్ చెన్నయ్ హెడ్ ఆఫీసు, అంబత్తూర్‌లో సుమారు 3.44 ఎకరాల స్థలం, పూణెలోని 871.1 చదరపు మీటర్ల స్థలం, భువనేశ్వర్‌లోని బెస్ట్ ఆఫీసు స్పేస్, క్యాంపియన్ ప్రాపర్టీస్ షేర్లలో పెట్టుబడి, రిలయన్స్ రియాల్టీ షేర్లలో పెట్టుబడులను విక్రయానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది.

బిగ్ సీ వార్షికోత్సవ వినూత్న ఆఫర్లు



హైదరాబాద్ : ప్రముఖ రిటైల్ మొబైల్ చైన్ బిగ్ సీ తన 21 వార్షికోత్సవం సందర్భంగా వినియోగదారులకు వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్టు తెలిపింది. ఇది వరకు ఎప్పుడూ కనీవినీ ఎరుగని సంచలన ఆఫర్లను అందిస్తున్నామని బిగ్ సి ఫౌండర్, సీఎండీ ఎం బాలు చౌదరి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ పండుగను ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆకర్షణీయ డిస్కౌంట్లను అందించడం తమ సంస్థ అనవాయితీ అని వెల్లడించారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.1,10,000 విలువ గల హెల్త్‌కేర్ ప్రయోజనాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ ఆఫర్‌లో ఒక ఏడాది పాటు అపరిమిత టెలి ఫోనిక్ డాక్టర్ కన్సల్టేషన్, ప్రమాద బీమా, మందులపై 20 శాతం వరకు రాయితీ, రూ.5,000 వరకు అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా రూ.21కే రూ.4,999 విలువ గల ఫైర్‌బోల్ట్ స్మార్ట్‌వాచ్ లేదా రూ.2999 విలువగల రెడ్మీ బడ్స్ ఆఫర్‌ను అందిస్తున్నామన్నారు. ప్రతీ మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్ కొనుగోలుపై ఒక కచ్చితమైన బహుమతి అందిస్తున్నామన్నారు. బ్రాండెడ్ పరికరాలపై 51 శాతం వరకు రాయితీ పొందవచ్చన్నారు.

సూచీలకు ఫెడ్ జోష్..

- సెన్సెక్స్ 930 పాయింట్లు ర్యాలీ
- నూతన గరిష్టాలకు మార్కెట్లు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన గరిష్ఠ స్థాయిలకు ఎగిశాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగించడంతో పాటు భవిష్యత్‌లో రేట్ల తగ్గింపు ఉంటుందని సంకేతాలు ఇవ్వడంతో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ లాభాలతో నూతన రికార్డ్‌లకు చేరాయి. ముఖ్యంగా ఐటీ, రియల్టీ షేర్ల పరుగులతో బీఎస్‌ఇ సెన్సెక్స్ 930 పాయింట్లు లేదా 1.34 శాతం ఎగిసి 70,514కు చేరింది. అదే బాటలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 256 పాయింట్లు లేదా 1.26 శాతం రాణించి 21,183 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సిఎల్ టెక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎంఅండ్‌ఎం, టీసీఎస్ తదితర సూచీలు అధికంగా 4 శాతం మేర లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1 శాతం, 0.6 శాతం పెరిగాయి. ఒక్కపూటలోనే మదుపరుల సంపద దాదాపు రూ.4లక్షల కోట్లు పెరిగి.. బీఎస్‌ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.355 లక్షల కోట్లకు చేరింది. ఆసియా మార్కెట్లలో షాంఘై, నిక్కీ మినహా మిగిలిన అన్ని మార్కెట్లు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో సాగాయి. ద్రవ్యోల్బణం కట్టడికి రేట్లు పెంచుతూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజాగా తన కీలక రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. రెండు రోజుల పాటు జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎమ్‌సీ) భేటీలో ద్రవ్యోల్బణం ఇంకా 2 శాతం లక్ష్యం కంటే ఎగువనే ఉన్నందున కఠిన వైఖరిని కొనసాగించాలని నిర్దేశించుకుంది. విధాన రేట్లను ప్రస్తుత 5.25-5.50 శాతం శ్రేణిలోనే ఉంచుతున్నట్టు స్పష్టం చేసింది. వరుసగా మూడో సారీ రేట్లను ఇదే స్థాయిలో కొనసాగించింది. కాగా.. 2024లో మూడు విడతల్లో వడ్డీ రేట్లలో కోత ఉండొచ్చన్న సంకేతాలు ఇవ్వడంతో ప్రపంచ మార్కెట్లలో ఉత్సాహం నెలకొంది.

కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ : చిన్న ఫైనాన్స్ బ్యాంకుల్లో ఒకటైన ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, దేశంలోని ప్రముఖ స్పెషలైజ్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలలో ఒకటైన కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందంలో ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కంట్రీ హెడ్ మురళీ వైద్యనాథన్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ హెచ్‌ఆర్ అండ్ రిస్క్ హెడ్ చౌదరి చంద్రకాంత మిశ్రా పాల్గొన్నారని తెలిపింది. దీంతో తమ వినియోగదారులకు వినూత్నమైన ఆరోగ్య బీమా పరిష్కారాలను అందించనున్నట్లు పేర్కొంది.

సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకే..

రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర జోక్యాన్ని సవాలుచేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించటంపై కేరళ సీఎం



తిరువనంతపురం : కేంద్రంపై సుప్రీంకోర్టులో పోరాటాన్ని 'చారిత్రాత్మక యుద్ధం'గా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. సమాఖ్య నిర్మాణాన్ని కాపాడుకునేందుకే ఈ చర్య తీసుకున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. కొట్టాయం జిల్లాలో గురువారం జరిగిన నవకేరళ సదస్సులో పాల్గొన్న విజయన్ మీడియాతో మాట్లాడారు. కేరళను ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలోకి నెట్టేందుకే కేంద్రం 'వివక్షపూరితమైన, ప్రతీకార చర్యలు' చేపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పునరుద్ధరించాలనే ఉద్దేశంతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా జోక్యం చేసుకుంటోందని పిటిషన్‌లో పేర్కొన్నామని అన్నారు. ఎగ్జిక్యూటివ్ చర్యలతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ ప్రక్రియపై నియంత్రణ తీసుకుందని, రాష్ట్రానికి రుణాలు తీసుకునే సొంత ఆర్థిక వ్యవస్థలను నియంత్రించే అధికారంలో జోక్యం చేసుకుంటోందని అన్నారు.

కేంద్రం చర్యల వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని తగ్గించడానికి కేరళకు తక్షణమే రూ.26,226 కోట్లు కావాల్సి వుందని అన్నారు. సంక్షోభాన్ని అధిగమించేందుకు ఇది సరిపోదని, కేంద్రం తీసుకున్న చర్యల వల్ల వచ్చే ఐదేళ్లలో రూ. 2 లక్షల కోట్ల నుండి రూ. 3 లక్షల కోట్ల రవకు నష్టం వాటిల్లుతుందని అంచనా. ఇది ఐదేళ్ల కాలంలో రాష్ట్ర జీడీపిలో 20 శాతం నుండి 30 శాతం వరకు ఉంటుంది. దీని నుండి బయటపడకపోతే.. పరిమిత వనరులతో అభివద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని దశాబ్దాల తర్వాత కూడా కోలుకోలేని సంక్షోభంలోకి నెట్టివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాత్మక యుద్ధంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాలు, కేరళ సొసైటీ మద్దతుగా నిలవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో ఎలాంటి కోతలు ఉండవని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలి

- కేంద్ర మంత్రి జైశంకర్‌కు స్టాలిన్ లేఖ



చెన్నై : శ్రీలంక నావికాదళ అధికారులు అదుపులోకి తీసుకున్న 138 మత్స్యకారుల బోట్లను, 45 మంది మత్స్యకారులను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విదేశాంగ శాఖా మంత్రి ఎస్.జైశంకర్‌కు స్టాలిన్ గురువారం లేఖ రాశారు. డిసెంబర్ 13వ తేదీ (బుధవారం) ఆరుగురు మత్స్యకారులను శ్రీలంక నావికాదళం అదుపులోకి తీసుకుంది. ఇలాంటి ఘటన జరగడం ఈ వారంలో ఇది మూడో సారి అని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. అంతర్జాతీయ జలాల్లో చేపల వేట సాగిస్తున్న తమిళనాడుకు చెందిన ఆరుగురు మత్స్యకారులను శ్రీలంక నావికాదళ అధికారులు కంకేసంతురై ప్రాంతానికి సమీపంలో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆ ఆరుగురులో.. నరేశ్ (27), ఆనందబాబు (25), అజరు(24), నందకుమార్ (28), అజిత్ (26)లుగా గుర్తించారు. ఆరో వ్యక్తి ఎవరనేది సమాచారం లేదు. అలాగే ఈ నెల 9న రెండు ట్రాలర్‌లతోపాటు 25 మంది మత్స్యకారులను శ్రీలంక నావికాదళం పాయింట్ పెడ్రో టౌన్ పట్టణానికి సమీపంలో అదుపులోకి తీసుకుంది.

వీరంతా పుదుచ్చేరి, నాగపట్నం, కరైకాల్ జిల్లాలకు చెందిన మత్స్యకారులు. వీరిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. గతంలో అదుపులోకి తీసుకున్న వందలాది బోట్లను, మత్స్యకారులను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. కాగా, అక్టోబర్, నవంబర్ నెలల్లో కూడా పదుల సంఖ్యలో మత్స్యకారులను శ్రీలంక నావికాదళ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే భారత విదేశాంగ మంత్రిత్వశాఖ చొరవ తీసుకుని వారిని విడిపించేందుకు చర్యలు తీసుకుంది.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి

వారికి జీవనభృతి చెల్లించాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో.. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి



నవతెలంగాణ - కరీంనగర్/ జూలపల్లి/నల్లగొండ

ఉచిత ప్రయాణం పథకంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి విన్నవించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలోని ఆయన ఇంటి వద్ద కరీంనగర్ జిల్లా పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంత్రిని కలిసి సమస్యలపై గురువారం వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి.. తప్పకుండా డ్రైవర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సమస్యపై పలు జిల్లాల్లో ఆటో డ్రైవర్లు ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల గ్రామీణ ప్రాంతాలు, మండలాల్లో వేలాది ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల నుంచి డ్రైవర్లకు కనీస వేతనం జీవో విడుదల చేయలేదని గుర్తు చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం జీవో 25 విడుదల చేయాలని, కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించాలని పార్కింగ్ స్థలాలు, ఆటో అడ్డాలు ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ చాలన్లు రద్దు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో వినియోగిస్తున్న అద్దె వాహనాల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అద్దె పెంచాలని, కేరళ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా సవారీ యాప్ ప్రవేశపెట్టి డ్రైవర్లకు ఉపాధి చూపాలని కోరారు. ఓలా, ఉబర్, రాపిడో బైక్ యాప్ రద్దు చేయాలని, ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఏ షరతు లేకుండా డ్రైవర్లకు రూ.10 లక్షలు ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. రవాణా వాహనాలపై సింగిల్ పర్మిట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, పెట్రోలు, డీజిల్ ధరలు సుంకం తగ్గించాలని తెలిపారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సామాజిక భద్రత కల్పించాలని, పలు డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎంకే ఆరిఫ్ మొయినుద్దీన్, అమీర్, గుగులోతు రమేష్, గంగిపెల్లి కుమార్, గౌరవేణి కనకయ్య పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలో బస్ స్టాండ్ వద్ద రాస్తారోకో చేసి అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. అప్పులు చేసి ఆటోలు కొనుక్కొని జీవనం సాగిస్తున్న తమకు.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో అప్పుల భారం పెరిగి జీవితం మరింత దుర్భరంగా మారుతుందన్నారు. ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడం గొప్ప విషయమే అయినప్పటికీ వాహన రంగంపై ఆధారపడిన డ్రైవర్ల బతుకులు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహన రంగ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని కనకపూర్ ప్రధాన కూడలిలో ధర్నా నిర్వహించారు.

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లికి కేజీకేఎస్ శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర నూతన ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణారావుకు కల్లుగీత కార్మిక సంఘం అభినందనలు తెలిపింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లకొండ వెంకటేశ్వర్లు గురువారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కల్లుగీత కార్మికులకు ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

భూకబ్జాల అవసరం నాకు లేదు

- మాజీ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తనపై నమోదైన భూ కబ్జా కేసుపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాను భూ కబ్జా చేసినట్టు వస్తున్న వార్తలు అవాస్తవన్నారు. గిరిజనుల 47 ఎకరాలకు సంబంధించిన భూమి కబ్జా విషయంలో తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పారు. భూములు కబ్జా చేయాల్సిన అవసరం తనకు లేదన్నారు. కొంతమంది మధ్యవర్తులు కొనుగోలు, అమ్మకాల్లో ఉన్నారని.. గిరిజనుల భూమిని వారే కబ్జా చేసి ఉంటారని అన్నారు. భూ కబ్జా ఆరోపణలపై కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. అయితే, ఇది ప్రభుత్వ కక్ష సాధింపు చర్య కాదన్నారు.

మిర్యాలగూడ రైస్ మిల్లులపై ఐటీ దాడులు

- ఎన్నికల ముందే ఒకసారి దాడులు



నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని పలు రైస్ మిల్లులపై ఆదాయపన్ను శాఖ అధికారులు గురువారం దాడులు చేశారు. మిర్యాలగూడలోని సాయి జయలక్ష్మి, సాంబశివ, సూర్య, వైష్ణవి ఫుడ్ రైస్ ఇండస్ట్రీస్, ఆర్‌వీఎస్ రైస్ ఇండస్ట్రీస్‌లో అధికారులు విస్తృత సోదాలు చేస్తున్నారు. మూడు బృందాలుగా ఏర్పడిన అధికారులు రాత్రి వరకు సోదాలు సాగిస్తున్నారు. ఎన్నికల ముందు నవంబర్ 16, 17 తేదీల్లో ఒక దఫా దాడులు సాగించిన ఐటీ అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. 5కోట్ల నగదుతో పాటు కంప్యూటర్లు, హార్డ్‌డిస్కులు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజులు గడవక ముందే రెండో దఫా మిర్యాలగూడ మిల్లర్లపై ఐటీ దాడులు కొనసాగడం మిల్లర్లతోపాటు రియల్ వ్యాపారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లో కూడా ఐటీ రైడ్స్ సాగుతున్నందున అక్కడి సమాచారం మేరకు మిర్యాలగూడలోనూ సోదాలు చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యువతి దారుణ హత్య

- నిప్పుపెట్టి కాల్చిచంపిన దుండగులు

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి శివారులోని కాళేశ్వరం కాలువ పక్కన ఓ యువతి దారుణ హత్యకు గురైంది. మృతదేహం ఉన్నట్టు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సదాశివనగర్ సీఐ రామన్, ఎస్ఐ రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బుధవారం రాత్రి యువతిని గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి కాల్చివేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహానికి ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలు, యువతి ఎవరనేది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఇద్దరు మృతి

- ట్రాక్ దాటుతుండగా ఘటన

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన రాజు(40), పెద్దపల్లి పట్టణానికి చెందిన యాకూబ్(45) మృతిచెందారు. పెద్దపల్లి రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో వాటర్ సప్లయ్ చేసి ట్రాక్ దాటుతుండగా ఢిల్లీ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ సీట్ల ర్యాటిఫికేషన్‌పై విచారణ జరపాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల ధ్రువీకరణ (ర్యాటిఫికేషన్) ప్రక్రియ ఈ ఏడాది వేగంగా పూర్తి చేయడంపై పలు అనుమానాలున్నాయనీ, విచారణ జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక ఏండ్లుగా ర్యాటిఫికేషన్ ప్రక్రియ మార్చి వరకు జరిగేదని తెలిపారు. కళాశాలకు కేటాయించిన సీట్లు అవి అమలు చేసిన నిబంధనలు, విద్యార్థుల నుంచి తీసుకుంటున్న ఫీజు వివరాలు, డొనేషన్లు తీసుకోకుండా సీట్లు ఇచ్చారా? లేదా?, ఎన్ఆర్ఐ కోటాలో సీట్ల భర్తీ వంటి అంశాలపై పారదర్శకత పాటించారా? లేదా? అనే అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యా మండలి ఈసారి తూతూ మంత్రంగా ర్యాటిపికేషన్ ప్రక్రియను చేపట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో 150 ప్రయివేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాలో 25 వేల సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. ఆ దరఖాస్తులను ఇంత వేగంగా ఎలా పరిశీలన చేశారో అనే అంశంపై అనుమానాలున్నాయని తెలిపారు. గతంలో అనేక ప్రయివేటు కళాశాలలపై అక్రమంగా సీట్లను బ్లాక్ చేశాయంటూ ఫిర్యాదులున్నాయని పేర్కొన్నారు. హడావుడి ర్యాటిఫికేషన్ ప్రక్రియపై అనుమానాలున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రష్యా వ్యవసాయంలో కృత్రిమ మేథ!



మాస్కో : కృత్రిమ మేథతో స్వయం చాలకంగా నడిచే ట్రాక్టర్లను రష్యా వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టినట్టు, 'కోగ్నిటివ్ పైలట్' పేరుతో ఇది జరుగుతున్నట్టు టాస్ వార్తా సంస్థ రిపోర్టు చేసింది. కృత్రిమ మేథ ఆధారిత సాంకేతికతతో తయారైన కోగ్నిటివ్ ఆగ్రో పైలట్ స్వయం చాలక డ్రైవింగ్ వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా లేదని ఈ సాంకేతికతను తయారు చేసిన కంపెనీ ప్రకటించింది. స్వయంచాలకంగా నడిచే ట్రాక్టర్ తనకుతానే భూమిని దున్నటంవల్ల వ్యవసాయోత్పత్తి 25శాతం పెరుగుతుందని, 20శాతం నుంచి 40శాతం వరకు ఎరువులు, విత్తనాలు ఆదా అవుతాయని సదరు కంపెనీ తెలిపింది.

కోగ్నిటివ్ పైలట్ సాంకేతికతతో ఇప్పటివరకు 23లక్షల ఎకరాల భూమిని దున్నినట్టు కంపెనీ ప్రెస్ సర్వీస్ టాస్ వార్తాసంస్థకు వివరించింది. మార్చి నుంచి నవంబర్ మధ్యకాలంలో 312 ట్రాక్టర్లకు కోగ్నిటివ్ ఆగ్రో పైలట్ వ్యవస్థను బిగించి వ్యవసాయ క్షేత్రాలను దున్నించటం జరిగిందని టాస్ వార్తా సంస్థ పేర్కొంది. ఇలా చేయటంవల్ల ఒక్కో 1000 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో రైతుకు 28700 డాలర్లు(దాదాపు 23లక్షల రూపాయలకు సమానం) ఆదా అవుతుంది. మొత్తంగా చూస్తే 448కోట్ల రూపాయల(56మిల్లియన్ డాలర్లు) వరకు రైతులకు వ్యయం తగ్గింది. రష్యాలో ట్రాక్టర్లకు ఇంతటి స్థాయిలో కృత్రిమ మేథను ఉపయోగించటం ఇదే తొలిసారని కోగ్నిటివ్ పైలట్ సిఇఓ ఓల్గా ఉస్కోవా ప్రకటించింది.

2019 నవంబర్ నెలలో రష్యా ప్రభుత్వ సబర్ బ్యాంక్, కోగ్నిటివ్ టెక్నాలజీస్ సంస్థ కోగ్నిటివ్ పైలట్ సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రవాణా, వ్యవసాయ రంగాలలో కంప్యూటర్ విజన్, కృత్రిమ మేథను ఉపయోగించి సాంకేతికతలను అభివృద్ధి చేయటంలో ఈ కంపెనీకి ప్రావీణ్యత ఉంది. ఈ ఒప్పందం ప్రకారం సబర్ బ్యాంక్ కోగ్నిటివ్ టెక్నాలజీ కంపెనీలో 30శాతం వాటాను తీసుకుంటుంది. మిగిలిన 70శాతం వాటా సదరు కంపెనీ స్థాపకులకు, ఆ కంపెనీ మేనేజ్‌మెంటుకు ఉంటుంది. 2022 నుంచి రష్యా ఆర్థిక వ్యవస్థలోని ప్రముఖ వ్యూహాత్మక కంపెనీల్లో కోగ్నిటివ్ టెక్నాలజీస్ సంస్థ ఒకటిగా ఉంది. ఈ కంపెనీ ఉత్పత్తులు రష్యాలోనే కాకుండా మరో 12దేశాల్లో ఉపయోగిస్తున్నారు.

ఈమధ్యకాలంలో రష్యా అతి పెద్ద ఆహార ధాన్యాల ఎగుమతిదారుగా ఎదిగింది. 2000సంవత్సరం నుంచి ప్రపంచ గోదుమ మార్కెట్ లో రష్యా వాటా నాలుగు రెట్లు పెరిగింది. రానున్న సంవత్సరాలలో కూడా రష్యా తన ఆధిక్యతను నిలబెట్టుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రపంచ సమకం

బైడెన్ అభిశంసనకు అమెరికా కాంగ్రెస్ ఓటు



న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అవినీతికి పాల్పడ్డాడని, అధికార దుర్వినియోగం చేశాడని ఆదేశ కాంగ్రెస్‌లో భాగమైన ప్రతినిధుల సభ పేర్కొంది. ఇందుకు సంబంధించిన అభిశంసనపై విచారణ చేపట్టాలని రిపబ్లికన్లు చేస్తున్న డిమాండ్‌ను ప్రతినిధుల సభలో జరిగిన ఓటు అధికారికం చేసినట్టయింది. ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా 221 ఓట్లు, వ్యతిరేకంగా 212 ఓట్లు వచ్చాయి. ఈ ఓటింగ్ పూర్తిగా రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల బలాబలాలను అనుసరించి జరిగింది. సభలో హాజరైన ప్రతి రిపబ్లికన్ ప్రతినిధి అభిశంసన విచారణకు అనుకూలంగా ఓటు వేయగా, ప్రతి డెమోక్రాట్ వ్యతిరేకంగా ఓటు వేశారు. ఒకే ఒక డెమోక్రాటిక్ ప్రతినిధి గైర్హాజర్ అయ్యారు.

ప్రతినిధుల సభలో రిపబ్లికన్లు చేసిన తీర్మానంతో సమయం వృథా అవటంతప్ప ఉపయోగం ఏమీ ఉండదని, ఇదో నిరాధార రాజకీయ స్టంట్ అని బైడెన్ ప్రకటించారు. 2020లో జరిగిన మధ్యంతర ఎన్నికల తరువాత ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు మెజారిటీ రావటంతో బైడెన్ దురాగతాలపైన విచారణ జరపటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విచారణ 'హౌస్ ఓవర్ సైట్ కమిటీ', 'హౌస్ జ్యుడీషియరీ కమిటీ'ల నేతృత్వంలో జరుగుతుంది. ఈ కమిటీలు బైడెన్ కుటుంబం చుట్టూవున్న 'అవినీతి సంస్కృతి'ని వెలికితీశాయి గనుక అభిశంసన విచారణ ఆవశ్యకత ఉందని గత సెప్టెంబర్‌లో మాజీ హౌస్ స్పీకర్ కెవిన్ మెకార్థీ ప్రకటించాడు. బైడెన్ కుమారుడైన హంటర్ ల్యాప్ టాప్ నుంచి వెలికితీసిన ఫైళ్ళలో చైనా, కజకిస్తాన్, రుమేనియా, రష్యా, ఉక్రెయిన్ దేశాలకు చెందిన రాజకీయ నాయకులకు, వ్యాపారవేత్తలకు చెందిన షెల్ కంపెనీల నుంచి బైడెన్ ఉపాధ్యక్షుడిగావున్న కాలంలో ఆయన కుటుంబానికి 24మిల్లియన్ డాలర్ల చెల్లింపులు జరిగినట్టు సాక్ష్యాలు దొరికాయని రిపబ్లికన్లు ఆరోపిస్తున్నారు. అమెరికా ట్రెజరీ డిపార్టుమెంట్ బైడెన్‌కు చెందిన 150లావాదేవీలను అనుమానాస్పదమైనవిగా మార్క్ చేసిందని ఈ కమిటీలు గమనించినట్టు తెలిపాయి.

కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పనిచేస్తున్న జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ బాణోతు సుజాతా నాయక్ ఆమె కార్యాలయంలో గురువారం సురక్షిత రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కార్పొరేషన్ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, వారు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక నాయకులు రామచంద్రనాయక్, పోగుల నరసింహ, సతీష్ గౌడ్, శ్రీనివాస్ నాయక్, కప్పురా నాయక్, భవాని, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేటలో మిస్ వరల్డ్ 2020 మానస సందడి



నవతెలంగాణ - చైతన్యపురి

కొత్తపేటలోని శ్రీ లక్ష్మీ వైట్ హౌస్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాషినీ సిల్క్స్ షోరూంను గురువారం మిస్ వరల్డ్ 2020 మానస వరన్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు నచ్చే, మెచ్చే రీతిలో వివిధ రకాల మోడల్స్‌ను అందుబాటులో ఉంచడం ఈ షాపు ప్రత్యేకత అని అన్నారు. డైరెక్టర్ నిరంజన్ మాట్లాడుతూ చిల్లపల్లి హ్యాండ్లూమ్స్ ద్వారా సేకరించిన నాణ్యమైన వస్త్రాలను అతి తక్కువ మార్జిన్స్‌తో వినియోగదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

చిరు వ్యాపారుల

సమస్యల పరిష్కారానికి కృషి



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. తెలంగాణ జన జాగృతి ఫోరం అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి, జోగు రాములు ఆధ్వర్యంలో గురువారం కొత్తపేట బీజేఆర్ భవన్ నుండి అష్టలక్ష్మి ఆలయ కామన్ వరకు ఫుట్ పాత్‌లపై పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా చిరువ్యాపారులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఉషారాణి, జోగురాములు మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు గత వారం రోజులుగా ఇబ్బందులకు గురిచేస్తూ.. ఇష్టానుసారంగా చలాన్లు వేస్తున్నారని ఆరోపించారు. తోపుడు బండ్లను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే చిరువ్యాపారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, శివాని, ప్రదీప్, నరసమ్మ, శైలజ, నావాస్ ఖాన్, తులసి రామ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తా

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఓ కన్వెన్షన్ హాల్లో కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ నా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి జరగాలంటే సబితమ్మ ఉండాలనే ఏకైక నినాదంతో పనిచేశారని కొనియాడారు. నా పని తీరును చూసి, ప్రతిసారి మెజార్టీ పెంచుకుంటూ పోతూ మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలందరీ నమ్మకాన్ని నిలబెడుతానని హామీ ఇచ్చారు. బాధ్యతగా పనిచేస్తా.. ఏ అవసరం ఉన్నా మీ ఆడబిడ్డగా అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎక్కడివరకైనా వెళ్తా, ఎన్ని మెట్లైనా దిగుతానని అన్నారు. మీ కాలనీలకు వస్తా..ప్రతి ఒక్కరినీ కలుస్తా..మీతోనే నడుస్తా.. మీ కష్ట సుఖాల్లో భాగం అవుతానని భరోసా ఇచ్చారు. అనంతరం తన విజయానికి సహకరించిన పార్టీ నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు, ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సభలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, పార్టీ ఫ్లోర్ లీడర్ భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, యువత, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలే సబితమ్మను గెలిపించాయి

- మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి



నవతెలంగాణ - బడంగ్ పేట్

ఈ ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలే మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాయని వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటాపూర్ 14 డివిజన్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జెనిగ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి అభినందనల వెల్లువ

నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా విజయం సాధించిన పి.సబితా ఇంద్రారెడ్డికి నియోజకవర్గం ప్రజల నుండి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ దావూద్ ఖాన్ గూడ సర్వే నెంబర్ 02 భూ బాధితులు చిత్రం వంశీకులు గురువారం సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో కలసి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా బడంగ్‌పేట్ గ్రామంలో చిత్రం కుటుంబం అదే విధంగా దావూద్ ఖాన్ గూడ సర్వే 02లో ఉన్న కాళీ భూమిని బాధితులకు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దానికి సబితమ్మ సానుకూలంగా స్పందిస్తూ.. న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, కర్రె రమేష్, రొడ్డ బిక్షపమ్మ పుట్టగళ్ల అండాలు, రొడ్డ అంజమ్మ, కర్రె పోచమ్మ, పుట్టగళ్ల ఎల్లమ్మ దేవయ్య, కర్రె ముత్యాలు, రొడ్డ యాదయ్య, రొడ్డ సుధాకర్, పుట్టగళ్ల శ్రీనివాస్, కర్రె మహేందర్, పుట్టగళ్ల శ్రీనివాస్ ఉన్నారు.



అడ్డాలో కనీస వసతులు కల్పించాలి



- భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు

నవతెలంగాణ- నాగోల్

భవన నిర్మాణం కార్మికుల కూలీ అడ్డాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగోల్ సమీపంలోని అల్కాపురిలో ఎల్ శంకర్ అధ్యక్షతన న్యూ నాగోల్ భవన నిర్మాణ కార్మికుల మహిళా సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ డబ్ల్యూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్ పార్వతి, బీసీ డబ్ల్యూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి. చైతన్య, బీసీ డబ్ల్యూ సరూర్నగర్ మండల అధ్యక్షులు ఎం.వీరయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డా వద్ద మహిళలకు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, రేకుల షెడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క మహిళ లేబర్ ఆఫీసులో లేబర్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకోవాలని, వెల్ఫేర్ బోర్డు అధికారులు ప్రతి లేబర్ అడ్డా దగ్గరకు వచ్చి కౌంటర్లు ఏర్పాటుచేసి కార్డులు తీసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర పనుల కోసం మళ్లించకుండా నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మహిళకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూ నాగోల్ భవన నిర్మాణ కార్మికుల నూతన కమిటీ అధ్యక్షులుగా సి. యాదమ్మ, కార్యదర్శి ఎస్. శ్రీవాణి, కమిటీ సభ్యులు లక్ష్మి ,ధనమ్మ, రాధా, పద్మ, ఇంద్రమ్మ గిరిజ, అంకమ్మ, కరుణలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోల్ బీసీ డబ్ల్యూ కమిటీ సభ్యులు టి. బాలస్వామి, సైదులు, రమేష్, కృష్ణయ్య లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు

కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు

- తహసీల్దార్ రవీందర్ దత్తు

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్





ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం.206లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ఓ వ్యక్తి ప్రహరీ గోడతో పాటు సీసీ రోడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాల విషయం తమ దృష్టికి రావడంతో.. వెంటనే మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ నిజాముద్దీన్, సిబ్బందితో కలిసి జేసీబీతో ఆ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్ పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 29వ డివిజన్ వెంకటాద్రి కాలనీలో రూ. 20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, డీఈఈ జ్యోతి రెడ్డి, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



హయత్ నగర్ విద్యార్థులకు శుభాకాంక్షలు



నవతెలంగాణ - హయత్ నగర్

రాష్ట్రంలో జరగబోయే అండర్ 14 అండ్ 17 రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌కు హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ విద్యార్థులను హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించారు. హయత్ నగర్ జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పాల్గొనే విధంగా వారి ప్రతిభను కనపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా, పాఠశాల సిబ్బంది, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో డివిజన్‌లో కార్పొరేటర్ కళ్లెం పర్యటన..

హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి మార్నింగ్ వాక్‌లో భాగంగా గురువారం డివిజన్‌లోని అనుమగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు రోడ్డు వెడల్పు మరి చిన్నగా ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరగా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో బీజేపీ సీనియర్ నాయకులు గంగాని శ్రీను, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తాం



కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్

నవతెలంగాణ - నాగోల్

నాగోలు డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం నాగోలు డివిజన్లోని శ్రీనివాస కాలనీలతో పాటు పలు కాలనీలలో సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత ఈ విషయంపై జలమండలి డీజీఎం మరియు ఏరియా మేనేజర్ అలేఖ్యలకు వినతి పత్రాలను అందజేశారు. ఈ పర్యటనలో బీజేపీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్, ఆయా కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేలకు అభినందనలు





నవతెలంగాణ - బడంగ్‌పేట్

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ కుమార్‌లను రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు కొలన్ శంకర్ రెడ్డి గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి..అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు రాజాసింగ్, పి.హరీష్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారించడంలో ముందుండాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని కొనియాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మూడోవ సారి విజయం సాధిస్తుందన్నారు.

విజేతలకు కృష్ణకుమార్ అభినందనలు



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలలో టీటీసీడీఏ ఆధ్వర్యంలో కోపా ఛాంబర్ ఆఫ్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ పక్షాన ఆరుగురు సభ్యులు వినోద్ కుమార్, పరమాత్మ రాజు, సుధాకర్, ప్రమోద్, శ్రీ కేష్‌లు పోటీ చేసి విజయం సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్లో నూతనంగా ఎన్నికైన ఆరుగురు సభ్యులకు రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఆలిండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబెర్ డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఫార్మసిస్టులకు, కెమిస్ట్‌లకు అవసరమైన సేవలు నిరంతరం అందిస్తారని అన్నారు. కోప చాంబర్ ఆఫ్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్‌కు, టీటీసీడీఏ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్‌కు సహకరించిన ప్రతి ఫార్మసిస్ట్‌కు, కెమిస్ట్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ట్రైనింగ్ ప్రోగ్రాం

నవతెలంగాణ- సిటీబ్యూరో

ఓజోన్ హాస్పిటల్‌లో ప్రైవేట్, గవర్నమెంట్ హాస్పిటల్స్ యాజమాన్యాలకు గురువారం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం విధి విధానాలు తెలియజేయడం కోసం ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించినట్లు మెదక్, రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాల ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ. 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచుతున్నట్లు చెప్పారు. హాస్పిటల్ యాజమాన్యం ఆరోగ్య శ్రీ పథకం కింద అడ్మిట్ అయిన పేషంట్లకు సంబంధించిన బిల్లులలో ఎలాంటి పొరపాటు చేయకూడదని సూచించారు. హాస్పిటల్ యాజమాన్యం ఎలాంటి తప్పులు చేయకుండా క్లెయిమ్ అప్లోడ్ చేయాలన్నారు. ఏదైనా తప్పులు జరిగితే హాస్పిటల్స్‌పైన తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక పేషంట్ డాక్యుమెంట్స్ మరొకరికి పెట్టకూడదన్నారు. అలా పెడితే ఎలాంటి సమాచారం లేకుండా రిజెక్టు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రమోద్ కుమార్, ఓజోన్ హాస్పిటల్ సిఓఓ శ్రీనివాసరావు, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, హాస్పిటల్స్ యాజమాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.



అల్మాస్‌గూడలో మహా పడిపూజ



నవతెలంగాణ - బడంగ్ పేట్

నేటి సమాజంలో ప్రజలు భక్తి భావం కల్గి ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అల్మాస్ గూడ 5వ డివిజన్‌లోని ఇంద్రా హిల్స్ కాలనీలో వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ఆమె హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన భీమిడి జైపాల్‌రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తూంకుంట మున్సిప ల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి గురువారం కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్‌రెడ్డి మాట్లా డుతూ.. కాంగ్రెస్‌లో కులమతాలకు అతీతంగా ఎవరైనా ఉన్నత స్థాయికి ఎదుగొచ్చని తెలిపారు. అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. గడ్డం ప్రసాద్‌కుమార్ ఎంపీటీసీ స్థాయి నుంచి అంచెల ంచలుగా ఎదిగి నేడు అసెంబ్లీ తొలి దళిత స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కొనియాడారు. స్పీకర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్‌గౌడ్ తదితరులున్నారు.



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. -నవతెలంగాణ,కాప్రా

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కవి జ్వాలాముఖి వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ విప్లవ కవి జ్వాలాముఖి 15వ వర్ధంతిని ఈసీఐఎల్ కమలానగర్ ఆఫీసులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత జయప్రకాష్ మాట్లాడుతూ.. జ్వాలాముఖి బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారని తెలిపారు. అభ్యుదయ వాదిగా కమ్యూనిస్టు విప్లవ భావజాలంతో అనేక రచనలు చేశారని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తితో అనేక మందికి స్ఫూర్తిదాతగా నిలిచారని పేర్కొన్నారు. స్ఫూర్తి గ్రూప్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. వారు సాహిత్య సేవ సామాజిక చైతన్యానికి ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. అంతకుముందు స్ఫూర్తి గ్రూపు బాధ్యులు జి శివరామకృష, ప్రసాద్ బాబు, బంగారు లక్ష్మణ్, గౌసియా, జయరాజ్, శ్రీమన్నారాయణ, పిభి చారి, శ్రీహరి, రుక్కయ్య హాజరై జ్వాలాముఖి చిత్రపటానికి నివాళులర్పించారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ నాగార్జున నగర్ రోడ్ నెంబర్ ఐదులో నిర్మిస్తున్న 750 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులతో పూర్తి నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, ఏఈ స్వరూప, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ ప్రవీణ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

త్రీ ఫేజ్ విద్యుత్ సప్లై లైన్ ఏర్పాటు చేయాలి : ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ పరిధిలోని ఓల్డ్ మీర్‌పేట్ విలేజ్, నర్సింహ నగర్ కాలనీల్లో త్రీ ఫేజ్ సప్లై లైన్‌లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. గురువారం విద్యుత్ సమస్యలపై మల్లాపూర్ విద్యుత్ అధికారులతో కలిసి పలు కాలనీ ల్లో పర్యటించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ.. చాలా కాలంగా ఈ కాలనీల్లోని కొన్ని ప్రదేశాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని కాలనీవాసులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. దీంతో మల్లాపూర్ ఏఈ, లైన్‌మెన్‌లతో కలిసి ఆయా కాలనీలలో పర్యటించి సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కొన్ని ప్రదేశాల్లో సిమెంట్ పోల్స్ అవసరం ఉందని తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ వెంకటేష్, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు భానురీ రాకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోడుప్పల్ నగర అభివృద్ధిపై దృష్టి సారించాలి



- బోడుప్పల్ కార్పొరేషన్ సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు గురువారం నగర కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ల బృందం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు పోగుల నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. బోడుప్పల్‌లోని ప్రధాన మార్గాలన్నీ దెబ్బ తిన్నాయని వాటిని తక్షణమే మరమ్మత్తులు చేయాలని సూచించారు. చెంగిచెర్ల అవుట్ లెట్, ముంపు ప్రాంతాల సమస్య, రా చెరువు సుందరీకరణ లాంటి అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాసాల వెంకటేష్ యాదవ్, కొత్త దుర్గమ్మ, కొత్త శ్రవంతి గౌడ్, బింగి జంగయ్య యాదవ్, తోటకూర అజయ్ యాదవ్, బొమ్మకు కల్యాణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు దానగళ్ల యాదగిరి, పులకండ్ల జంగారెడ్డి, తోటకూర శ్రీశైలం యాదవ్, గుర్రాల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



- కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి
- దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజ మల్లయ్యకు ఫిర్యాదు

నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలు నిలుపుదల చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య కు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దమ్మాయిగూడ మున్సిపల్‌లోని ఏడో వార్డులో ప్రగతినగర్ మెయిన్ రోడ్ ప్లాట్ నెంబర్ 1, జీ ప్లస్ పర్మిషన్ తీసుకొని 5 అతస్తులు, పెంట్‌హౌస్, బహుళ అంతస్తుల నిర్మాణాలను చేపడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'డబుల్' ఇండ్లను త్వరగా పూర్తి చేయాలి

- ప్రతీ వారం ఇండ్ల పరిస్థితులపై సమావేశం
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్
- జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై సమీక్ష



నవతెలంగాన-సీటీబ్యూరో

జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, పంచాయతీరాజ్ ఈఈ సుమేధా, ఆర్డీవోలు శ్యామ్ ప్రకాష్, రాజేష్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీఎహెచ్ఎంసీ), సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల నుంచి జిల్లాలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాల అన్ని వివరాలను పూర్తి స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.? ఎన్ని ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.? ఇంకా ఎన్ని ఇండ్లు ఏఏ దశలో పెండింగ్ పనులు ఉన్నాయి.? ఫినిషింగ్ (పూర్తయ్యే స్థాయిలో) ఎన్ని ఉన్నాయనే పూర్తి వివరాలను ఆయా నియోజకవర్గాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందచేసే ఇండ్లను తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేటాయింపులకు వివరాలను, పంపిణీ ప్రక్రియను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాజీవ్ గృహకల్ప ఇండ్లపై కూడా పూర్తి వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై పూర్తి స్థాయిలో మానిటరింగ్ చేయాలని, పనులను త్వరితగతిన పూర్తి చేసి, నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ప్రతీ వారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో తప్పకుండా హాజరు కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హులకు అందచేయనున్న ఇండ్లలో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాలని, ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇండ్ల కేటాయింపులు జరిగిన అనంతరం లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగానే పూర్తి స్థాయిలో వసతులు కల్పించి వారికి అందచేయాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో ఏఏ అవసరాలు ఉన్నాయో అధికారులు ప్రత్యక్షంగా ఆ ఇండ్ల వద్దకు వెళ్లాల్సిందిగా అధికారులను ఆదేశించా రు. ఈ సందర్భంగా అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై పలు విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్యామ్ ప్రకాశ్, రాజేష్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

బ్రిడ్జిల నిర్మాణానికి సహకరించండి



నవతెలంగాన-సీటీబ్యూరో

జనాభా పరంగా శరవేగంగా విస్తరిస్తున్న ఘట్కేసర్ మండలం గుండా వెళ్తున్న జాతీయ రహదారిపై మైసమ్మగుట్ట క్రాస్ రోడ్డు (శ్రీనిధిలే అవుట్), అన్నోజిగూడ (ఎన్టీపీసీ) క్రాస్ రోడ్డు వద్ద భవిష్యత్ అవసరాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పీయూపీల నిర్మాణం అవశ్యతకతను వివరిస్తూ ఢిల్లీలో బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవ లక్ష్మణ్‌ను ఘట్కేసర్ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి కలిసి ఆయా బ్రిడ్జిల నిర్మాణానికి సహరించాలని కోరారు. ఐటి పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతానికి రోజు లక్షలాది మంది రాకపోకలు సాగిస్తున్న ప్రజలకు ఉపయోగపడేలా సికింద్రాబాద్ నుంచి ఘట్కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించాలని కోరారు. తక్షణమే స్పందించి ఈ బ్రిడ్జిల నిర్మాణం విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంఎంటీఎస్ రైలు పొడిగింపు అంశంపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కోవ లక్ష్మణ్ లేఖలు రాశారు. ఈ విషయంలో తప్పక ఫలితాలు ఉంటాయని సుదర్శన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి



నవతెలంగాణ-మేడ్చల్

మండల పరిధిలోని పూడూరు గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నట్లు బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు మిరిదొడ్డి ప్రభాకర్ తెలిపారు. గురువారం గ్రామంలోని శ్రీ హరిహర నందన అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త, గురుస్వామి ఆర్.మల్లారెడ్డికి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆలయ ధర్మకర్త ఆర్.మల్లారెడ్డి ఖర్చుకు వెనుకంజ వేయకుండా రాష్ట్రంలోని అత్యం త సుందరంగా రాతితో అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించారని కొనియాడారు. మండలంలోనే పూడూ రు గ్రామం నూతన ఆలయాల నిర్మాణంతో దైవ నిలయంగా మారబోతుందన్నారు. యువకులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఆధ్యాత్మిక దైవభక్తిపై శ్రద్ధ చూపాలని సూచించారు. త్వరలోనే గ్రామం నూతన ఆలయాల నిర్మాణంతో సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకొనుందని అన్నారు.

ఎస్టీల భూములను
అక్రమించిన వారిని అరెస్ట్ చేయాలి



సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలమల్లేష్

నవతెలంగాణ -శామీర్‌పేట

ఎస్టీల భూములను వారికే ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి అక్రమంగా మాజీ మంత్రి మల్లారెడ్డి కబ్జా చేయడం అప్రజాస్వామ్యం అని వెంటనే మాజీ మంత్రి మల్లారెడ్డిని పోలీసులు అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ముడుచింతలపల్లి, మండలంలోని కేశవరం గ్రామంలో మల్లారెడ్డి కబ్జా చేసిన ఎస్టీల భూములను సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సమాఖ్య నాయకులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో సర్వేనెంబర్ 34, 33, 35లోని సుమారు 47 ఎకరాల 18 గుంటల ఎస్టీల భూములను మల్లారెడ్డి అక్రమంగా కబ్జా చేయడం అన్యాయమని పేర్కొన్నారు. దీనికి తోడు రెవెన్యూ యంత్రాంగం రాత్రికి రాత్రి గిరిజన భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ప్రజలు, పత్రికలు, మీడియా గొంతు ఎత్తి అరుస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ధన బలం, అధికార బలం, అంగ బలంతో మల్లారెడ్డి ప్రోద్బలంతో రిజిస్ట్రేషన్ చేయడం ఏంటని ధ్వజమెత్తారు. పాలమ్మిన, పూలమ్మిన కష్టపడ్డ సక్సెస్ అయ్యా అని మైకుల ముందు గొప్పలు చెప్పుకునే మల్లారెడ్డి నిజ స్వరూపం బట్టబయలు అయ్యిందన్నారు. పేదల బడుగు బలహీన వర్గాల గిరిజనుల భూములను కబ్జాలు చేస్తూ కోట్లకు పరిగెత్తారని సమాజానికి అర్థమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల భూములను అక్రమార్కుల నుంచి రక్షించి గిరిజనులకు అప్పగించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సీపీఐ కార్యదర్శి సాయిల్‌గౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.శంకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. కృష్ణమూర్తి, వి. హరినాథరావు, మూడుచింతలపల్లి సీపీఐ మండల కార్యదర్శి టి. రాములు గౌడ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, నాయకులు అజిత్, శ్రీకాంత్ యాదవ్, దుర్గం వెంకటేష్, వెంకటేశం పాల్గొన్నారు.

రేపు ఆంజనేయస్వామి ఆలయానికి శంకుస్థాపన

నవతెలంగాణ-జవహర్ నగర్

బాలాజీనగర్ అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలో శనివారం ఆంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తామని ఉద్యమకారుడు,అయ్యప్పదేవాలయం ప్రధాన కార్యదర్శి జిట్టా శ్రీనివాస్ రెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగే ఆంజనేయస్వామి భూమిపూజ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు, జవహర్ నగర్ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి 44 ప్రక్కన ఏర్పాటు చేసిన ముబారక్ మల్టీ కంజైన్ రెస్టారెంట్ ను గురువారం మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు రుచికరమైన బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెస్టారెంట్ నిర్వాహకులు మహమ్మద్ అల్తాఫ్, మన్నాన్, అజహర్ మాట్లాడుతూ అన్ని వర్గాల కష్టమర్లకు



అందుబాటులో ఉండేలా స్పెషల్ బిర్యాని, ఇండియన్, చైనీస్ తందూరి, ఇరానీ చాయ్, బెకరీ ఐటమ్స్ అన్ని రకాల వెజ్, నాన్ వెజ్ ఐటెమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ నాయకులు మర్రి నర్సింహ రెడ్డి,వైస్ చైర్మన్ రమేష్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కౌన్సిలర్లు దేవ,తుడుం గణేష్,బత్తుల శివ కుమార్ యాదవ్, శ్రవణ్, మధుకర్, రవీందర్‌రెడ్డి, నాగరాజు, రాఘవేందర్ గౌడ్, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, ఆప్షన్ సభ్యులు మహబూబ్ అలీ, నవీన్ రెడ్డి, మోహన్ రెడ్డి, మల్లికార్జునస్వామి, లాయక్ అలీ పాల్గొన్నారు.

ఆర్ఎన్ఎస్ పరీక్ష హైదరాబాద్‌లోనే నిర్వహించాలి



నవతెలంగాణ-జవహర్ నగర్

ఆర్ఎన్ఎస్ పరీక్ష కేంద్రాన్ని హైదరాబాద్‌లోనే నిర్వహించాలని ప్రభుత్వాన్ని క్రాంతికిరణ్ అకాడమీ ప్రిన్సిపాల్ కల్యాణి విజ్ఞప్తి చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు బెంగుళూరు, పుణే, చెన్నై వంటి ప్రాంతాలకు వెళ్లలేరని తెలిపారు. పేద విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులకు గుర్తించి ప్రభుత్వం పునరాలోచన చేసి ఈ నెల 17 నిర్వహించే ఆర్ఎన్ఎస్ఎస్ సెంటర్లు తెలంగాణలో కూడా పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వేలాది మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మిలటరి స్కూల్స్ తెలంగాణలో మరిన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, గిరిధర్, విద్యార్థులు ఉన్నారు.

హెచ్ఎం స్వరూపారాణికి వీడ్కోలు.. సన్మానం



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆరేండ్లుగా ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన స్వరూపారాణి ఇటీవల బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లాలోని దత్తాయిపల్లి జిల్లా పరిషత్తు పాఠశాలకు వెళ్లారు. కాగా నూతన ప్రధానోపాధ్యాయులుగా బాలేష్ ఛార్జ్ తీసుకున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బిజీగా ఉండడంతో గురువారం దేవరయాంజల్ జిల్లా పరిషత్తు పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామ పెద్దలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్. రామారావు, టీచర్ న్సంహ్మారెడ్డి, రామాలయం పూజారి, పాఠశాల పూర్వ విద్యార్థులు, రవీందర్ రెడ్డి, రామరాజు, మాజీ ఎంపీటీసీ భీమిడి జైపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మందిరాలను కూల్చడం దురదృష్టకరం



- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రార్థన మందిరాలను కూల్చవేయడం దురదృష్టకరం అని మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో రెండేండ్ల క్రితం నిర్మించిన చర్చిని రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరుతో కూల్చి వేసిన చర్చిని బీఆర్ఎస్ కార్పొరేటర్లతో కలిసి మేయర్ కావ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదోడో బతికే పరిస్థితి లేదని, జవహర్ నగర్ అక్రమ నిర్మాణాల పేరుతో అడ్డగోలుగా కూల్చివేతలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దీనిపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. క్రిస్టియన్లను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదు కుందని తెలిపారు. అధికారులు ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. చర్చి కూల్చడం ఎంతో కలిచివేసిందని, క్రిస్టియన్లను ఆదుకుని చర్చి నిర్మాణానికి సహాయం చేస్తానని తెలిపారు. చర్చిని కూల్చేయడంతో క్రైస్తవులందరిపై దాడి జరిగినంత పని అయిందని క్రిస్టియన్స్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం దుర్మార్గపు చర్యలు మానుకోవాలని లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీతారాజశేఖర్, సీనియర్ నాయకుడు సతీష్ గౌడ్, క్రిస్టియన్ సోదరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-మల్కాజిగిరి

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

9

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి

శుక్రవారం | డిసెంబర్ 15, 2023 | www.navatelangana.com

కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సలహామండలి సభ్యునిగా ఎస్. బి. రామ్



నవతెలంగాణ-కల్చరల్

కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ హైదరాబాద్ ప్రాంత సలహామండలి సభ్యునిగా సూరి బుచ్చిరామయ్య (ఎస్.బీ.రామ్) నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసార శాఖ ప్రకటనలో తెలిపింది. రామ్ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ సూరి భగవంతం ట్రస్ట్ స్థాపక అధ్యక్షుడు.

కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటా



- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్, కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నా విజయం ఏ ఒక్క ప్రాంతానికి, ఏ ఒక్క వర్గానికి, ఏ ఒక్క కుటుంబానికి పరిమితం కాదని ఇది కుత్బుల్లాపూర్ ప్రజల విజయమన్నారు. తనకు హ్యాట్రిక్ విజయం అందించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి విజయాన్ని తాను ఊహించలేదన్నారు. తనకు ఘనవిజయం అందించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. రాష్ట్ర స్థాయిలోనే అత్యధిక మెజార్టీని కట్టబెట్టి తనపై నమ్మకం ఉంచిన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు తన విజయానికి ఎంతోకృషిచేశారని, వారందరికి ప్రత్యేక ధన్యవాధాలు తెలిపారు. ముచ్చటగా మూడవసారి భారీ మెజారిటీతో ఇంతటి విజయాన్ని అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు సదా రుణపడి ఉంటానని తెలిపారు.

సీసీ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



- **కార్పొరేటర్ రావుల శేషగిరి**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీసీ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం చేయ్యొద్దని ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అధికారుల, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ చంద్రగిరి నగర్ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి జరిగిందన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో ప్రజల సహాయ సహకారాలతో రాజకీయాలకతీతంగా మౌలికవసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవాబ్ భాయి, సుంకరి చందు, హసన్ ఖాన్, సుక్రాత్, దేవేందర్, మొయిన్, నర్సింగ్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- **మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ప్రజా సమస్యల పరిష్కారానికి తమ కుటుంబం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, సమస్యల పరిష్కారం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. గురువారం సుభాష్ నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో సూరారం రాజీవ్ గృహకల్పకు చెందిన ప్రజలు సురేష్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్పలో డ్రయినేజీ, మంచినీటి సమస్య, రోడ్డు, పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అవసరం ఉన్న చోట నూతన మంచినీటి, డ్రయినేజీ పైపులైన్ల నిర్మాణం చేపడుతామని అన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప సుగుణ, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్‌లో నూతనంగా, రూపాయలు నలభై లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించాడు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును ప్రణాళిక బద్దంగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే కాలనీలోని పెండింగ్‌లో ఉన్న రెండు సీసీ రోడ్లను అతి త్వరలో పూర్తి చేస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, నిరంజన్ యాదవ్, ధాతి రమేష్, షౌకత్ అలీ మున్నా, మల్లేష్, పోశెట్టిగౌడ్, ఫారూఖ్,వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ వర్క్ షాప్



నవతెలంగాన-సీటీబ్యూరో

దంత వైద్యంలో అధునాతన టెక్నాలజీ పై నగరంలోని దంత వైద్యులకు మెడికవర్ హాస్పిటల్స్ లో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 100 మంది పైగా దంత వైద్యులు వివిధ హాస్పిటల్స్ నుంచి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా మెడికవర్ హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్ రెడ్డి పాల్గొని కార్యక్రమ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. యూకె నుండి డాక్టర్ మినాస్ లెవెన్స్కి, డాక్టర్ జోహన్‌తో సహా ప్రఖ్యాత నిపుణులు స్పీకర్స్‌గా పాల్గొని వారి అత్యాధునిక దంత ప్రక్రియలు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ రెడ్డి మాట్లా డుతూ వైద్య, దంత ప్రక్రియలు, ఇంప్లాంటాలజీలో ఆక్సిజన్ థెరపీ వంటి వినూత్న విధానాలను సమగ్రపరచడం ప్రాముఖ్యతను అభినందించారు. మెడికవర్ హాస్పిటల్స్ డెంటల్ సైన్సెస్ హెడ్ డాక్టర్ శరత్ బాబు మాట్లాడుతూ "ఆక్సిజన్ థెరపీ అనేది డెంటిస్ట్రీలో, ముఖ్యంగా ఇంప్లాంటాలజీలో ఒక విప్లవాత్మక విధానం. ఆక్సిజన్ డెంటల్ థెరపీ అనేది చికిత్సా ప్రదేశానికి క్రియాశీల ఆక్సిజన్ వాయువును నియంత్రిత డెలివరీ చేసే ప్రక్రియ. ఇది అధిక సాంద్రీకృత ఆక్సిజన్‌తో ఇన్ఫెక్షన్ ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా పనిచేస్తుంది. యూకే, ఇతర దేశాల నిపుణులతో, అంతర్జాతీయ అనుభవాలు, దంత వైద్యంలో అత్యాధునిక టెక్నాలజీ పొందడానికి హైదరాబాద్‌లోని దంత వైద్యులకు వర్క్‌షాప్ ఒక వేదికను అందించిందని ఆయన అన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా జ్ఞాన మార్పిడిని సులభతరం చేయడమే కాకుండా దంత నిపుణులలో నెట్‌వర్కింగ్‌ను ప్రోత్సహించింది. రోగులకు మెరుగైన సంరక్షణను, సాంకేతికతలతో రోగులకు సేవలను అందిస్తారు" అని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- **నిందితుల నుంచి 360 కిలోల గంజాయి స్వాధీనం**

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటి పోలీసులు అరెస్ట్ చేశారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగింది. ఈ ఘటనలో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి కోటి రూపాయలు విలువైన 360 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వికాస్ త్యాగి, అబ్రార్, అమీరుద్దీన్ స్నేహితులు. వీరు, యూపీలోని గజియాబాద్‌లో ఒక గంజాయి వ్యాపారిని సంప్రదించారు. ఇందుకు అతను ఏపీ రాష్ట్రం రాజమండ్రి నుంచి ఉత్తరప్రదేశ్‌కు గంజాయిని రవాణా చేయడానికి మంచి వాటా మొత్తాన్ని ఆఫర్ ఇచ్చాడు. దీనికి నిందితులు అతని ప్రతి పాదనను అంగీకరించారు. గంజాయి రిసీవర్ సూచనల మేరకు, వారు అందించిన కారులో రాజమండ్రి వెళ్లి రాజమండ్రిలో సరఫరాదారు నుంచి గంజాయిని సేకరించి యూపీ రాష్ట్రం మీరట్‌లోని రిసీవర్‌కు అప్పగించేవారు. ప్రతి సరుకుకు నిందితులు తమ వాటా మొత్తాన్ని, గంజాయి వ్యాపారి నుంచి వసూలు చేసేవారు. రిసీవర్ సూచనల మేరకు నిందితులు మహీంద్రా ఎక్స్‌యూవీ 500 కారులో రాజమండ్రి వెళ్లి ఒక సరఫరాదారు నుంచి 360 కిలోల గంజా యిని సేకరించి హైదరాబా ద్ మీదుగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లారు. ఈ నెల 13 వ తేది రాత్రి విశ్వసనీయ సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్ఓటి జోన్ బృందం, అబ్దుల్లా మేట్ పోలీసులతో కలిసి, ఓఆర్ఆర్, అబ్దుల్లా మేట్ సంపూర్ణ హెూటల్ సమీపంలో వీరి కారును ఆపి, అనుమానంతో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 360 కేజీలు గంజాయి (మొత్తం 72 ప్యాకెట్లు, ఒక్కో ప్యాకెట్ 5 కేజీలు ఉంటాయి) తో పాటు, మహేంద్ర కారు, సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 1 కోటి ఖరీదు చేసే సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సీపీ చెప్పారు. నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితులు గతంలో మూడు నాలుగుసార్లు ఏపీలోని రాజమండ్రి నుంచి యూపీలోని మీరట్‌కు గంజాయిని తరలించినట్లు సమాచారం ఉంద న్నారు. ఇదే పద్ధతిలో హైదరాబాద్ మీదుగా రిసీవర్‌కు అప్పగించారు. పోలీసులు తనిఖీ చేయకుండా, వాహనాన్ని గుర్తించకుండా ఉండేందుకు నిందితులు క్రైమ్ వాహనానికి మరో వాహనం ఫాస్ట్ ట్యాగ్‌ను అతికించారు. ఇంకా నిందితుల్లో ఒకరు టోల్ ప్లాజా ముందు దిగి, క్లియరెన్స్ ఇచ్చిన తర్వాత నిందితులు టోల్ ప్లాజా దాటేవారని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు తెలిపారు. గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఎల్బీనగర్ ఎస్ ఓటి డీసీపీ కె.మురళీధర్, జోన్ ఎస్ఓటి బృందాన్ని, రాచకొండ పోలీస్ కమిషనర్ అభినందించారు.



ఈ-కేవైసీ కోసం ఎల్‌పీజీ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు

- **తెలంగాణ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లూరి జగన్ మోహన్ రెడ్డి**

నవతెలంగాన-సీటీబ్యూరో

రాష్ట్రంలోని ఎల్‌పీజీ వినియోగదారులు ఈ-కేవైసీ కోసం ఎల్‌పీజీ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలంగాణ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లూరి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్ర ప్రభుత్వ పథకం సిలిండర్‌కు రూ.500, ఎల్‌పీజీ స్కీమ్‌ను పొందేందుకు ఈ-కేవైసీ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని పుకారు రావడంతో ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్షిప్ల వద్ద భారీ సంఖ్యలో ఎల్‌పీజీ వినియోగదారులు వస్తున్నారని తెలిపారు. ఈ-కేవైసీని పూర్తి చేయడానికి గంటల తరబడి వేచి ఉంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకం సిలిండర్‌కు రూ.500 విధి విధానాలు ఇంకా తమకు అందలేదని తెలిపారు. కాని కేంద్ర ప్రభుత్వం చమురు మార్కెటింగ్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటి వద్దకే వెళ్లి ఈ-కేవైసిని పూర్తి చేయాలని తమను ఆదేశించినట్టు తెలిపారు. దీంతో తాము తమ వినియోగదారులను భయాందోళన చెందవద్దని అభ్యర్థిస్తున్నట్టు తెలిపారు. ఎల్ పిజి డిస్ట్రిబ్యూటర్ ఏజెన్సీ ల వద్ద గుంపులు గుంపులుగా రావద్దని, శాంతి భద్రతల పరిస్థితిని సృష్టించవద్దని కోరారు. ఎల్ పిజి డెలివరీ బాయ్ సిలిండర్ డెలివరీ కోసం మీ ఇంటిని సందర్శించినప్పుడు మీ ఈ-కేవైసిని పూర్తి చేయాలని తాము. కోరుతున్నట్టు తెలిపారు. ఏదైనా ఇబ్బంది, సాంకేతిక సమస్య ఉంటే, సంబంధిత పంపిణీదారులను సందర్శించాలని కోరారు.

వెంకటేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు




- **స్వామి వారి ఆదాయం రూ. 2 లక్షల 46 వేలు**

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ సర్కిల్ పరిధిలోని బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి హుండీని గురువారం లెక్కించారు. ఆలయ వంశపారంపర్య చైర్మెన్ రాజా సంజయ్ గోపాల్ సెంచర్, ఆలయ ఈవో ఎం.వీరేశం పర్యవేక్షణలో నిర్వహించిన హుండీలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలు రూ. 2 లక్షల 46 వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈ నెల 17వ తారీకు నుండి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభ మవుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ హుండీ లెక్కింపు కార్య క్రమంలోఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు సామాజిక సేవకులు శివ రామకృష్ణ ,సురేందర్ రెడ్డి, రాము ,ఆలయ సిబ్బంది నరసయ్య, నరేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పూజ మహోత్సవంలో రాజేశ్వర్ రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పలు ప్రాంతాల్లో అయ్యప్ప మహాపడి పూజ మహోత్సవాల్లో పాల్గొన్నారు. కూకట్‌పల్లిలోని వివేకానంద నగర్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో, సాయి ప్రసాద్ గురుస్వామి నిర్వహించిన 18 కళాశాల మహాపడి పూజ మహోత్సవంలో, అలాగే కూకట్‌పల్లి డివిజన్ లోని సంగీత్ నగర్ లో మోహన్ రావు, తిరుపతి రావు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం అయ్యప్ప స్వామి వారికి పుష్పాభిషేకం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గరికెపూడి వెంకట రమణ(జీవీఆర్), రవి, త్రిపాల్, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ సమావేశం



నవతెలంగాన-సీటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలని పరిష్కరించేందుకు ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మెన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బి.రవిప్రకాష్ నేతృత్వంలో జరిగిన కీలక సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం సమావేశమైంది. పంచాయతీ కార్యదర్శుల అభివృద్ధి కోసం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దృష్టికి అవసరమైన కీలకమైన అంశాలను దృష్టి సారించడానికి చర్చలు నిర్వహించారు.

ప్రమోషన్ మరియు రెగ్యులరైజేషన్

ఓపీఎస్ (ఔట్‌సోర్సింగ్ పర్సనల్ సర్వీసెస్) ఉద్యోగులను జేపీఎస్ (జూనియర్ పంచాయితీ సెక్రటరీ) పాత్రలకు పదోన్నతి కల్పించాలని, వారి తదుపరి క్రమబద్ధీకరణను కోరారు.

సర్వీస్ వ్యవధి పరిశీలన

జేపీఎస్ ప్రమోట్ చేసే వారి ఓపిఎస్‌గా చేరిన ప్రారంభ తేదీ నుండి సర్వీస్ వ్యవధిని పరిగణనలోకి తీసుకోవడం ప్రాముఖ్యతను తెలిపారు.

ఆన్‌లైన్ అప్‌డేషన్ పనులు

ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించేందుకు పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్ అప్‌డేషన్ మొబైల్ యాప్‌లో పనులను తగ్గించే విధముగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రేడెడ్ సిస్టమ్‌ను అమలు

గ్రేడెడ్ సిస్టమ్‌ను అమలు చేయడానికి బదులుగా అన్ని జేపీఎస్‌లను పంచాయతీ కార్యదర్శులుగా పరిగణించాలని ప్రతిపాదించబడాలి.

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 సవరణ

గ్రామ పంచాయతీలకు సంబంధించిన చట్టంలో సవరణలు చేయాలని, ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శుల విధులు, బాధ్యతలను పునర్నిర్వచించాలని కోరారు. సమావేశాన్ని ఉద్దేశించి రవి ప్రకాష్ మాట్లాడుతూ.. సమావేశంలో లేవనెత్తిన అన్ని అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడానికి తన వంతు బాధ్యత నిర్వహిస్తానని తెలియచేసారు. ఈ సమస్యలపై సత్వర చర్యలు, పరిష్కారానికి హామీ ఇచ్చారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల సంక్షేమం, అభ్యున్నతి కోసం అధికారులతో సహకరించే ప్రయత్నాలకు నిబద్ధతతో స్థిరంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కీసర ఎంపీడీఓ గ్యామా ఈశ్వర్, కేంద్ర సంగం ఈసీ సభ్యుడు వేణుగోపాల్ రెడ్డి, టీఎన్జీవో జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీచంద్, జిల్లా ఈసీ సభ్యుడు మహేష్, పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ మేడ్చల్ అధ్యక్షుడు టి.వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శుల జిల్లా కోశాధికారి విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ మేడ్చల్ జనరల్ సెక్రటరీ సునీత, పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ మేడ్చల్ ఈసీ సభ్యురాలు పి.శోభ రాణి, పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ మేడ్చల్ ఈసీ సభ్యురాలు ఎ.మహేందర్ రెడ్డి, బిఎల్ కలెక్టర్లు, ఫోరమ్, తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం

- **సెమీ క్రిస్మస్ వేడుకలలో కార్పొరేటర్ ఆవుల రవిందర్ రెడ్డి**

నవతెలంగాణ-బాలానగర్



క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని కార్పొరేటర్ ఆవుల రవిందర్ రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరధిలోని ఇందిరానగర్‌లోగల ఫైత్ పెంతికోస్తే చర్చ్ నందు పాస్టర్ శాంసన్ ఆధ్వర్యంలో గురువారం గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, అపొస్తులు జాన్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముందుగా క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినం కంటే ముందే నిర్వహించుకునే సెమీ క్రిస్మస్ వేడుకలను ఫైత్ పేంటికొస్టల్ చర్చ్ అత్యంత వైభవంగా నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ఏసుక్రీస్తు ఎప్పుడూ ప్రేమను, కరుణను, క్షమను కలిగి ఉండాలని బోధించారని తెలిపారు. ప్రతిఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖఃశాంతులతో ఉంటుందని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలని, రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి క్రిస్టియన్ మినిరిటీస్ అధ్యక్షుడు డాడీ డేవిడ్, కార్యదర్శి ఎస్.వి. రత్నం, పాస్టర్లు స్వామి, సత్యానందం, కే.రాజు, కృపరావు, చర్చ్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా సంపద పరిరక్షకుడు బ్రౌన్



నవతెలంగాణ-కల్చరల్

ఎక్కడో బ్రిటన్ దేశంలో పుట్టి అధికార బాధ్యత పై తెలుగు నేలపై అడుగిడిన బ్రౌన్ తెలుగు భాషా సంపదను పరిరక్షణకు కృషి చేశారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ద పూర్వ మహనీయులు యాదిలో భాగంగా సీపీ బ్రౌన్ సంస్మరణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కోలెటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ వేమన కవి శతక పద్యాలను పలువురు పండితులకు తన సంపాదన నుంచి వేతనాలు ఇచ్చి పరిష్కరించిన సహృదయుడు బ్రౌన్ అని ప్రశంసించారు. ప్రముఖ పత్రికా రచయిత జయ సూర్య మాట్లాడుతూ తెలుగును ఆంగ్లంలో తర్జుమా చేసి బ్రౌన్ నిఘంటువును రూప కల్పన చేసిన బ్రౌన్ ను ప్రతి తెలుగు వాడికీ నిత్య స్మరనీయుడు అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన్ మూర్తి అధ్యక్షత వహించారు. వేదిక పై చక్రపాణి పాల్గొన్నారు.

పద్మారావు ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా రికార్డ్ మెజారిటీతో ఎన్నికైన తీగుల్ల పద్మారావు గౌడ్ గురువారం అసెంబ్లీలో ప్రమాణం చేశారు. ఎమ్మెల్యేగా పద్మారావు గౌడ్ ప్రమాణం చేయడం ఇది నాలుగోసారి. ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఆయనతో ప్రమాణం చేయించారు. 2014 నుంచి వరుసగా మూడో సారి ఎమ్మెల్యేగా ఎన్నికై సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్ సాధించిన పద్మారావు గౌడ్ తొలుత 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటి ఎన్నికల్లో ఆయనకు 3067 ఓట్ల మెజారిటీ లభించింది. అనంతరం 2014, 2018, 2023ల్లో వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రతీ ఎన్నికల్లో ఆయన సాధించిన మెజారిటీ పెరుగుతూ తాజాగా 45,240 ఓట్ల ఆధిక్యతను సాధించి సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్ తో ఎమ్మెల్యే రికార్డును నెలకొల్పారు.

ఆధార్ లేకపోవడంతో మహిళకు టికెట్ కొట్టిన కండక్టర్

నవతెలంగాణ-బేగంపేట

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. అయితే గురువారం ఓ మహిళా సికింద్రాబాద్‌లో బాటా నుంచి సంగీత వరకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నది. ఆ క్రమంలో ఆధార్ కార్డు మర్చిపోయింది. దాంతో ఆమె ఆధార్ కార్డు లేదని అయితే ఆధార్ సెల్ ఫోన్‌లో ఉందని కండక్టర్‌కు చూపించింది. అయితే కండక్టర్ మాత్రం రూ. 10 టికెట్ కొట్టడంతో మహిళా షాకైంది. ఐడీ కార్డు లేకున్నా ప్రయాణం చేయవచ్చని ప్రభుత్వం చెప్పినా ఇదేం గోస అని మహిళా వాపోయింది.



ఓయూ సాహిత్య వేదిక ప్రపంచవ్యాప్తమవ్వాలి

- ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ చింతా గణేష్
- ఓయూ ఆర్ట్స్‌కళాశాలలో ఓయూ సాహిత్య వేదిక కవితా దుందుభి 6వ వార్షికోత్సవం





నవతెలంగాణ-ఓయూ

తెలుగు భాషా సాహిత్యాలను సమాజంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. చింతా గణేష్ అన్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజ్ వేదికగా ప్రొ. చింతకింది కాశీం అధ్యక్షతన ఓయూ సాహిత్య వేదిక కవితా దుందుభి ఆరో వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా చింత గణేష్ మాట్లాడుతూ ఓయూ సాహిత్య వేదిక ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ. భావాలను వ్యక్తం చేయడానికి వచన కవిత చాలా అనువైన ప్రక్రియ అని అన్నారు. మనసును కదిలించే శక్తి వచన కవిత్వానికి ఉన్నదని చెప్పారు. హృదయానికి కనెక్ట్ అయ్యే వచనం రాసే ప్రతి ఒక్కరూ కవే అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి గోరేటి వెంకన్న పాల్గొని పాట రచన పద్ధతులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అక్కిరాజు రామకష్ణారావు చింతామణి పద్యాలు హృద్యంగా ఆలపించారు. అలాగే చిన్నారి చింతల యామిని, రాచకొండ రమేష్, తులసి గారి నరసింహ, శివరాత్రి సుధాకర్, రేలారే గంగ, సుక్క రామనర్సయ్య, పాటమ్మ రాంబాబు, మీసాల లక్ష్మణ్, చంద్రయ్య, ఉదయభాను, తలారి ధాకన్న, తగుళ్ళ గోపాల్, పేర్ల రాము, శరణ్యలు తమ ప్రక్రియలలో కవిత్వాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ తెలుగు శాఖ ఆచార్యులు, ఓయూ సాహిత్య వేదిక అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.







పసందైన రుచులకు మెర్క్యూర్ టెర్రస్‌లో టేస్ట్

- మెర్క్యూర్ హైదరాబాద్ కేసీపీ జీఎం పరాగ్ షా

నవతెలంగాణ-బంజారా హిల్స్

మెర్క్యూర్ హైదరాబాద్ కేసీపీ, థాయ్ రుచి సుగంధ ద్రవ్యాలు మూలికల ఆకర్షణీయమైన సారాంశాన్ని స్థానిక రుచికరమైన వంటకాలతో మిళితం చేసి కొత్త మెనూనూ టెర్రస్‌లో గురువారం సోమాజిగూడ హొటల్‌లో పారంభించారు. మెనూ కొత్త భోజన అనుభవాన్ని అందించడానికి రూపొందించారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ హైదరాబాద్ కేసీపీ జనరల్ మేనేజర్ పరాగ్ షా మాట్లాడుతూ గ్రిల్స్,డిమ్ సమ్‌లు,స్థానిక స్టార్టర్‌ల సమ్మేళనంతో సహా అనేక రకాల ఎంపిక చేసి పసందైన రుచులను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. థాయ్-ప్రేరేపిత క్రియేషన్‌లను ఆస్వాదిం చినా లేదా విలక్షణమైన హైదరాబాదీ ప్రత్యేకతలను ఆస్వాదించినా,అతిథులు ఈ వైవిధ్యమైన ప్లేట్ ఎంపికలతో తమ కలినరీ ప్రయాణాన్ని వ్యక్తిగతీకరిం చవచ్చనీ తెలియజేస్తూ ప్రపంచ స్ఫూర్తితో అత్యుత్తమ స్థానిక సంప్రదాయాలను సజావుగా మిళితం చేసే కలినరీ అనుభవంతో మరచిపోలేని భోజన అనుభవాలను అందిస్తూనే , మా అతిథుల వైవిధ్యమైన ప్రాధాన్యతల కనుగుణంగా చిన్న ప్లేట్లు, పెద్ద ప్లేట్‌లను పరిచయం చేస్తూ, ఈ అద్భుతమైన మెనూని అందించడం పట్ల సంతోషిస్తున్నామన్నారు.



అవాస్తవమైన ఆరోపణలు ఖండిస్తున్నాం

- రవి దాపర్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్

తమపై వస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తవమని ఉర్విన్ ల్యాబ్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ రవికుమార్ దాపర్తి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థలో వన్ ఆఫ్ ద డైరెక్టర్ స్వల్పవాట కలిగిన రఘు కుమారి, అనాలోచితంగా తమపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిందని చెప్పారు. కంపెనీలో మరో డైరెక్టర్ స్వామీ గ్రీన్ కార్డ్ హెూల్డర్ ఈ కేసు ఈ అవాస్తవ సంఘటనలు జరగక ముందే ఆయన అమెరికా వెళ్లారని ఈ తప్పుడు కథనాలతో లెక్కలు ఎప్పుడు తారుమారు కావని సంస్థ లో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోలేదని తెలిపారు. రఘు కుమారి చర్యలు తమ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేవిగా,సంస్థ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారేలా ఉన్నాయని భావిస్తూ తనను పోలీసులు అరెస్టు చేయలేదన్నారు. తనపై వచ్చిన తప్పుడు ఫిర్యాదును చట్టపరంగా ఎదుర్కొంటూ చట్టానికి పూర్తిగా తాను సహకరిస్తానని చెప్పారు. చట్టంపై తనకు పూర్తి నమ్మకం భరోసా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



చేనేతలకు చేయుతగా ఉంటాం

- చిల్లపల్లి సిల్క్స్ ఫౌండర్, ప్రెసిడెంట్ నాగేశ్వరరావు

నవతెలంగాణ-బంజారా హిల్స్

చేనేతలకు చేయూతగా వారికి అండగా ఉంటూ ప్రోత్సహిస్తామని చిల్లపల్లి సిల్క్స్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం బేగంపేట వైట్ హౌస్‌లో మిస్ వరల్డ్ మానస వారణాసి చేతుల మీదుగా వాశిని సిల్క్ షో రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేతలకు చేయూతనిచ్చేవారు చాలా అరుదుగా ఉంటారని.. కానీ చిల్లపల్లి సిల్క్ సంస్థ అనతి కాలంలోనే ఇంత పేరు ప్రఖ్యాతలను సంపాదించుకోవడానికి ముఖ్య కారణం చేనేతలకు అండగా ఉంటూ వారు తయారు చేసిన ఉత్పత్తులను ప్రజలకు అందించడమేనన్నారు. ప్రజలకు లేదా వినియోగదారులకు ఇచ్చే ధర మొత్తం వారికే అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందించే సాహసాన్ని చేయడం నిజంగా అద్భుతం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సీహెచ్ నిరంజన్ పాల్గొని మాట్లాడుతూ తాము ఎల్లప్పుడూ చేనేతలకు అండగా ఉంటూ వారి ఉత్పత్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని తెలియజేశారు. తాము బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10లో ఇటీవలే శ్రీలక్ష్మితో స్టోర్లో ఘనంగా మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించుకుని వినియోగదారుల కోసం విభిన్న రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

మంత్రి పొంగులేటికి డాక్టర్ ముజీబ్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ రిజిస్ట్రేషన్ శాఖ చైర్మెన్ డాక్టర్ సయ్యద్ మజీదుల్లా హుస్సేని(ముజీబ్) గురువారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో డాక్టర్ ముజీబ్ కలిసి పూలబొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముజీబ్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ శాఖ పక్షాన మంత్రి అడుగుజాడల్లో నడుస్తామని, బంగారు తెలంగాణ అభివృద్ధిలో తమ ఉద్యోగులు మరింత ఉత్సాహంతో పనిచేస్తారని ఆయన తెలిపారు.

త్వరలోనే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తా..



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే కాలనీలు, బస్తీలలో పర్యటిస్తానని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన నివాసంలో ఆయనను పలువురు కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలు కాలనీలకు చెందిన ప్రతినిధులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకు రాగా, త్వరలోనే ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో అమీర్ పేటలోని కనకదుర్గమ్మ ఆలయ చైర్మెన్ మల్లిఖార్జునప్ప, సూపరింటెండెంట్ రంగారెడ్డి, కమిటీ సభ్యులు మాధవరావు, వివేక్ నాథ్, ఆకుల రాజు, చంద్రశేఖర్, పద్మావతి, సహదేవ్ గౌడ్, లింగమయ్య, అమీర్ పేటలోని ప్రశాంత్ కాలనీ, ఆనంద్ బాగ్, పార్క్ అవెన్యూ కాలనీలకు చెందిన రాం నివాస్ బన్సాలీ ఆధ్వర్యంలో ప్రవీణ్ కుమార్ గుప్తా, సంజయ్ పచారి, రాజేష్ అగర్వాల్, సనత్ నగర్ లోని మోడల్ కాలనీ, సుందర్ నగర్‌లకు చెందిన బుచ్చిబాబు, శశికాంత్, మచ్చారావు, తిలక్, వీరభద్రరావు, రాజు, మొండా డివిజన్ కు చెందిన గణేష్ టెంపుల్ మాజీ చైర్మెన్ జయరాజ్ ఆధ్వర్యంలో పద్మ, శరణ్య, లలిత, అనురాధలు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.



అంధ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మంచుకొండ ఫౌండేషన్ చైర్మెన్ మంచుకొండ ప్రకాశం 70వ జన్మదినం సందర్భంగా దారుషిఫాలోని అందుల పాఠశాలకు చెందిన 70 మంది అంధ విద్యార్థులకు బ్యాగులను ఫౌండేషన్ డైరెక్టర్స్ వరుణ్, అరుణ్‌చే పంపిణీ చేశారు. పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, మల్లేష్, ప్రవీణ్, పాఠశాల ఉపాధ్యాయులు రామారావు, కుషియా, శ్రీనివాస్ రెడ్డి, సద్గుణ, సునంద, పద్మజ, జావేద్, అంజాద్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వరుణ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తామని తెలిపారు.

క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులకు సన్మానం

- నామినేషన్లకు ఆహ్వానం
- మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇలియాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రిస్మస్ పండుగ-2023 సందర్భంగా నిర్వహించనున్న సంబరాల్లో భాగంగా వివిధ రంగాల్లో సామాజిక, విద్య, వైద్య సాహిత్య కళా, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ/ప్రతిభావంతులైన క్రైస్తవులు, సంస్థలను తెలంగాణ ప్రభుత్వం సత్కరించనుంది. ఈమేరకు అయిదేండ్లు అంతకంటే ఎక్కువ కాలం పాటు ఆదర్శవంతమైన సేవలు అందించిన ప్రముఖ క్రైస్తవులు, సంస్థలకు.. 30 ఏండ్లు అంతకంటే ఎక్కువ కాలం పాటు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారి నుంచి నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఇలియాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను నాంపల్లి హజ్ హౌస్‌లోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయం రూం నెంబర్-603లో సమర్పించాలని తెలిపారు. నామినేషన్ ఫారాలను ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ 040-23391067ను సంప్రదించాలని కోరారు.

ఓయూ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి



- పీడీఎస్‌యూ నేతలు

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో విద్యా అభివృద్ధి కోసం నూతన ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నేతలు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వర రావు, ఓయూ అధ్యక్షులు ఎన్.సుమంత్‌లు మాట్లాడుతూ ఓయూలో విద్యాభివృద్ధి కోసం ఓయూ స్టూడెంట్ అజెండా రుపోందించామని తెలిపారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం ఓయూ స్టూడెంట్ అజెండా అమలు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్టూడెంట్ అజెండా అమలుకు పీడీఎస్‌యూ దశలవారీగా ముందుకు పోతుందని తెలిపారు. మొదటి దశలో ప్రభుత్వ పెద్దలను, ప్రజా ప్రతినిధులను, అధికారులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేస్తామన్నారు. ఓయూ విద్యార్థుల అభివృద్ధికి ,నిరుద్యోగ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని, ఈ సారి ఏర్పడిన ప్రభుత్వం గత ప్రభుత్వం లాగా కాకుండా విద్యార్థుల విద్యా ప్రయోజనాల కేంద్రంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ ఓయూ సహాయ కార్యదర్శి రుక్మత్ పాషా, నాయకులు సంపత్, మహేష్, క్రాంతి, సంతోష్, సుమన్, నరేష్, మధు,శ్రీకాంత్,యశ్వంత్, విజయ్ పాల్గొన్నారు.

'నగల షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలి'



నవతెలంగాణ-బంజారా హిల్స్

అక్రమాలకు పాల్పడుతూ తప్పుడు కేసులు నమోదు చేయిస్తున్న సికింద్రాబాద్‌లోని ఓ నగల షాపు యజమాని చేస్తున్న అరాచకాలపై చర్యలు తీసుకోవాలని బాధితులు సందీప్ కుమార్ గుప్తా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం సికింద్రాబాద్‌లోని రోహిత్ జువెలర్స్ వద్ద 103 గ్రాముల 22 క్యారెట్ల బంగారాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. కాగా మట్టి బంగారంపై తణుకు అనుమానం తెచ్చి ప్రభుత్వ వ్యాల్యుయర్‌తో తనిఖీ చేయించగా బంగారం 18 క్యారెట్ల ఆభరణాలుగా తేలిందని తెలిపారు. దాంతో తాను మోసపోయానని గ్రహించి ఇదేమిటని సదర్ జ్యువెలర్స్ యజమాని ప్రశ్నించగా తనపై తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. అనంతరం రోహిత్ జువెలర్స్‌లో అకౌంటెంట్‌గా పనిచేసే భార్య రుబితా జైన్, భర్త నూతన్ జైన్, బంధువులు రాగ్ని జైన్, ఆమె సోదరుడు రవి జైన్, అగ్ని జైన్‌లు తనకు సహకరించినట్టు సందీప్ తెలిపారు. దీనిపై రుబితా జైన్ మాట్లాడుతూ 2022 అక్టోబర్‌లో ఓ రోజు రాత్రి 11 గంటల సమయంలో తమ నివాసానికి పోలీసులు వచ్చి తన భర్త పై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇట్టి విషయంలో కలగజేసుకొని తమకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలని కోరారు.

గుడి మల్కాపూర్‌లో పుట్ ఫాత్‌ల ఆక్రమణ..!



- పాదచారులకు అడుగు పెట్టడానికి లేని జాగ
- రోడ్డు నడుస్తుండడంతో ప్రమాదాలు

నవతెలంగాణ-హైదరాబాద్

గుడి మల్కాపూర్‌లో పుట్ ఫాత్ లు యధేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. అసలు పాదచారులు అడుగు పెట్టడానికి చోటే లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. పాదచారులు రోడ్ల మీదనే నడకను కొనసాగిస్తున్నారు. దీంతో పాదచారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

మెహిదీ పట్నం వార్డు కార్యాలయానికి ఇరువైపులా ఇంచు మందం కూడా పుట్ ఫాత్‌లు లేకుండా పోయాయి. పక్కనే బల్దియా వార్డు కార్యాలయం ఉన్నా, పుట్ ఫాత్ ఆనవాళ్లు లేకుండా చేసినా తమకేమి పట్టనట్టుగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుట్ ఫాత్‌లపై ఎవరైనా ప్రశ్నిస్తే స్థానిక వ్యాపారస్తులు, పుట్ ఫాత్ ఆక్రమణదారులు పాదచారులపై దాడులకు పాల్పడుతున్నారని సమాచారం. ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఉపయో గపడేలా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు అనేకం. సంబం ధిత అధికారులు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని పాదచారులు కోరుతున్నారు.

రేపటి నుంచి శిల్పారామంలో హస్తకళా మేళా ప్రారంభం



నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ మాదాపూర్ ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్మాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ హస్త కళ ఉత్సవం రేపటి నుంచి ప్రారంభమవుతుందనీ శిల్పారామం జీఎం ఆంజ య్య తెలిపారు. గురువారం మాదాపూర్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. హైదరాబాద్ క్రాఫ్ట్స్ ప్రేమి కుల కోసం హస్త కళాకారుల ప్రయోజనార్థం భారత ప్రభుత్వం మినిస్ట్రీ అఫ్ టెక్స్టైల్స్, నేషనల్ జ్యూట్ బోర్డు వారి సంయుక్త నిర్వహణలో రేపటి నుంచి మేళ ప్రారంభమ వుతుందనీ తెలిపారు. శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు, హాజరై ఈ మేళాను ప్రారం భిస్తారని పేర్కొన్నారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ వారు కర్నాటక, మధ్య ప్రదేశ్, త్రిపుర, రాజస్థాన్, వెస్టబెంగాళ్‌కి చెందిన జానపద నృత్యాలను స్పాన్సర్ చేస్తున్నారని, వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రీయ నృత్యాలు కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో అడ్మిన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ-ధారూర్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా వారి నివాసంలో హనుమంత్‌రెడ్డి, ఎండీ యూనిస్, పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శంషాబాద్‌లోని
181 ఎకరాల భూములు హెచ్ఎండీఏవే..

- భూ అక్రమదారుల పిటిషన్ డిస్మిస్ చేసిన హైకోర్టు
- నవంబర్ 18న తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్
- తీర్పు వెల్లడించిన హైకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ ఉన్నతాధికారుల చొరవతో కేసు గెలిచిన హెచ్ఎండీఏ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

తప్పుడు భూరికార్డు సృష్టించిన ప్రభుత్వ భూముల ను ఆక్రమించిన అక్రమార్కుల తీరును రాష్ట్ర హైకోర్టు తప్పు పట్టి వారి రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఆ భూములు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)కు చెందుతా యని గురువారం 14వ తేదీన తీర్పు ఇచ్చింది. శంషా బాద్ మున్సిపాలిటీ పరిధిలో హెచ్ఎండిఏకు ఉన్న 181 ఎకరాల భూముల్లో దాదాపు 50 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కొన్ని రోజులుగా కొందరు ప్రయత్నించారు. సంబంధంలేని సర్వే నెంబర్లను చూపి హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న భూముల్లో పొజిషన్ కోసం ప్రయత్నిం చారు. రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్, హెచ్ఎండీఏ ఎస్టేట్, లీగల్, ఎన్ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికా రులు భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, న్యాయ పరమైన అంశాలను పరిగణలోకి తీసుకొని గతేడాది కాలంగా హైకోర్టులో తమ వాదనలు వినిపిస్తున్నారు. వాద ప్రతివాదనల అనంతరం హైకోర్టు డివిజనల్ బెంచ్ నవంబర్ 18 వ తేదీన తీర్పును రిజర్వ్ ఫర్ ఆర్డర్స్‌లో పెట్టింది. తుది తీర్పును గురువారం హైకోర్టు వెల్లడిస్తూ ఆక్రమణదారుల రిట్ పిటిషన్ డిస్మిస్ చేస్తున్నట్టు వెల్లడించింది.

ఫార్మాసిటీ తరలింపు హర్షనీయం

- సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు
- ఫార్మా రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

జనవాసాల నుంచి ఫార్మాసిటీ తరలింపు నిర్ణయం హర్షనీయమి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఫార్మా రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఈ మేరకు ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ఫార్మా రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. ఫార్మా రద్దు చేసి అక్కడ మంచి టౌన్షిప్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. దాంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన ఏర్పడేందుకు ప్రజలు కృషి చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కట్టుబడి పని చేస్తున్నారన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాననే పనిచేస్తుందని తెలిపారు. ఫార్మాసిటీ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి కోట్ల రూపాయలు దండుకుందని ఆరోపించారు. పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ భూములను కూడా ప్రభుత్వం అన్యాయంగా లాక్కొందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పామని, ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేశామన్నారు. దాంతో ఫార్మా రైతులు, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి, నియోజకవర్గాల ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎంగా బుల్లెట్ స్పీడ్ తో పని చేస్తున్నారని చెప్పారు. 6 ఏండ్లుగా ప్రజలు చేస్తున్న పోరాటాలు నేడు ఫలించాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన గిరిజనుల పక్షాన పని చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ జనరంజక పాలన మొదలైందని చెప్పారు.

ఫార్మా రైతులకు భూములు తిరిగివ్వాలి

- రైతుల భూములతో రియల్ వ్యాపారం చేయడం తగదు
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- ఇబ్రహీంపట్నం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఫార్మను రద్దు చేస్తే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మ్యానిపెస్టోలో పార్మసిటీ రద్దు చేసి రైతులకు తిరిగి భూములను అప్పగిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఫార్మసిటీ రద్దు చేసే ప్రకటన స్వాగతించినా, శాటిలైట్ టౌన్షిప్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెర లేపడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి అక్కడ శాటిలైట్ టౌన్షిప్‌లను ఏర్పాటు చేస్తామని మాట మార్చారని మండిపడ్డారు. ఫార్మాసిటీ భూముల్లో టౌన్షిప్ ఏర్పాటు అనేది రియల్ ఎస్టేట్ వ్యాపారం కాకుంటే ఇంకేంటని ప్రశ్నించారు. ఫార్మాసిటీ ఏర్పాటు ప్రతిపాదన గతంలో కాంగ్రెస్ తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రపంచం మెచ్చే గ్రీన్ ఫార్మాసిటీని, ఫార్మా యూనివర్సిటీని, టౌన్ షిప్‌లను ఏర్పాటు చేస్తామంటే వ్యతిరేకించిన వారు అధికారంలోకి వచ్చి అక్కడ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తామనడం శోచనీయమన్నారు. రైతుల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం తగదన్నారు. రైతులకు భూములు తిరిగి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు రైతులకు భూములు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును ప్రజల్లో ఎండగడతామని వెల్లడించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం, ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములు రైతులకే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫార్మాసిటీని తెచ్చింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రకటని ఆరోపించారు. అమలు కానీ హామీలను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పెద్ద చెరువు సుందరీకరణకు, మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, వాటిని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మెన్ ఆకుల యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలుకల బుగ్గరాములు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, మజ్లిస్, బీఆర్ఎస్‌లు ఒక్కటే



- బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు

నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్రంలోని కాంగ్రెస్, మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, ఈ మూడు పార్టీలు ఓకే తాను ముక్కలే అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు అన్నారు. బర్కత్ పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పేట నియోజకవర్గం బీజేపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల వ్యవహార శైలి దీనికి నిదర్శనమని, రాష్ట్ర శాసనసభ ప్రోటేం స్పీకర్ ఎంపిక, మజ్లిస్ ఎమ్మెల్యేలతో హైదరాబాద్ నగరాభివృద్ధి సమావే శం తదితర అంశాలు నిదర్శనం అన్నారు. ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్‌ను శాసించిన మజ్లిస్.. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీని శాసిస్తుందని చెప్పారు. ఉచిత హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల హామీ లను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కవద్దని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం బీజేపీ ప్రజల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్యామ్ రాజ్, సి. కృష్ణ గౌడ్, కన్నె రమేష్ యాదవ్, ఈ అజయ్ కుమార్, సి. వినోద్ యాదవ్, చుక్కా జగన్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The General public hereby informed that pertains to **(I) Sri. YASHWANTH SINGH S/o. Sri. KAILASH SINGH,** aged about 26 years, Gee: Private Employee, R/o. H. No. 13-1-1063, Upper Dhoolpet, Mangalhat, Gandhi Baithak, Hyderabad, Telangana State., **(2) Sri HEMANTH SINGH S/o. Sri. KAILASH SINGH,** aged about 24 years, Occ: Business, R/o. H. No. 13-1-1063, Upper Dhoolpet, Mangalhat, Gandhi Baithak, Hyderabad, Telangana State., have approached the Secunderabad Branch, Shriram Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **(1) Sri. YASHWANTH SINGH & (2) Sri. HEMANTH SINGH** and no claim or no objection of any kind thereafter will be entertained.

SCHEDULE OF THE PROPERTY

All that the Part of the House Bearing No. 13-1-1063, (PT1N/Assessment No. 1071316823), admeasuring 60 Sq. yds., or equivalent to 50.16 Sq. mts., (A.C.C. House constructed Plinth area 100 Situated at Gandhi Baithak, Upper Dhoolpet, Near Mangalhat, Hyderabad, Telangana State and bounded by: NORTH : Neighbour's House, SOUTH : H. No. 13-1-1-63/1, EAST: Neighbour' House & 8' Wide Lane, WEST : Neighbour's House.

P. SRINIVASA RAO
ADVOCATE
FLAT No. A-14, G.F. SRI NIVAS HEIGHTS APTS ADAIZSFINAGAR, UPPAL, HYDERABAD — 39
(M) 93466 66438

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT MEDCHAL
O.S. NO. 681 OF 2023

BETWEEN:
Smt. Renuka Maduri & Anr. ...Plaintiffs
AND
The Tehsildar, Shamirpet Mandal & Anr. ...Defendants

TO,
ALL CONCERNED ...DEFENDANT NO. 2

Whereas the Plaintiffs have filed the above suit to be declared the Legal Heirs of their husband, Late Sri. Madhusudan Maduri and the case stands posted to 27-12-2023 and the Hon'ble Court was pleased to order summons to you and has adjourned the matter for your appearance.

Please be informed that you are hereby directed to appear before the Hon'ble Court in the aforementioned matter on 27-12-2023 at 10:30AMeither personally, or through Counsel, failing which the matter will be adjudicated on merits as per law.

-BY ORDER OF THE COURT-
K. MOHAN
G. RAM BABU
M. VIJAYA KRISHNA
NITISH KAROOR
ADVOCATES
FLAT NO: 14, IST FLOOR, MADHUKUNJ APARTMENTS OPP. CITY CIVIL COURT, S.P. ROAD, SECUNDERABAD-03

NOTICE TO DEFENDANT No. 3/ ALL CONCERNED
IN THE COURT OF THE XI JUNIOR CIVIL JUDGE : CITY CIVIL COURT : AT: SECUNDERABAD
I.A. No. 678 OF 2021
in
O.S.No. 189 OF 2020

Between:
1. Smt. K. Sundaramma (Died as per LR's) (Petitioners/Proposed Plaintiffs Nos. 2 to 4) **...Plaintiff**
2. Sri. S. Praveen Kumar **...Petitioner/Proposed Plaintiff No. 2**
3. Sri. S. Jana Kumar **...Petitioner/Proposed Plaintiff No. 3**
4. Smt. Koppula Swaroopa **...Petitioner/Proposed Plaintiff No. 4**

And

1. The Secunderabad Cantonment Board Rep by its Chief Executive Officer,
2. The Tahsildar, Tirumalgherry Mandal,
3. All concerned **...Respondents/Defendants**

To,
ALL CONCERNED

SUMMONS

The general public/All Concerned are hereby informed that the Plaintiff i.e. Smt. K. Sundaramma D/o. Late Sri. K. Munnu Swamy had filed the above Suit for Declaration to declare her, that she is the only surviving legal heir, legal representative and successor of the deceased, Late Sri. K. Munnu Swamy S/o. Late Sri. Kuppuswamy, against All Concerned. During the pendency of the above Suit the Plaintiff (Smt. K. Sundaramma) died on 13-06-2021 leaving behind the above mentioned Petitioners/Proposed parties as her only surviving legal heirs as they are her children. On the demise of the Plaintiff Smt. K. Sundaramma, the above named Petitioners/Proposed parties being children and legal heirs intend to come on record and required to be impleaded as Plaintiffs No. 2 to 4 in the above Suit and filed implead Petition Under Order 22, Rule 3 R/W Section 151 Of CPC & Rule 29 Of Civil Rules Of Practice Vide above I.A. No. 678/2021 to prosecute the above case against the Respondents/Defendants,.

The above matter is posted to 28-12-2023. If any persons have got any objection to bring on record the above mentioned Petitioners/Proposed parties as Plaintiffs No. 2 to 4 in the above Suit being the legal heirs and legal representatives of deceased Smt. K. Sundaramma (Plaintiff), he/she/they may appear in the above designated Court at 10.30 a.m. in person or by an advocate duly instructed. Therefore make it convenient to attend the Court on the said date and time before the Hon'ble Court. In the event of your failing to appear before the designated Court, matter will be heard and appropriate orders will be passed by the Hon'ble Court in accordance with law.

(By Order of the Court)
M S THIRUNATHAN, N. Omprakash, Sabitha, S J B Jayavalli,
Advocate,
H. No. 1-11-59 /B, Chinna thokatta, New Bowenpally, Secunderabad-500011.
Cell No. 9885177045.

IN THE COURT OF THE HON'BLE V ADDL JUNIOR CIVIL JUDGE : CUM V ADDL METROPOLITAN MAGISTRATE ::MEDCHAL MALKAJGIRI TRICT COURTS:: AT LB NAGAR
OS NO.1050/2022

Between:
State Bank of India
SME Centre Secunderabad .....Plaintiff
And
M/s. Radhika Enterprises and another ....Defendants

To
1. M/s Radhika Enterprises, Rep. By its Prop. R Radhika, H.No1-24, Old Meerpet, Mallapur, Uppal, Old Meerpet RR Dist - 500076
2. Mrs. R. Radhika, W/o R. Alexander, H.No.1-24, Old Meer pet, Mallapur, Uppal, Old Meerpet RRDist - 500076

Take notice that the above named plaintiff instituted the suit against both of you for recovery of Rs 13,41,209-00Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 22-12-2023 at 10.30 AM. Take notice that in default of your appearance the suit will be heard and decided in your absence.

//BY ORDER OF THE COURT//
Ms. **D.K Lakshmi Kumari**
Flat No.304, H.No. 8-90/34/5 & 8-90/35/5, Manikanta Paradise Apartment, Dwarakanagar, Phase-II, Uppal, Hyderabad, Pin Code- 500 039.
Counsel For Plaintiff

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE -CUM-IX ADDL. METROPOLITAN MEGISTRATE AT: MEDCHAL
O.S.No. 334 of 2023

Between:
1) Smt.Sangyavula Kavitha, W/o. Late.Sangyavula Harikrishna Aged about 38 years, Occ: Housewife
2) Sangyavula Nikil, S/o. Late.Sangyavula Harikrishna Aged about 20 years, Occ: Student
3) Sangyavula Varshini, D/o. Late.Sangyavula Harikrishna Aged about 17 years, Occ: Student (Petitioner No.3 is being minor rep by its her mother and natural guardian i.e., Petitioner No.1 Smt.Sangyavula Kavitha)
All are R/o. H.No.2-7, Dabilpur, Medchal Mandal,Medchal District-501401 .... Plaintiffs

AND

1) The Tahasildar/Mandal Revenue Officer Medchal Mandal
2) All Concerned ... Defendants

NOTICE

The plaintiffs have filed a suit for declaration of legal heir of Late Sangyavula Harikrishna thereby honorable court on 10-08-2023 has directed to take out notice on general public as well as on defendants by way of paper publication. Thereby the defendants are advised to take notice and appear before honorable court on 19-12-2023 by 10:30 AM for cause of any replay otherwise honorable court may proceed with OS proceedings and will decide on ex party as per law.

// BY ORDER OF THE HON'BLE COURT //
M/s. PARSHURAM POLAVENI
ADVOCATE
Plot No. 137, Teachers colony, Thirumalagiri, Secunderabad
Ph.8885678395

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL AT : ATHIVELLI.
O.S. NO. 682 OF 2023

BETWEEN:
1.PELLURI SEETHA RAMA ANJANEYA SHARMA,
2.YEDDANAPUDI VENKATA NAGA PADMAVATHI DEVI,
3.PELLURI VENKATA NARASIMHA PAVAN KUMAR,

AND

1. THE TAHSILDAR, BACHUPALLY MANDAL, OFFICE OF THE TAHSILDAR, BACHUPALLY VILLAGE AND MANDAL, ...PLAINTIFFS
2.TO THE ALL CONCERNED ...DEFENDANTS

SUMMON

Please take the Notice that, the above named Plaintiffs have filed a suit for Declaration to Declare the Plaintiffs as Class - 1 (First Class) Legal Heirs of Deceased Pelluri Krishna Kumari against the Defendants at above mentioned Court.

The Hon'ble 1st Add. Junior Civil Judge-cum-VIII Addl. Metropolitan Magistrate, at Athivelli has ordered summon to you i.e., the Defendant No.2 To the All Concerned through publication of summon in a Telugu Daily Newspaper and the Suit/Case is posted on 27-12-2023 FOR YOUR APPEARANCE BEFORE the Hon'ble Court at 10-30 AM, either in person or through an Advocate if you have any objections, failing which the Hon'ble Court will hear and decide the case on merits in your absence.

//BY ORDER OF THE COURT//
P.V.S.K. CHAKRAVARTHY, VENKATA KUMAR REDDY MM, JWALA PRASAD, ADVOCATES
#28, AAKRUTHI ENCLAVE, MRO OFFICE LANE,KPHB COLONY, HYDERABAD-72.
PH:9059649139

PUBLIC NOTICE
IN THE COURT OF HON'BLE XI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT :: AT : HYDERABAD
C.M.A.No. 18 OF 2022

BETWEEN :-
Allied Industries, Rep. by its Partner Smt. Kavita Goel .....Appellant
AND
M/s. Janaki Motors, Rep. by its Proprietor Mr. A. Hariender Reddy & another ...Respondents

To,
1. M/s. Janaki Motors, Rep. by its Proprietor Mr. A. Hariender Reddy S/o. Mr. A. Pratap Reddy, Aged about: 40 Years, Occ: Business, R/o. 1-1-287/20/1, Bapunagar, Chikadpally, Hyderabad - 500020.
2. Mr. A. Harinder Reddy, S/o. Mr. A. Pratap Reddy, Aged about: 40 Years, Occ: Business, R/o. 1-1-287/20/1, Bapunagar, Chikadpally, Hyderabad - 500020.
****

Take notice that the above Appellant has filed a Civil Miscellaneous Appeal before the Hon'ble Court against the Orders passed by the Learned XXI junior Civil Judge, City Civil Court, at Hyderabad in IA.No.163 OF 2021 IN O.S.No. 1985 OF 2021, dt.04.02.2022 and the same is Posted on **17-01-2024** at 10:30 A.M. for your appearance and counter, if any. Hence, you are required to appear either in person or through your counsel, failing which the matter may be decided in your absence.

//BY THE ORDER OF HON'BLE XI ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD//
S/d-
M/s. SHARAD SANGHI & ASSOCIATES Advocates
(#91-9848050544)
Flat No.302, Vansh Towers, 3rd floor, Mahesh Nagar Colony, Chirag Ali Lane, Hyderabad-1.

IN THE COURT OF THE HON'BLE XXVII ADDITIONAL CHIEF JUDGE COURT, AT : SECUNDRABAD
I.A.No. 860 of 2023
IN
O.S.No. 61 OF 2023

BETWEEN :-
Cherukuri Balamani & Anotther ...Petitioner/Plaintiffs
AND
Ravula Ashok and others ...Respondents/Defendants

NOTICE

To,
Ch. Suresh, S/o. Ch. Venkat Rao, Aged about 42 Years, Occ: Business, R/o 1-1-79, 'C' Block Bhayanagar Colony, RTC Cross Road, Hyd.

Please take notice that the above plaintiff has filed suit for Partition and separate possession of suit property and the said suit, O.S.No.61 of 2023 and I.A. No. 860 of 2023 is coming for your appearance on **20.12.2023** before the Hon'ble Court mentioned above, Please do appear before the said court on the said date at 10.30 A.M. in person or through counsel, failing which the matter will be decided in your absence.

" BY ORDER OF THE COURT "
M/s. KATKURI HARI KRISHNA Advocate and Associates
O/o. # 4-6-72/4, Attapur, Rajendranagar, R.R.District, Telangana State-64
Email: advharikrishn@gmail.com
Mob: +91-8686115698

PUBLIC NOTICE

The General Public are hereby informed that my Client **T.Naga Lakshmi, D/o. T.Shyam Sunder Rao**, R/o. Flat No.243A, 2nd Floor of "JANAPRIYA SAINEST" Jeedimetla Village, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist., Hyderabad-55, T.S under the limits of GHMC is the owner of Flat No.243A, Block-B, 2nd Floor of "JANAPRIYA SAINEST" with buildup area of 450 Sq.sft., along with undivided share of land admeasuring 8.33 Sq.Yards out of 2558 Sq.Yards in Sy.No.278/1 8, 2 situated at Jeedimetla Village, Duthbullapur Mandal, Medchal-Malkajgiri Dist., Hyderabad-55, T.S under the limits of GHMC having purchased the same from one Smt.Talluri Leeela Kumari, W/o. T.Syam Sundera Rao under Regd. Sale Deed No.16996/2013 dated 23-11-2013. That Original Link Doc.No.5684/2001 dated 25-07-2001 of above mentioned FLAT is misplaced and if any finds the same, please hand over the same to below rnentioned our office address.

Therefore the General Public are hereby requested to hand over the Original Link Doc.No.5694/2001 dated 25-07-2001 of above mentioned FLAT to below mentioned our office address.

M. SRINIVAS RAO
ADVOCATE & NOTARY
H.No.5-5-5, Markendeya Nagar. UMCC Road, Jeedimetla, Hyderabad - 500 055.
Cell: 9705741272

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE CUM I ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
OS No. 819 OF 2023

Between :-
1. Siripuram Shylaja W/o.late Eligeti Santhosh,
2. Eligeti Thrikaran S/o.late Eligeti Santhosh
Is a minor rep.by his mother Siripuram Shylaja ..... Plaintiffs

AND

1. The Tashilder, Keesara Mandal, Medchal-Malkajgiri District.
2. All concerned, ... Defendants

To,
Whosoever concern

Take notice that the plaintiffs has filed the above case for declaring the legal heirs of Late Eligeti Santhosh in respect of property i.e.plot no 188 south part, in sy.no 418 and 419, admeasuring 80 Sq.yds or equivalent 66.88 Sq.mtrs, situated at with (Ground floor 530 Sft + First floor 530 Sft) total 1060 Sft., bearing Municipal No. 11-9/188, situated at Rampally village, keesara mandal, Medchal-Malkajgiri Dist and bounded by **North** : Plot no. 188 North Part, **South** : Plot no.189, **East** : 30' Wide Road, **West** : Plot no. 186, if anyone have objections, interest are hereby directed to appear before this Hon'ble court on **03.01.2024** at 10-30 a.m. either in person or through an advocate failing which the matter will be decided on the material available on record.

// BY ORDER OF THE COURT//
COUNSEL FOR THE PLAINTIFFS
J.SURENDRA KIRAN KUMAR, P.VIJAYA LAKSHMI, V.AGNI KUMAR,
Off:H.no.1-8-732/11 & 12, Above Moon cafe, Nallakunta, HYD-44.
Cell: 8074702064

COURT NOTICE
IN THE COURT OF HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No. 468 of 2023

Between:-
R.Yellamma .....Petitioner
AND
N.Siva Prasad and others ....Respondents

To, 1
E. Madhu, R/o,C/o, D.No:12-1-230, Bandlaguda, Nagole, Ranga Reddy District-500068 .....Respondent No.3

Take notice that the above petitioner had filed the case against you for grant of compensation for the injuries sustained by her in motor accident and the case is posted to **18/12/2023** at **10-30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Off : Flat No.226, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.
Cell : 9848260446
Counsel for the Petitioner

IN THE COURT OF THE HON'BLE I ADDL.DISTRICT JUDGE Cum-METROPOLITAN SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT AT : L.B. NAGAR
O.S.No. 328 OF 2020

BETWEEN :-
Smt.Beeravalli Sujatha .....Plaintiff
AND
1.Borugadda Sunny Francis & 2 Others .....Defendants

SUMMONS

To,
Borugadda Sunny Francis S/o. B.Joji, Aged about 39 Years, Occ: Software, R/o.H.No.169/C, Vengal Rao Nagar beside meeseva, Ameerpet, Hyderabad. (Defendant No.1)

Please take notice that, the Plaintiff herein filed the above case against the Defendants seeking for the relief of Specific Performance of Agreement of Sale dated **20-08-2018** and consequentially to declare the Regd. Agreement of Sale Cum-GPA document No.2938/2019 dated **25-04-2019** and Regd. Sale Deed Document No.6962/2019 dated **01-11-2019** as null and void and not binding on the Plaintiff and the said matter is posted to **11-01-2024** for your appearance before the above said Hon'ble court Hence, you are hereby summoned to appear before the above said Hon'ble court on **11-01-2024 at 10.30A.M** either in person or through your advocate, failing which, the matter will be heard ex-parte.

//BY ORDER OF THE COURT//
NARSIMHA DUDALA
Advocate
Plot No.29 (S/P) H.No.3-61/6 Road No.3, Sunrise Colony Kuntloor(V) Abdullapurmet (M) Ranga Reddy Dist-501 505.
Mobile No.9848626900

COURT NOTICE
IN THE COURT OF HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.P.No. 272 of 2023

Between:-
Lalita Devi and others .....Petitioners
AND
T.S.R.T.C., and others .....Respondents

To,
M. Prabhakar S/o. M. Balaiah, R/o. 2-71, Madharam, Ghatkesar, Mechal, Malkajgiri - 501 301. .....Respondent No.3

Take notice that the above petitioner had filed the case against you for grant of compensation for the injuries sustained by her in motor accident and the case is posted to **29/12/2023** at **10-30** AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
M.RAJESH KHANNA
Advocate
Off : Flat No.226, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.
Cell : 9848260446
Counsel for the Petitioner

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT AND SESSION JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
O.S.No. 1347 of 2018

BETWEEN:
Ch.Anitha & Others .....Plaintiffs
AND
Sri Sai Sagar Real Estates & Others .....Defendants

To,
1.Smt. Boddapati Aparna, W/o Sri B.Narayana, Aged about 53years., Occ: House hold, R/o.H.No.16-11-477/6/3, Flat No.402, Prashanth Residency, Near Seshi Hospital, Dilsukhnagar, Hyderabad. (Defendants Nos.7)

NOTICE

Please take notice that the above mentioned OS.No.1347/2018 is filed by the Plaintiff against you the Defendants No.6, 7 & 10 and Others, seeking Declaration of title in respect of the suit schedule properties in OS No.1347/2018 and the same stands posted to **24.01.2024** for your appearance either in person or through your Advocate on the above said date by 10:30 am, before the Hon'ble V Addl. District and Sessions Judge, Ranga Reddy District at LB Nagar, otherwise the case will be decided as per law. Hence, this notice.

(By order of the Hon'ble Court)
B.HARISUGHANDH REDDY
ADVOCATE
Plot No.66/2, Shiva Shankar Colony, Series Road, Mataji Fancy Stores Building. L.B Nagar, Hyderabad, TS-500074
harisugandh@gmail.com
Cell: 9704547777

IN THE COURT OF THE HON'BLE I ADDL.DISTRICT JUDGE Cum-METROPOLITAN SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT AT : L.B. NAGAR
I.A.No. 502 OF 2020
IN
O.S.No. 328 OF 2020

BETWEEN :-
Smt.Beeravalli Sujatha .....Petitioner/Plaintiff
AND
1.Borugadda Sunny Francis & 2 Others .....Respondents/Defendants

NOTICE

To,
Borugadda Sunny Francis S/o. B.Joji, Aged about 39 Years, Occ: Software, R/o.H.No.169/C, Vengal Rao Nagar beside meeseva, Ameerpet, Hyderabad. (Respondent/Defendant No.1)

Please take notice that, the Petitioner/Plaintiff herein filed the above case against the Respondents/Defendants seeking for the relief of Specific Performance of Agreement of Sale dated **20-08-2018** and consequently to declare the Regd. Agreement of Sale Cum-GPA document No.2938/2019 dated **25-04-2019** and Regd. Sale Deed Document No.6962/2019 dated **01-11-2019** as null and void and not binding on the Plaintiff along with said IA seeking for relief of not to alienate the Petition Schedule Property and the said matter is posted to **11-01-2024** for your appearance before the above said Hon'ble court. Hence, you are hereby summoned to appear before the above said Hon'ble court on **11-01-2024 at 10.30A.M** either in person or through your advocate, failing which, the matter will be heard ex-parte.

//BY ORDER OF THE COURT//
NARSIMHA DUDALA
Advocate
Plot No.29 (S/P) H.No.3-61/6 Road No.3, Sunrise Colony Kuntloor(V) Abdullapurmet (M) Ranga Reddy Dist-501 505.
Mobile No.9848626900

'స్పీకర్‌ను సన్మానించిన జాతీయ వడ్డెర సంఘం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేసిన గడ్డం ప్రసాద్ కుమార్‌కు జాతీయ వడ్డెర సంఘం ప్రతినిధి బృందం శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల వెంకటేష్, కోశాధికారి బత్తుల లక్ష్మీకాంతయ్య, నాయకులు మధు, తిరుమలేశ్ తదితరులు స్పీకర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఎక్కువగా ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

స్టాఫ్ నర్సు పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

ఆరోగ్యశాఖ మంత్రికి
తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ ఆఫీసర్స్ వినతి



నవతెలంగాణ- ముషీరాబాద్

స్టాఫ్‌నర్సు పోస్టులు వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ ఆఫీసర్స్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆగస్టులో రాసిన 5204 పోస్టులకు ఫైనాన్షియల్ అప్రూవల్ ఇచ్చిన 1827 పోస్టులు కలిపి మొత్తంగా 7031 పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో వెంకటేష్, గోవర్ధన్,యశ్వంత్, లక్ష్మన్,అనిత ,అర్చన , నవీన తదితరులు పాల్గొన్నారు

టీఎస్ఆర్టీసీకి రూ. 374కోట్లు విడుదలపై
టీఎంయూ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి హర్షం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాలక్ష్మి పథకానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు కల్పిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం సబ్సిడీని 374 కోట్ల రూపాయలు కేటాయించడంతో పాటు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలతో పాటు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) ప్రధానకార్యదర్శి థామస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిధులను కార్మికులు ఎప్పటినుంచో వారి ఆర్థిక అవసరాలకోసం ఎదురుచూస్తున్న సీసీఎస్ బకాయిలు చెల్లింపునకు వినియోగించాలని ఆర్టీసి యజమాన్యానికి ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో రాజశేఖర్ రెడ్డి తర్వాత ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి మాత్రమే ఆర్టీసీ మీద ఇంత త్వరగా సమీక్ష జరిపి నిధులు కేటాయించారని థామస్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ లాంటి అపరిష్కృత సమస్యలపై త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. సంస్థను అభివృద్ధి బాటలో నడిపించే కృషికి ఎల్లవేళలా ప్రభుత్వానికి తాము మద్దతుగా ఉంటామని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు ఏ.ఆర్. రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, ముఖ్య సలహాదారు బోయపల్లి యాదయ్య, జీపీ రెడ్డి, బి.నరేందర్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించి పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షులు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండవ రోజు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన లో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య , బీద మస్తాన్‌రావు, వి.హెచ్. హనుమంత రావు, బడుగుల లింగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 సం.రాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిపింది. కేంద్ర మంత్రి వర్గంలో, రాష్ట్ర మంత్రి వర్గంలో, లోక్ సభ, రాజ్య సభ, రాష్ట్ర అసెంబ్లీలు, కౌన్సిల్సులో 71 సంవత్సరాల బీసీ ల ప్రాతినిధ్యం సర్వే చేసి లేకించగా, 14 శాతం దాట లేదంటే బీసీలకు ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంత అన్యాయం జరిగిందో తెలుస్తుందన్నారు. 29 రాష్ట్రాలలో 16 రాష్ట్రాల నుండి ఒక్క బీసీ పార్లమెంట్ సభ్యులు లేరు. అలాగే గత లోక్ సభలో 545 లోక్ సభ సభ్యులలో బీసీలు కేవలం 96 మంది మాత్రమే.. ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎక్కడ కనిపిస్తుందన్నారు. తెలంగాణలో 119 ఎమ్మెల్యేలు ఉంటే బీసీలు కేవలం 22 మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా 20 జిల్లాల నుంచి ఒక్క బీసీ శాసనసభ్యులు లేరన్నారు. రాష్ట్రంలో 112 బీసీ కులాలు ఉండగా 104కులాలు ఇంతవరకు అసెంబ్లీ గడప తొక్కలేదు. ఇంత తక్కువ ప్రాతినిధ్యం చూస్తే ఇదేలా ప్రజస్వామ్యమవుతుంది. 52 శాతం జనాభా గల బీసీలకు ప్రాతినిధ్యం ఏది? బీసీలు ఓట్లు వేయడానికేనా? ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారింది. డబ్బుల ప్రభావం ఎన్నికల మీద విపరీతంగా వుంది. ఇలాంటి పరిస్థితులలో డబ్బులు లేని బీసీలు ఎన్నికలలో గెలవలేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాధర్నాలో గుజ్జ కృష్ణ, మరేష్, మహేందర్, కర్రీ వేణు మాధవ్, నీలా వెంకటేష్, భూపేసాగర్, నంద గోపాల్, వేముల రామకృష్ణ, పృథ్వీ గౌడ్, డా.పద్మలత, కృష్ణ మూర్తి, ఉదయ్ నేత, రవీందర్, శివ, కిరణ్ భాషయ్య, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ టైమ్స్ కేఫ్‌పై జూబ్లీహిల్స్ పోలీసుల మెరుపు దాడి

- హుక్కా సప్లై చేస్తున్న నలుగురు నిందితులు అరెస్టు, పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు
- భారీగా హుక్కా సామాగ్రి స్వాధీనం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 లో హైదరాబాద్ టైమ్స్ కేఫ్ ఆరవ అంతస్తులో అక్రమంగా అనేకమందికి హుక్కా సప్లై చేస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి, భారీగా హుక్కా సామాగ్రిని స్వాధీనం చేసుకున్న సంఘటన జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి పదిన్నర గంటలకు వెస్ట్ జోన్ డీసీపీ జోయల్ డేవిస్, ఏసీపీ కె.హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్, ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్ తన సిబ్బందితో హైదరాబాద్ టైమ్స్ కేఫ్ పై మెరుపు దాడి చేసి నలుగురు నిందితులు ఏ1. పురణం సాయి కృష్ణ చైతన్య(25) సర్వీస్ మేనేజర్, ఏ2. రౌతు సాయి భరత్(28) లిఫ్ట్ ఆపరేటర్, ఏ3. అల్లూరి జనార్ధన్(27) ,ఏ4. మహమ్మద్ షాబుద్దీన్ (27), జూబ్లీహిల్స్ బంజారాహిల్స్ లో నివసిస్తు హైదరాబాద్ టైమ్స్ కేఫ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు హైదరాబాద్ టైమ్స్ కేఫ్ మేనేజర్, ఆర్గనైజర్లు మహమ్మద్ జోషన్ అహ్మద్(38), రియాజ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాద్ టైమ్స్ కేఫ్ నుండి 28 హుక్కా పార్ట్స్, 30 హుక్కా పైప్స్, 150 హుక్కా ఫిల్టర్లు, 2. అల్యూమినియం పాత్రలు, ఒక కేజీ పరిమాణం గల హుక్కా ఫ్లేవర్స్ 5 బాక్సులు, రెండు హుక్కా టంగ్స్, కోల్ కాయల్స్ ఒక కేజీ, ఒక డీవీఆర్ , 9 రీసెంట్ బిల్లు స్లిప్స్ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్ తెలిపారు.

నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత రాథోడ్



నవతెలంగాణ- సుల్తాన్ బజార్

రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని రిజిస్టర్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుజాత రాథోడ్ అన్నారు. రాష్ట్ర వైద్యా రోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నర్సింగ్ రిజల్ట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆసుపత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్స్ కు గ్రేడ్ వన్, గ్రేడ్ 2 ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. జీఓ నెం 317ను సవరించాలని మంత్రిని కోరమన్నారు. ఈ సమ స్యల పైన ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ శిరీష రాణి, లక్ష్మణ్, హరిత, సౌమ్య, కిరణ్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ కులాల సమితి సమస్యలు పరిష్కరించాలి

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును కలిసిన
రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్ ఆధ్వర్యంలో ఐటీ శాఖమంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ ఫెడరేషన్ కులాల సమస్యలను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి స్పందిస్తూ ఫెడరేషన్ కులాల సమస్యల పరిష్కారానికి బీసీ మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్య దర్శి కీర్తి యుగంధర్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ సంఘ వీరప్ప, మీడియా కమిటీ చైర్మెన్ ఎం.భాస్కరుడు, రాష్ట్ర కార్యదర్శిలు చేర్యాల రాకేష్, రానా నగేష్ సింగ్, రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు కొత్తపల్లి బాయమ్మ, గ్రేటర్ మహిళా కమిటీ అధ్యక్షురాలు సునీత,రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ వైస్ చైర్మెన్ గా చుక్కల శ్రీకాంత్ ,రాష్ట్ర రాష్ట్ర కమిటీ సోషల్ మీడియా కన్వీనర్ గా దుర్గా ప్రసాద్ తదితరులున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి
ఎం.నరసింహ డిమాండ్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గత ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 1 వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన రెండవ ఏఎన్ఎంల సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కోఠి లోని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావుని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ప్రభుత్వ ప్రతినిధిగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ వ్యవహరించరన్నారు. సమ్మె కాలంలో చర్చలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. సెప్టెంబర్ 1న జరిగిన చర్చల్లో భాగంగా డీహెచ్ రెండవ పీఎన్ఎంల సమస్యలు పరిష్కరించటంతో పాటు, 100% గ్రాస్ శాలరీ ఇప్పించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసి వీలైనంత త్వరలో అనుకూలమైన రిపోర్టును ప్రభుత్వానికి తయారు చేసి పంపిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలో భాగంగా సెప్టెంబర్ 3న తమతో కూడిన త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ప్రకటించిం దని ఆనాటి నుండి నేటి వరకు ఒక్కసారి కూడా ఆ కమిటీ సమావేశం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కానందునే మరోసారి పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. రెండవ సారి సమ్మె కారణంగా సమ్మె కాలానికి వేతనం చెల్లించారు తప్ప పీఆర్సీ బకాయిలను విడుదల చేయలేదని, కమిటీకి సంబంధించి ఇంతవరకు సమావేశం కూడా ఇంతవరకు కాలేదన్నారు. త్వరగతిన సమావేశాన్ని ఏర్పాటు చేసి రెండవ ఏఎన్ఎంలకు 100% గ్రాస్ శాలరీని ఇప్పించే విధంగా అనుకూలమైన రిపోర్టును ప్రభుత్వానికి అందించాలని డీహెచ్‌ను ఈ సందర్భంగా ఆయన కోరారు. సమ్మె చేసిన తర్వాత రెండవ ఏఎన్ఎంలకు సంబంధించిన పనిభారం బాగా పెరిగిందన్నారు, ఇబ్బడి ముబ్బడిగా ఉన్న యాప్‌లన్నింటిని అనుసంధికరించి ఒకటి లేదా రెండు యాప్‌లను సృష్టించి పని భారం తగ్గించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన డీహెచ్ త్వరలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యలను నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు రెండవ ఏఎన్ఎంల సంగం ప్రధాన కార్యదర్శి బి. శ్యామల, రాష్ట్ర నాయకురాలు పి. జయమ్మ డి. జ్యోతి, తస్వీర్ సుల్తానా, పి పద్మ, రాజేశ్వరి, పర్వీన్, స్కైలాబ్ రాణి, లత,గోపమ్మ, ప్రియాంక,రజిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఫార్మాసిస్టులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

డిపార్టుమెంట్ ఆఫ్ ఆయుష్ హాస్పిటల్స్, డిస్పెన్సరీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఫార్మసీస్టులను రెగ్యులర్ చేయాలని ఫార్మసీస్ట్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కోఠి డిఎంహెచ్ఎస్ లో వారు మాట్లాడుతూ.. గత19 ఏండ్లుగా తక్కువ వేతనంతో ఆయుష్ డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్ట్ ఫార్మసీస్టులుగా విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయలేదన్నారు. ఈ ప్రభుత్వమైనా తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ హాస్పిటల్స్, డిస్పెన్సరీల్లో కాంట్రాక్ట్ ఫార్మసీస్టులు 59 మంది ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. జీఓ నెం 147 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమను వెంటనే రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

'ఐఎన్‌టీయుసీ ఆటో యూనియన్‌లో రమావత్ శంకర్ లాల్ చేరిక'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోకు ఆకర్షితుడినై టీఆర్ఎస్‌కేవీ ఆటో యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ఐఎన్‌టీయుసీ ఆటో యూని యన్‌లో చేరడం జరిగిందని రమావత్ శంకర్ లాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం నారాయణగూడలోని ఐఎన్‌టీయుసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ ఆయనకు కండువా కప్పి ఐఎన్‌టీయుసీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్ లాల్‌ను ఐఎన్‌టీయుసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శంకర్ లాల్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోద మల్లేష్ గౌడ్, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడానికి ఎమ్మెల్యేగా పోటీ చేశా



ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రజా సేవ చేయడానికే ఎమ్మెల్యేగా పోటీ చేశానని భాజపా ఆర్మూర్ నియోజక వర్గం ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాగ్ లింగంపల్లిలోని పైడి రాకేశ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక్క రూపాయి ఓపీ వైద్యం నిర్వహిస్తున్న సిబ్బంది ఆయన్ని కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి 1 ప్రజలకు నాణ్య మైన విద్య, వైద్యం అందించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏడాదిగా బాగ్‌లింగంపల్లిలో తాను ఒక్క రూపాయికే వైద్యం సేవలు అందజేస్తున్నానని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో మరికొన్ని చోట్ల కూడా ఒక్కరూపాయికే ఓపీ వైద్యం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి, రేవతిరెడ్డి, డీఎస్ఎస్ గంగాధర్ గుప్తా శ్రేష్ఠి సురేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి



నవతెలంగాణ-శంషాబాద్

అనారోగ్యంతో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాయపూర్ జిల్లా శంకర్ నగర్ పార్వతి నగర్‌కు చెందిన బిస్వంబర్(39) మండల పరిధిలోని సుల్తాన్ పల్లి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నాడు. ఇతను నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం ఆయన భార్య భావిత బాగ్ కు వరుసకు మరిది అయిన దేను ఘన అనే వ్యక్తి ఫోన్ ద్వారా నిన్న మధ్యరాత్రి తెలియజేశాడు. అనారోగ్యంతో బాధపడుతున్న భిస్వంబర్ ను హుటాహుటిన ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య బావితాభాగ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి శ్రీకారం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రస్తుత రాజకీయ ఎన్నికల ప్రచారంలో అనేక మార్పులు వస్తున్న నేపథ్యంలో సరికొత్త పద్ధతులతో దక్షిణ భారతదేశంలో కొత్త ప్రమాణాలు నెలకొల్పి వినూత్న వ్యూహాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి తమ సంస్థ నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని విధాత కన్సల్టింగ్ తెలిపింది. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధులు జనగాం రాజ్, ప్రశాంత్, సాయికిరణ్ తదితరులు మాట్లాడుతూ నియోజక వర్గాల్లోని ప్రజల సమస్యలపై అధ్యాయనం చేసి ఎప్పటికప్పుడు ప్రచారంపై ఎత్తులు వేస్తూ రాజకీయ నాయకులకు విశేషమైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ముఖ్యంగా రాబోయే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నికల్లో నాయకులకు ప్రచార నిర్వహణ, వ్యూహ రచన, నాయకత్వం పెంపొందించే వ్యూహం, కార్యాలయ నిర్వహణ, డిజిటల్ ప్రచారాలు, సోషల్ మీడియా నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నకిలీ ఓట్ల గుర్తింపు, పోల్ మేనేజ్‌మెంట్, ఎన్నికల కార్యాల యాల నిర్వహణ చేపడతామని వారు వివరించారు.

రైతులకు మద్దతుగా 'జగత్ ప్రసూ'



జగతికి వెలుగు నిచ్చే సూర్యుడి శక్తి ద్వారా తయారయ్యి, ప్రజలకు శక్తినిచ్చేది ఆహారం. అలాంటి ఆహారాన్ని ఆరోగ్యవంతమైనదిగా అందించేందుకు 'జగత్ ప్రసూ' అనే పేరుతో 'జేపీ ఆగ్రో అండ్ ఫుడ్స్ స్టార్టప్ కంపెనీ'ని స్థాపించారు కాత్యాయని. ప్రస్తుతం ఈ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలదాకా పలు బ్రాంచీలను విస్తరింప జేసుకుంది. ఇంతకీ ఆమెకు ఈ సంస్థ స్థాపించాలనే ఆలోచన ఎలా వచ్చిందో, దాని కోసం ఆమె పడిన శ్రమ గురించి ఆమె మాటల్లోనే...

విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ జీవితాన్ని హాయిగా గడపాల్సిన మీరు ఈ వ్యవసాయ రంగలోకి ఎందుకు వచ్చారు?

ఉమ్మడి కుటుంబం, వ్యవసాయాధారిత కుటుంబంలో పుట్టి పెరిగిన మాకు వ్యవసాయం చిన్నప్పటి నుండి పరిచయమే. చిన్నతనం నుండి నేను పెరిగిన వాతావరణం ఏదో ఒకటి సాధించాలి అనే ప్రేరణ కలిగించింది. చదువుకుని విదేశాలకు వెళ్ళినా అంత తృప్తి కలుగలేదు. ఇండియా వచ్చాక మా మూడు తరాల పెద్దలు చేసిన వ్యవసాయాన్ని అనుభవంగా తీసుకుని కొత్త పద్ధతులను అవలంభించాలనుకున్నాను. ఆ ఉద్దేశంతోనే జేపీ ఆగ్రో సంస్థను కొత్తగా ప్రారంభించాను. మా సంస్థ ద్వారా పంటలు పండించడంతో పాటు రైతులను దళారీల నుండి రక్షిస్తూ మధ్యవర్తులు లేకుండా మార్కెటింగ్ చేయించే కృషి చేయాలనుకున్నాను. తద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలనే లక్ష్యంతో కూడా ఈ సంస్థను స్థాపించాను.

ఈ రంగంలో మీ అనుభవాలు, సమస్యలు ఏమిటి?

మా అనుభవాలు అంటే ఎక్కువ దిగుబడి ఇచ్చే వంగడాలు తయారు చేసుకోవడం, సేంద్రియ వ్యవసాయాన్ని, ప్రకృతి సిద్ధమైన కర్షనం కలిగిన మొక్కల, జంతు, నీటి వ్యర్థాలు, ఇతర జీవపదార్థాలతో పాటు జీవన ఎరువులను ఉపయోగించడం. నేలలోని పోషకాలతో పంటలకు సమగ్రంగా అందే విధంగా చేయడం, సుస్థిర వ్యవసాయ దిగుబడులను సాధించడం. తద్వారా నేల, నీరు, వాతావరణం కాలుష్యం కాకుండా కాపాడుతూ నేల సజీవంగా ఉండే విధంగ చూడడం. ఇలాంటి పంటలను పండించడంలో రైతులకు శిక్షణ ఇస్తాం. ఆరోగ్యకరమైన, విషరహిత, నాణ్యమైన పంటలను దిగుబడి చేస్తాం. అలాగే పండిన పంటలను మధ్యవర్తి లేకుండా డైరెక్ట్‌గా రైతు నుండి వినియోగదారునికి అందించే విధంగా చూస్తున్నాం. ఇక సమస్యలు అంటే సాధారణంగా ఫండ్ జెనరేట్ చేయడం, వర్కింగ్ కాపిటల్ అలాగే మార్కెటింగ్, ప్రమోషన్ చేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వీటన్నింటినీ అధిగమించి మా జెపి ఆగ్రో కంపెనీ జెడ్ సర్టిఫైడ్ కంపెనీగా గుర్తింపు పొందింది.

మహిళా సాధికారత పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

జీవితమంటేనే ఒడిదుడుకుల మయం. ఇంక మహిళల పరిస్థితి చెప్పనక్కరనేలేదు. అన్ని అనుభవాల నుండి జీవితాన్ని సవాలుగా తీసుకుని నిలదొక్కుకోవాలి. ఎవరో వస్తారని సాయం అందిస్తారని ఎదురు చూడకుండా మనం మాత్రమే చేయగలం అనుకుంటే సాధించలేనిది ఏదీలేదు. ముందు మనలో ఒక జీల్ ఉండాలి. ఆలోచించి శక్తి అనుసారం అభివృద్ధి పథం వైపు నడవాలి. అప్పుడు విజయాలు ఒక విస్ఫోటంలా వరిస్తాయి.

మీరు సాధించిన విజయాలు ఏమిటి, మీకు సహకారం అందించిన వారు..?

మా సంస్థ ఇప్పుడు ఆర్గానిక్ ఉత్పత్తులైన పసుపు, మసాలా దినుసులు, గానుగ నూనెలు, సైంధవలవణం, ఇంగువ, చిరుధాన్యాలు, తేనె వంటి ఇరవైరకాల పంటలు పండిస్తున్నాం. వీటన్నింటినీ ఎకో ఫ్రెండ్లీ ప్యాకింగ్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నాం. నాబార్డ్ వారి సహకారంతో విలువ ఆధారిత జోడింపుతో రెండు వందల మంది గిరిజన రైతులకు శిక్షణను ఇచ్చి వారు పండించిన పంటను జెపీ ఆగ్రో కంపెనీ ద్వారా మార్కెటింగ్ చేయిస్తున్నాం. కెవైసీ, పీయంజీపీ ద్వారా ఫండ్ అందేలా చూడటం, ఉమెన్ ఎక్స్‌పోలో ప్రోత్సాహం అందుకోవడం, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం పొదడం. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 'న్యూ ఇన్నోవేటివ్ థాట్ బెస్ట్ ఉమెన్ స్టార్టప్ కంపెనీ అవార్డు' అందుకున్నాను.









వి హబ్ గురించి మీ అభిప్రాయం ఏమిటి?

వి హబ్ మహిళలకు చక్కటి మద్దతును ఇచ్చే సంస్థ. వి హబ్ లాంచ్ పాడ్ సర్వీస్‌లో నాకు సభ్యత్వం ఉంది. బిజినెస్ చేసే మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే సమస్య మార్కెటింగ్. కాబట్టి వీరు మార్కెటింగ్‌లో సహాయం చేస్తున్నారు. వీరి సహకారంతోనే తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలకు మా ప్రోడక్ట్స్ అందజేయ గలుగుతున్నాం

- రమాదేవి బాలబోయిన

వంటలకు అదనపు టేస్ట్ ఇవ్వాలంటే... వాటిలో పనీర్ చేర్చాలి. అయితే బయటి దుకాణాల్లో లభించే పనీర్ తాజాది కాకపోవచ్చు. అది వంటలకు అంత టేస్ట్ ఇవ్వకపోవచ్చు. అదే ఇంట్లోనే దాన్ని తయారు చేసుకుంటే ఎంతో తాజాగా ఉంటుంది. వంటలు మరింత టేస్టీగా ఉంటాయి. పైగా బయట లభించే పనీర్‌లో నిల్వ ఉండేందుకు రంగులు, ఇతర మిశ్రమాల్ని కలిపే ప్రమాదం ఉంటుంది. అందుకే పనీర్‌ను ఇంట్లోనే ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం.

ఇంట్లోనే చేసుకునేలా...

- ఆరు కప్పుల పాలు తీసుకుని ఓ గిన్నెలో పోసి మీడియం మంట మీద పెట్టి కాగబెట్టాలి. పాలు కాగుతూ ఉన్నప్పుడు రెండు చెంచాల వెనిగర్ లేదా నిమ్మ రసం అందులో వేయాలి. ఇప్పుడు పాలను నిమిషం పాటు అటూ ఇటూ కదుపుతూ ఉండాలి. వాటిలో పాలు నీరు వేరవుతాయి. ఒక వేళ అలా అవ్వకపోతే అయ్యే వరకూ కదుపుతూ కాగబెడుతూండాలి. కచ్చితంగా పాలు, నీరూ వేరయిపోతాయి.
- స్టవ్ ఆఫ్ చేసి, పెద్ద పల్చటి గుడ్డలో పోసి వడగట్టాలి. నీరు కిందికి పోయి గుడ్డలో పాల ముద్ద మిగులుతుంది. వెంటనే చల్లటి నీటిని ఆ పాల ముద్దపై పోయాలి. ఇలా చేయడం వల్ల వెనిగర్ వాసన లేదా నిమ్మరసం వాసన తొలగిపోతుంది. ఇలా పాల ముద్ద మొత్తాన్నీ నీటితో కడిగేయాలి.
- అధికంగా ఉన్న నీరు మొత్తం తీసేయాలి. అంటే గుడ్డలో పాల ముద్దను బిగించి కట్టి గాలి తగిలే చోట అర గంట పాటు వేలాడదీయాలి. ఇలా చేస్తే అందులో ఉన్న నీరు మొత్తం పోతుంది. అరగంట తర్వాత కూడా ఆ పాల ముద్దలో ఎంతోకొంత నీటి ఆవిరి ఉంటుంది. అది పోవడానికి ఆ ముద్దపై ఏదైనా భారీ బరువైన పాత్రను మూడు నాలుగు గంటల పాటూ ఉంచాలి. అంతే తాజా పనీర్ తయారైనట్టే.
- ఈ పనీరును చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవచ్చు. అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు. దీన్ని తయారు చేయడానికి ఫ్లవర్ ఫ్యాట్ మిల్క్ అయితే మేలు. సాధారణ పాలతో ఎక్కువ పనీర్ తయారవ్వదు. పాలు చాలా చిక్కగా ఉండాలి. ఈ పనీరును ఆవు పాలు, గేదె పాలు, మేక పాలతోనూ తయారు చేయవచ్చు. కానీ పాలలో కొవ్వు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.



బొప్పాయి తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు. బొప్పాయి ఆకుల రసం తాగితే ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరుగుతుంది. అలాగే ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు పుష్కలం. రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది.

పోషకాలు పుష్కలం

- భోజనం తర్వాత బొప్పాయి తింటే ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. పొట్ట, పేగుల్లో విషపదార్థాల్ని తొలగిస్తుంది.
- బొప్పాయిలోని ఫ్లేవనాయిడ్స్, పొటాషియం, మినరల్స్, కాపర్, మెగ్నిషియం, ఫైబర్ వంటి పోషకాలు మనకు ఎంతో మేలు చేస్తాయి.
- డెంగూ ఫీవర్‌తో బాధపడే వారికి ఎర్ర రక్త కణాల సంఖ్య తగ్గి పోతుంది. అలాంటి వారు తప్పని సరిగా బొప్పాయి తినాలి. దాంతో ప్లేట్ లెట్స్ మళ్లీ వేగంగా పెరుగుతాయి. వీటి ఆకుల రసం తాగినా చక్కటి ఫలితం ఉంటుంది.
- ఈ పండులో క్యాలరీలు తక్కువే. అందువల్ల ఎక్కువగా తిన్నా బరువు పెరిగే ప్రమాదం ఉండదు. పైగా ఇది చెడు కొవ్వును తరిమేస్తుంది. గుండెకు రక్తం చక్కగా సరఫరా అయ్యేలా చేస్తుంది.
- మూత్ర పిండాల్లో రాళ్ళు ఉండేవారికి ఇది సరైన మందు. బొప్పాయి రెగ్యులర్‌గా తింటే మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లను అరికట్టవచ్చు.
- అలసట, నీరసం వంటి అనారోగ్య సమస్యల్ని బొప్పాయి తొలగిస్తుంది. ఎర్ర రక్త కణాల సంఖ్య పెరిగి బలం వస్తుంది.
- కాన్సర్‌పై పోరాడే గుణాలు బొప్పాయిలో ఉన్నాయి. ఇందులో బీటాకెరోటిన్, లూటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు కాన్సర్ వైరస్‌తో పోరాడతాయి.
- బొప్పాయి అప్పుడప్పుడూ తింటూ ఉంటే కండ్లకు చాలా మంచిది.
- బీపీ, షుగర్ ఉన్న వాళ్లు కూడా బొప్పాయి తింటే మంచిదే.
- నారింజ, యాపిల్ కంటే బొప్పాయిలో విటమిన్ ఇ చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మన చర్మం సున్నితంగా, మృదువుగా, కోమలంగా మారడానికి ఉపయోగపడుతుంది.
- బొప్పాయి రుచిగా ఉంటుంది కదా అని మరీ ఎక్కువగా తినకూడదు. మితంగా తీసుకుంటేనే ఆరోగ్యం.



అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతత్వంలో చేపడుతున్న అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర వహించాలని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమాచార శాఖ పనితీరును సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలను చైతన్యం చేయడంలో సాంప్రదాయ ప్రచార మాధ్యమాలతోపాటు సోషల్ మీడియా వింగ్‌ను విస్తతస్థాయిలో ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ మాస పత్రికను మరింత ప్రామాణికమైన పత్రికగా తీర్చి దిద్దడంతోపాటు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, ప్రజాప్రతినిధులకు, సామాన్య ప్రజానీకానికి అందుబాటులో తేవాలన్నారు. ఈ సందర్భంగా సమాచార శాఖలో వివిధ విభాగాల పనితీరును మంత్రి సమీక్షించారు. ప్రింట్ మీడియా , అవుట్ డోర్ విభాగం చేపట్టిన కార్యక్రమాలపై కూడా సమీక్ష జరిగింది. జర్నలిస్టుల సంక్షేమం, క్షేత్ర స్థాయిలో ప్రచార నిర్వహణపై దష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. సమాచార శాఖ పనితీరును మెరుగు పర్చాలని అధికారులను ఆదేశించారు. సమాచార శాఖ తోపాటు మీడియా అకాడమీ చేపట్టిన కార్యక్రమాలపై సమాచార కమీషనర్ అశోక్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ బి. రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లీ, జాయింట్ డైరెక్టర్లు జగన్, శ్రీనివాస్, వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు మధు సూధన్, హష్మి, రాజా రెడ్డి, సురేష్ , చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ రాధా కిషన్, ప్రాంతీయ సమాచార ఇంజినీర్ జయరామ్ మూర్తి, రాములు, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ కుమారి, అధికారులు పాల్గొన్నారు.

అధ్యక్షా...

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు, కేటీఆర్, కూనంనేని తదితరులు ఆయన్ను స్పీకర్ స్థానం వరకూ తోడ్కొని వెళ్లి కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ... స్పీకర్‌గా ప్రసాద్‌కుమార్ సభ హుందాతనాన్ని, గౌరవాన్ని కాపాడాలనీ, సత్సాంప్రదాయాలను నెలకొల్పాలని ఆకాంక్షించారు. సభ్యుల ప్రసంగాల అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీ కమిటీహాల్‌లో సీఎం రేవంత్ అధ్యక్షతన భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం... శుక్రవారం సభలో గవర్నర్ చేయబోయే ప్రసంగానికి ఆమోదం తెలిపింది. సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) శుక్రవారమే సమావేశమై...అసెంబ్లీని ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై నిర్ణయిస్తుందనే వార్తలొచ్చాయి. అయితే బీఏసీ రూపుదాల్చాలంటే వివిధ పార్టీల నుంచి ఎవరెవరు ఆ సంఘంలో సభ్యులుగా ఉంటారనే దానిపై స్పష్టత రావాలి. దానికి అనుగుణంగా ఆయా పార్టీలు అసెంబ్లీ కార్యదర్శికి లేఖలు సమర్పించాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ పూర్తికానుందున బీఏసీ సమావేశం శుక్రవారం ఉండే అవకాశం లేదని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. అందువల్ల శనివారం వరకే సమావేశాలు కొనసాగుతాయనీ, ఆ తర్వాత సభను నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై స్పీకర్ తుది నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం.

సందడే సందడి...

గురువారం అసెంబ్లీ ప్రాంగణమంతా సందడి నెలకొంది. సీఎం, మంత్రులు, సభ్యులు సభకు వచ్చేటప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు కార్యకర్తలు, అభిమానుల హడావుడి, మీడియా హంగామా కనిపించింది. ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఛాంబర్ వద్ద రద్దీ నెలకొంది. పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వికారాబాద్‌కు చెందిన నాయకులు, పాత్రికేయులు ఆయనకు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంధనశాఖ కార్యదర్శిగా రిజ్వీ...

(మొదటిపేజీ తరువాయి)

జాయింట్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి నియమితులయ్యారు. మూసీ అభివద్ధి సంస్థ ఇన్‌చార్జి ఎమ్‌డీగానూ ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్, ట్రాన్స్‌కో సంయుక్త ఎండీగా సందీప్‌కుమార్ ఝూ, దక్షిణ డిస్కమ్ సీఎండీగా ముషారఫ్ అలీ, ఉత్తర డిస్కమ్ సీఎండీగా కర్నాటి వరుణ్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా బి.గోపి నియమితులయ్యారు.

కరాచీ బేకరీ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-శంషాబాద్

బేకరీ కిచెన్‌లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ పైప్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 15 మందికి గాయాలు కాగా ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గగన్ పహాడ్‌లో గురువారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గగన్ పహాడ్ పారిశ్రామికవాడలో నిర్వహిస్తున్న కరాచీ బేకరీ ఫ్యాక్టరీలో ఎప్పటిలాగే ఉదయం 10:30 గంటల సమయంలో ఆహార పదార్థాలను తయారుచేస్తున్న క్రమంలో బయట ఆవరణలో ఉన్న పైపుల నుంచి సరఫరా అయ్యే గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో అక్కడే వంట చేస్తున్న కార్మికులు మంటల్లో చిక్కుకున్నారు. ఆ సమయంలో 18మంది పనిలో ఉండగా.. వారిలో 15మంది గాయపడ్డారు. వీరందరినీ శంషాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న వారిని డీఆర్‌డీవో అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ ఏసీపీ రామ్‌చంద్రరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే శంషాబాద్‌లోని ట్రైడెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను రంగారెడ్డి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ పరామర్శించారు. ఘటనకు గల కారణాలకు బాధితులను అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ లేబర్ ఆఫీసర్ వాల్యానాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఎంతమంది పనిచేస్తున్నారనే విషయం తమకు తెలియదని చెప్పారు. గాయపడిన వారిలో.. బలరాం, సుభాన్ ప్రజాపతి, అదితి కుమార్, సందీప్ ప్రజాపతి, దీపక్ శుక్ల, అమ్రేష్ కుమార్, ముఖేష్ కుమార్, దారేష్ సింగ్, సోను, కమల్ కిషన్, ప్రమోద్‌కుమార్, సుజీత్, సందీప్ కుమార్, సన్నీ, ప్రదీప్‌లకు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. వీరంతా ఉత్తరప్రదేశ్‌కి చెందిన వలస కార్మికులుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి

కరాచీ బేకరీ గోడౌన్‌లో గురువారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ 15 మంది కార్మికులకు మెరుగైన వైద్య చికిత్సను అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గాయపడ్డ వారిలో ఎక్కువగా ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన కార్మికులున్నారని తెలిపారు. గాయపడ్డ వారిలో 8 మందిని కంచన్ బాగ్ డీఆర్డీఓ ఆస్పత్రికి తరలించారనీ, వారికి మెరుగైన వైద్య సదుపాయాలూ అందచేయాలంటూ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని సీఎం ఆదేశించారు.

వైఫల్యానికి బాధ్యులంటూ...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్‌లో బుధవారం జరిగిన పొగదాడి ఘటనపై అధికారులు చర్యలు చేపట్టారు. భద్రతా వైఫల్యానికి కారణమైన వారుగా పేర్కొంటూ ఎనిమిది మందిని సస్పెండ్ చేస్తున్నట్టు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన అధికారుల్లో ప్రదీప్, , రాంపాల్, అరవింద్, గణేశ్, నరేంద్ర, అనిల్, విమిత్, వీరదాస్ ఉన్నారు.

ప్రధాని మోడీ సమీక్ష..

ఘటనపై ప్రధాని మోడీ గురువారం కీలక మంత్రులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, మంత్రులు ప్రహ్లాద్ జోషీ, అనురాగ్ ఠాకూర్, పీయూశ్ గోయల్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డా కూడా సమావేశానికి హాజరయ్యారు.

'ఉపా' చట్టం కింద కేసు..

ఈ ఘటనలో నిందితులపై పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేశారు. వీరిని గురువారం పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపర్చారు. వారిని ఏడు రోజుల కస్టడీని విధించింది. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు ఉపా కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దీని వెనక ఆరుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేయగా.. ఓ వ్యక్తి పరారీలో ఉన్నట్టు పోలీసులు వివరించారు. అరెస్టయిన వారిలో డి.మనోరంజన్, సాగర్, అమోల్ షిండే, నీలందేవిలను బుధవారం అదుపులోకి తీసుకోగా.. మరో నిందితుడు విశాల్‌ను గురుగ్రామ్‌లో అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న లలిత్ కోసం గాలిస్తున్నారు.

పాస్‌లు జారీ అయింది ఇలాగే..

లోక్‌సభలో దాడికి పాల్పడిన వ్యక్తులకు బీజేపీ మైసూరు ఎంపీ ప్రతాప్ సింహా కార్యాలయం నుంచి సందర్శకుల పాస్‌లు జారీ అయ్యాయి. దాడికి పక్కా ప్రణాళికతోనే సిద్ధమైనట్టు అధికారులు భావిస్తున్నారు. లోక్‌సభలో సందర్శకుల గ్యాలరీ నుంచి దూకిన డి.మనోరంజన్ మైసూరుకు చెందిన వాడని, తరచూ ఎంపీ ఆఫీసుకు వస్తుండేవాడని, విజిటర్స్ పాస్ కోసం మనోరంజన్ మూడు నెలలుగా ఎంపీ ఆఫీసును సంప్రదిస్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. ఆయనతో పాటు సభలో బెంచ్‌లపై నుంచి దూకుతూ స్పీకర్ చాంబర్ వైపు దూసుకెళ్లిన సాగర్ శర్మను మనోరంజన్ తన స్నేహితుడని చెప్పి, పాస్ తీసుకున్నట్టు గుర్తించారు.

కొత్త పార్లమెంటును చూడాలని ఉందంటూ ఎంపీ కార్యాలయ అధికారులకు చెప్పి, వీరు పాస్‌లు తీసుకున్నారు. బుధవారం సింహా తరపున మొత్తం మూడు పాస్‌లు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. మరో మహిళకు పాస్ ఇచ్చినప్పటికీ.. ఆమె తన కుమార్తెతో కలిసి రావడం, చిన్నారి పేరు పాస్‌లో లేకపోవడంతో అనుమతించలేదని ఎంపీ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

రెక్కీ నిర్వహించింది మనోరంజనే..

ఈ ఘటన మొత్తానికి మాస్టర్ మైండ్ మనోరంజనే అని పోలీసు వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఆయన పిలుపుతోనే మిగతా వారు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారని పోలీసులు గుర్తించినట్టు సమాచారం.

ఈ ఏడాది జరిగిన వర్షాకాల సమావేశాల సమయంలో మనోరంజన్ పార్లమెంట్ వద్ద రెక్కీ నిర్వహించినట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. పార్లమెంట్‌లో సిబ్బంది బూట్లను తనిఖీ చేయడంలేదనే విషయాన్ని అప్పుడే అతడు గుర్తించాడు. పోలీసులు అతడే ప్రధాన కుట్రదారు కావచ్చేమో అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటన సమయంలో లలిత్ కూడా పార్లమెంట్ ప్రాంగణంలోనే ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. పార్లమెంట్ సమీపంలో నీలమ్, అమోల్ ఆందోళన చేస్తుండగా ఆ వీడియోను లలిత్ ఫోన్లో రికార్డ్ చేసినట్టు తెలిసింది. భద్రతా సిబ్బంది వారిని పట్టుకోగానే.. నిందితులదరి ఫోన్లతో లలిత్ అక్కడి నుంచి పరారైనట్టు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ఆ వీడియోను పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ఎన్జీవో సభ్యురాలికి పంపినట్టు సమాచారం. సదరు ఎన్జీవో సభ్యురాలు మీడియాతో మాట్లాడుతూ.. "గతంలో లలిత్ మా ఎన్జీవోతో కలిసి పనిచేశాడు. పార్లమెంట్ వద్ద ఆందోళనకు సంబంధించి నాకు వాట్సాప్ లో ఓ వీడియో షేర్ చేశాడు. దాన్ని వైరల్ చేయమని మెసేజ్ చేశాడు" అని ఆమె వెల్లడించారు.

దాడి జరిగాక భద్రత కట్టుదిట్టం

తాజా ఘటన నేపథ్యంలో పార్లమెంట్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పార్లమెంటు ప్రాంగణం.. బయట అధికారులు భద్రతను పెంచారు. ఢిల్లీ పోలీస్, పారా మిలిటరీ, పార్లమెంట్ ' స్పెషల్ సెక్యూరిటీ గార్డులతో పహారా నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ సమీపంలో భద్రతా సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేశారు. పాసులు ఉన్న వారికి మాత్రమే పరిసర ప్రాంతాల్లోకి వెళ్లే అవకాశం ఇస్తున్నారు. పార్లమెంట్ భవనానికి వెళ్లే మార్గాలన్నింట్లో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

అడుగడుగునా ఆంక్షలు విధించారు. ఎంపీలు ప్రవేశించే 'మకర ద్వారం' నుంచి ఇతరులు వెళ్లకుండా నిషేధం విధించారు. మకర ద్వారం వద్ద వంద మీటర్ల దూరంలో ఉండాలని మీడియాపై ఆంక్షలు విధించారు. ముందస్తు భద్రతా తనిఖీలు నిర్వహించి మీడియా సిబ్బందికి పాసులు జారీ చేస్తున్నారు. ఇక పార్లమెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి బూట్లను కూడా స్కాన్ చేస్తున్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

నేను లేకపోయినా.. సస్పెండ్ చేశారు: డీఎంకే ఎంపీ ఎస్ఆర్ పార్థిబన్

డీఎంకే ఎంపీ ఎస్ఆర్ పార్థిబన్ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్ జాబితాలో తన పేరు నమోదు కావడం "జోక్" అని అన్నారు. "నేను అనారోగ్యంతో ఉన్నందున సభలో లేను" అని అన్నారు.

మధుర కృష్ణ జన్మభూమి కేసులో షాహీ ఈద్గాను సర్వే చేయండి

న్యూఢిల్లీ : యూపీలోని మధురలో గల షాహీ ఈద్గా మసీదును న్యాయస్థానం నియమించిన, పర్యవేక్షించే అడ్వకేట్ కమిషనర్ సర్వేకు అలహాబాద్ హైకోర్టు ఆమోదం తెలిపింది. ఇది కృష్ణుడు జన్మించిన ప్రదేశమంటూ హిందుత్వ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయస్థానం పై విధంగా స్పందించటం గమనార్హం. స్థలాన్ని సర్వే చేయడానికి కమిషన్‌ను నియమించాలని మేము చేసిన విజ్ఞప్తిని కోర్టు అనుమతించిందని పిటిషనర్ల తరపు న్యాయవాది రంజనా అగ్నిహోత్రిని తెలిపారు. పిటిషనర్ల తరపు మరో న్యాయవాది విష్ణు శంకర్ జైన్ మాట్లాడుతూ.. "అడ్వకేట్ కమిషనర్‌ను తప్పనిసరిగా నియమించాలన్న మా డిమాండ్‌ను కోర్టు అనుమతించింది. అడ్వకేట్ కమిషనర్ ఎవరు? విధివిధానాలు ఎలా ఉంటాయి? త్రిసభ్య కమిటీ వేయాలా? ఈ విషయాలన్నీ డిసెంబర్ 18న నిర్ణయించబడతాయి" అని చెప్పారు. 13.37 ఎకరాల భూమిని ఆలయ నిర్వహణకు పూర్తి యాజమాన్యం ఇవ్వాలని కోరుతూ మధురలోని వివిధ కోర్టుల్లో మొత్తం 18 వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు ఈ అన్ని అభ్యర్థనలను కలుపుకొని ఈ అంశంపై తీర్పు కోసం వాటిని స్వయంగా బదిలీ చేసింది. ఆగస్టు 15, 1947న ఉన్న ఏ ప్రార్థనా స్థలం అయినా మతపరమైన హోదాను కొనసాగించే 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉటంకిస్తూ పిటిషన్‌లను రద్దు చేయాలని ప్రార్థిస్తూ మసీదు పక్షం గతంలో హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును ముస్లిం పక్షం సుప్రీంకోర్టులో సవాలు చేస్తుందని అంతా భావిస్తున్నారు.

కక్ష సాధింపులుండవ్ : సీఎం రేవంత్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్ఎస్ సర్కారు వ్యవసాయం సాగు కోసం ఎప్పుడూ 24 గంటల విద్యుత్ సరఫరా చేయలేదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైతులకు ఉచితం పేర ఇచ్చింది కేవలం 12 నుంచి 14 గంటల కరంటేనని గుర్తు చేశారు. అందరితో చర్చించిన తర్వాతే సమయానుకూలంగా శ్వేతపత్రాలు విడుదల చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గానీ, ఆ సర్కారులోని మంత్రులపైగాని కక్షసాధింపు చర్యలుండవని అభిప్రాయపడ్డారు. ' మేము చేయాల్సిన పని చాలా ఉంది..అనవసర విషయాలపై దృష్టిపెట్టం' అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా పనిచేస్తుందని చెప్పారు. గురువారం అసెంబ్లీలో స్పీకర్ ఎన్నిక, క్యాబినెట్ సమావేశం అనంతరం సీఎం, సీనియర్ జర్నలిస్టులతో 'చిట్‌చాట్' చేశారు. ఈసందర్భంగా అనేక అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో ఉంటుందన్నారు. అక్కడి ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకుంటామన్నారు. జూబ్లీహిల్స్‌లోని నా సొంత ఇంటికి దగ్గరగా ఉందనీ, అందుకే ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నట్టు చెప్పారు. పార్లమెంటు సెంట్రల్ హాల్ తరహాలో కొత్తగా శాసనమండలి నిర్మాణం చేస్తామన్నారు. అయితే తమ ప్రభుత్వం పొదుపు చర్యలు చేపడుతుందన్నారు. 'నా ఖర్చు నేనే భరీస్తున్నా..నా భోజనం నేనే చేస్తున్నా..మంత్రులు సైతం ఇందులో భాగస్వాములవుతారు' అని చెప్పారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మరో మంత్రికి అవకాశం ఇస్తామనీ, అలాగే మరో ప్రభుత్వ కార్యాలయానికి వాడుకుంటామని వివరణ ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల కోసం కొత్త గా ఎలాంటి భవనాలు నిర్మించబోమనీ, పాతవే సమర్థవంతంగా వాడుకుంటామని చెప్పారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో ఉపయోగకరంగా ఉండదనీ, మరో రూట్‌లో ప్లాన్ చేస్తామని చెప్పుకొచ్చారు. 'పాత అసెంబ్లీ భవనంలోనే కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయి. ఇప్పుడు ఉన్న అసెంబ్లీ భవనంలోనే శాసనసభ సమావేశాలు నిర్వహిస్తాం..పార్లమెంటు తరహాలో అసెంబ్లీ ఉండబోతున్నదని' సీఎం చెప్పారు. ప్రభుత్వ ధనాన్ని దుబారా చేయకుండా పొదుపు చర్యలు తీసుకుంటామని అన్నారు. జర్నలిస్టుల ఇండ్లస్థలాల విషయంలో సీఎం రేవంత్ స్పందిస్తూ ' నా మంత్రులతో మాట్లాడకుండా..ఏమీ చెప్పలేను..కమిట్ అయ్యాం..కచ్చితంగా న్యాయం చేస్తాం..ఎవరికీ అన్యాయం జరగదు' అని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో భాగంగా ప్రతిదీ ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. సీఎం, మంత్రులకు పెద్ద పెద్ద కాన్వాయ్‌లు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా కోరతామని అన్నారు

నవచిత్రం



వినాయక్ దేశాయ్. గోనాల్ వెంకటేష్, సోహెల్, దాసరి ఇస్సాకు, వసంత్ వెంకట్ బాలా

నేల మీద నేను ఉన్నా..

గ్రామీణ నేపథ్య ప్రేమకథా చిత్రాలు వెండితెరపై ఎన్ని రికార్డులు క్రియేట్ చేశాయో అందరికీ తెలిసిందే. ఎన్ని జోనర్లలో ఎన్ని కొత్త చిత్రాలు వచ్చినా గ్రామీణ నేపథ్యంలో వచ్చే ప్రేమ కథా చిత్రాలపై ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తిని చూపిస్తుంటారు. తాజాగా అలాంటి ఓ గ్రామీణ ప్రేమ కథా చిత్రమే రాబోతోంది. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ హీరో, హీరోయిన్లుగా గోనాల్ వెంకటేష్ నిర్మిస్తున్న అందమైన ప్రేమ కథా చిత్రం 'రాధా మాధవం'. ఈ మూవీకి దాసరి ఇస్సాకు దర్శకత్వం వహిస్తున్నారు. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలను అందించారు.

షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకి సంబంధించి ప్రమోషన్ కార్యక్రమాలను చిత్ర బృందం ప్రారంభించింది. రీసెంట్‌గా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను నిర్మాత రాజ్ కందుకూరి, పోస్టర్‌ను డీపీఎస్ ఇన్‌ఫో టెక్ మేనేజింగ్ డైరెక్టర్ డా.డీ.ఎస్.ఎన్.రాజు రిలీజ్ చేశారు.

తాజాగా ఈ మూవీ నుంచి ఓ అదిరిపోయే ఫాస్ట్ మాస్ బీట్‌ను బిగ్ బాస్ సోహెల్ రిలీజ్ చేసి చిత్ర యూనిట్ కి అభినందనలు తెలిపారు. 'నేల మీద నేను ఉన్నా' అంటూ సాగే ఈ పాటను వసంత్ వెంకట్ బాలా రాయగా.. వీఎం మహాలింగం, ఎంఎం మానసి ఆలపించారు. కొల్లి చైతన్య ఇచ్చిన బాణీ బాగుంది. ఓ అద్భుతమైన ప్రేమకథతో వస్తున్న ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుంది. ఈనెలలోనే ఈ మూవీని విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని చిత్ర యూనిట్ తెలిపింది.

మేక రామకృష్ణ, జయ ప్రకాష్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య, ధనుష్ ఆచార్య, రాచర్ల మహేష్, శ్రీకాంత్ పర్కాల, సతీష్ కొల్లిపల్లి, శ్రీను, అడెపు మణిదీప్, చిరంజీవి, కామనగరి జ్యోతి, సురభి శ్యామల తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి సంగీతం : చైతు కొల్లి, కెమెరామెన్ : తాజ్ జీడీకే, ఎడిటర్ : కే రమేష్, ఫైట్స్ : రాబిన్ సుబ్బు.

మరో హిట్ సాంగ్.. ఓ మై బేబీ



మహేష్‌బాబు, శ్రీలీల

మహేష్ బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో 'అతడు', 'ఖలేజా' వంటి కల్ట్ క్లాసిక్ సినిమాలు వచ్చాయి. ఈ కాంబినేషన్‌లో హారిక అండ్ హాసిని ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం 'గుంటూరు కారం'. సూర్యదేవర రాధాకృష్ణ (చిన్నబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన మొదటి టీజర్ వైరల్‌గా మారగా, 'ధమ్ మసాలా' సాంగ్.. తెలుగు ఆల్బమ్‌లలో టాప్ చార్ట్‌బస్టర్‌లలో ఒకటిగా నిలిచింది.

లేటెస్ట్‌గా మేకర్స్ మెలోడియస్ సౌండ్‌ట్రాక్ 'ఓ మై బేబీ'ని రెండవ గీతంగా రిలీజ్ చేశారు. ఈ మెలోడీ గీతానికి కూడా అద్భుతమైన స్పందన లభిస్తుందని సంగీత దర్శకుడు తమన్ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. త్రివిక్రమ్-మహేష్ బాబు, త్రివిక్రమ్-తమన్ కలయికల్లో పలు చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌లు వచ్చాయి. ఇప్పుడు ఈసినిమా కూడా మరో భారీ చార్ట్ బస్టర్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలను నిజం చేస్తూ 'ధమ్ మసాలా' బాటలోనే 'ఓ మై బేబీ' పాట కూడా భారీ చార్ట్‌బస్టర్‌గా మారనుంది. ఈ మెలోడీని శిల్పారావు పాడగా, 'సరస్వతి పుత్ర' రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. సంగీతం, సాహిత్యం, గాత్రం అన్నీ అద్భుతంగా కుదిరిన ఈ పాట శ్రోతలను కట్టిపడేస్తోంది.

శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈచిత్రంలో మీనాక్షి చౌదరి ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు ఇతర పాత్రల్లో నటిసున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది.



రానా

తేజ దర్శకత్వంలో రాక్షస రాజా

రానా, దర్శకుడు తేజ కాంబినేషన్‌లో రూపొందిన 'నేనే రాజు నేనే మంత్రి' బ్లాక్‌బస్టర్ విజయం అందుకున్న సంగతి తెలిసిందే.

ఈ సినిమా తర్వాత ఈ కాంబో 'రాక్షస రాజా'తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయ్యారు. ఇదివరకూ ఎన్నడూ చూడని క్రైమ్ వరల్డ్‌ని ఎక్స్‌ప్లోర్ చేస్తూ ఇంటెన్స్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా అద్భుతమైన సమ్మేళనంగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

రానా పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్‌ను పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా అనౌన్స్ చేశారు. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో డిఫరెంట్ రానాని చూడొచ్చని పోస్టర్ చెప్పకనే చెప్పింది.

'నేనే రాజు నేనే మంత్రి'కి మించి ఈ సినిమా ఉంటుందని, రానా, తేజ కలయికలో మరో బ్లాక్‌బస్టర్ రానుంది' అని చిత్ర బృందం తెలిపింది.

కన్నప్ప కథానాయిక..



ప్రీతి ముకుందన్

విష్ణు మంచు నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. తాజాగా మేకర్స్ మరో ప్రకటన చేశారు.

ఈ చిత్రంలో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ నటించనున్నారు. ప్రీతి నటించబోతున్న కీలక పాత్ర కోసం పలు ఆడిషన్స్ నిర్వహించాక, ఆమెను ఎంపిక చేశారట. మోహన్‌లాల్, ప్రభాస్ వంటి స్టార్స్ నటిస్తున్న ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

ఆ అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుందనే ధీమాని మేకర్స్ వ్యక్తం చేశారు. 'ప్రీతి తన భరతనాట్య కళతో పాత్రకు ప్రాణం పోయనున్నారు. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు ఆమె నృత్య నైపుణ్యం ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉంటుంది. సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు' అని చిత్ర బృందం తెలిపింది.

దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, 'ప్రీతికి ఇది తొలి సినిమా మాత్రమే కాదు. కళ, సినిమా రంగాల గురించి మరింత ఎక్కువగా నేర్చుకునే ప్రపంచంలోకి వచ్చింది. ఆమె ఈ పాత్రకు సరిగ్గా సరిపోతుంది. ఆమెతో కలిసి పనిచేయడానికి టీమ్ అంతా ఎదురుచూస్తోంది. పాన్ ఇండియా సినిమాగా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని అన్నారు.

భయపెట్టడం ఖాయం



ఖుషీ రవి

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. అవసరాల శ్రీనివాస్, ఈశ్వరీ రావు ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కథానాయిక ఖుషీ రవి మీడియాతో ముచ్చటించారు.

'నేను ఈ కథ విన్నప్పుడు మేరీగా తల్లి పాత్ర చేయడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. ప్రయోగాలు చేయడం ఇష్టం. మేరీగా నన్ను ప్రేక్షకులు ఆదరిస్తానే నమ్మకం ఉంది. అలాగే తెలుగులో 'రుద్ర' అనే మరో సినిమా చేస్తున్నాను. అందులో నేను ట్రాన్స్ జెండర్ పాత్ర పోషిస్తున్నాను. ఇలా సవాల్‌తో కూడుకున్న పాత్రలు చేయడాన్ని నేను ఎక్కువ ఇష్టపడతాను. నేను ఏ పాత్ర పోషించినా సహజంగా ఆ పాత్రలా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తాను. శ్రీరామ్‌తో కలిసి నటించడం ఎంతో సంతోషంగా ఉంది. దర్శకుడు సాయికిరణ్, నిర్మాత యశ్వంత్ పక్కా ప్రణాళికతో చిత్రాన్ని పూర్తి చేశారు. దర్శకుడు సాయికిరణకి ఏం కావాలో స్పష్టత ఉంది. అలాగే యశ్వంత్ కావాల్సినవన్నీ సమకూర్చారు. ట్యాగ్‌లైన్‌కి తగ్గట్టుగా ఈ సినిమా కచ్చితంగా అందర్నీ భయపెడుతుంది' అని చెప్పారు.

ఆటలు

శతక వార్నర్

- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 346/5
- పాకిస్థాన్‌తో తొలి టెస్టు తొలి రోజు



పెర్త్ (ఆస్ట్రేలియా) : వీడ్కోలు సిరీస్‌లో డ్యాషింగ్ ఓపెనర్ డెవిడ్ వార్నర్ (164, 211 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక విహారం చేశాడు. వార్నర్ సెంచరీకి తోడు ఉస్మాన్ ఖవాజ (41), ట్రావిశ్ హెడ్ (40), స్టీవ్ స్మిత్ (31) రాణించటంతో పాకిస్థాన్‌తో తొలి టెస్టు తొలి రోజు ఆస్ట్రేలియా 346/5 పరుగులు చేసింది. ఖవాజ తోడుగా వార్నర్ తొలి వికెట్‌కు 126 పరుగుల శతక భాగస్వామ్యం నమోదు చేశాడు. దూకుడుగా ఆడిన వార్నర్ 9 ఫోర్లతో 41 బంతుల్లోనే అర్థ సెంచరీ.. 14 ఫోర్లు, 1 ఓ సిక్సర్‌తో 125 బంతుల్లో శతకం సాధించాడు. 16 ఫోర్లు, 3 సిక్సర్లతో 196 బంతుల్లో 150 పరుగుల మార్క్ అందుకున్న వార్నర్.. ఆతిథ్య ఆస్ట్రేలియాను భారీ స్కోరు దిశగా నడిపించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి మిచెల్ మార్ష్ (15 నాటౌట్), అలెక్స్ కేరీ (14 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. పాక్ బౌలర్లలో ఆమర్ జమల్ రెండు వికెట్లు పడగొట్టాడు.

కుర్రాళ్లకు నిరాశ

- జర్మనీ చేతిలో పరాజయం
- జూనియర్ హాకీ ప్రపంచకప్



కౌలాలంపూర్ : యువ భారత్ ప్రపంచకప్ స్వప్నం చెదిరింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో జర్మనీ చేతిలో 1-4తో పరాజయం పాలైంది. పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచటంలో దారుణ వైఫల్యం చెందిన కుర్రాళ్లు.. ప్రపంచకప్ ఫైనల్‌కు దూరమైంది. సెమీఫైనల్లో భారత్‌కు 12 పెనాల్టీ కార్నర్‌లు లభించగా.. అందులో ఒక్కటీ గోల్‌గా మారలేదు. మరోవైపు ఆరుసార్లు చాంపియన్ జర్మనీ.. రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. 11వ నిమిషంలో సుదీప్ భారత్‌కు ఏకైక గోల్ అందించాడు. శనివారం కాంస్య పతకం కోసం కుర్రాళ్లు మరోసారి బరిలోకి దిగనున్నారు.

రోలర్ స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్

- సత్తా చాటిన తెలంగాణ అమ్మాయి రాధె లోయ



హైదరాబాద్ : 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్ (2023)లో తెలంగాణ అమ్మాయి రాధె లోయ పతకంతో మెరిసింది. సబ్ జూనియర్ (11-14 ఇయర్స్) విభాగంలో రోలర్ ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో రాధె లోయ రజతం పతకం సాధించింది. కర్ణాటక, తమిళనాడు అమ్మాయిలు వరుసగా గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ అందుకున్నారు. నిరుడు జరిగిన జాతీయ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం నెగ్గిన ఆర్. లోయ ఈ ఏడాది సిల్వర్ గెల్చుకుంది. నేషనల్ చాంపియన్‌షిప్స్‌లో మెడల్ సాధించిన లోయను ఆమె కోచ్ జితేంద్ర గుప్తా అభినందించారు.

తొలిరోజే 410

- దంచికొట్టిన అమ్మాయిలు
- భారత తొలి ఇన్నింగ్స్ 410/7
- ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టు తొలి రోజు

శుభ, జెమీమా, దీప్తి, భాటియా, దీప్తి అర్ధ శతకాలు

టీ20 తరహా స్ట్రయిక్‌రేట్ లేదు. ప్రత్యర్థి బౌలర్లపై నిర్దాక్షిణ్య దండయాత్ర లేదు. బ్యాటింగ్ లైనప్ నుంచి ఒక్క సెంచరీ నమోదు కాలేదు. అయినా.. టీమ్ ఇండియా అమ్మాయిలు అదరగొట్టారు. టీమ్ గేమ్ స్ఫూర్తి ఏంటో ఇంగ్లాండ్‌కు రుచి చూపించారు. శుభ సతీశ్ (69), జెమీమా (68), యస్తికా భాటియా (66), దీప్తి శర్మ (60 నాటౌట్) అర్థ సెంచరీలతో కదం తొక్కటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో రికార్డు స్కోరు దిశగా సాగుతోంది. బ్యాటర్లు సమిష్టిగా మెరవటంతో ఇంగ్లాండ్ మహిళలతో తొలి టెస్టు తొలి రోజే 410 పరుగులు పిండుకున్నారు. మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో తొలి రోజు 400 పైచిలుకు పరుగులు సాధించిన రెండో జట్టుగా టీమ్ ఇండియా రికార్డు నెలకొల్పింది.

నవతెలంగాణ-ముంబయి



ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టులో ఆతిథ్య భారత్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. టీమ్ ఇండియా అమ్మాయిలు నవీ ముంబయిలో నవ ఇన్నింగ్స్‌లు నమోదు చేయటంతో ఇంగ్లాండ్‌కు ఊహించని షాక్ తగిలింది. అరంగ్రేట బ్యాటర్లు శుభ సతీశ్ (69, 76 బంతుల్లో 13 ఫోర్లు), జెమీమా రొడ్రిగస్ (68, 99 బంతుల్లో 11 ఫోర్లు) సహా యస్తికా భాటియా (66, 88 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), దీప్తి శర్మ (60 నాటౌట్, 95 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో మోత మోగించారు. నలుగురు బ్యాటర్లు 50 ప్లస్ స్కోర్లు సాధించటంతో టీమ్ ఇండియా తొలి రోజే 410 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. నేడు టెయిలెండర్ల అండతో 500 పైచిలుకు స్కోరుపై కన్నేసి బ్యాటింగ్‌కు రానుంది.

ఓపెనర్లు నిరాశపరిచినా.. : టాస్ నెగ్గిన టీమ్ ఇండియా అమ్మాయిలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. టీ20 సిరీస్ సాధించిన ఉత్సాహంలో ఉన్న ఇంగ్లాండ్ సహజంగానే ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. ఫామ్‌లో ఉన్న భారత ఓపెనర్లు మంచి ఆరంభం ఇవ్వలేకపోయారు. స్మృతీ మంధాన (17), షెఫాలీ వర్మ (19) తొలి పది ఓవర్లలోనే పెవిలియన్ బాట పట్టారు. మూడు ఫోర్లతో ఎదురుదాడి చేసిన మంధాన.. నాలుగు ఫోర్లతో మెరిసిన షెఫాలీ వికెట్లు నిలుపుకోలేదు. దీంతో ఇంగ్లాండ్ ఆరంభంలో పైచేయి సాధించింది. ఓపెనర్ల నిష్క్రమణ తర్వాత అరంగ్రేట బ్యాటర్లు ఆకట్టుకున్నారు. శుభ సతీశ్, జెమీమా రొడ్రిగస్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించారు. యువ బ్యాటర్ శుభ సతీశ్ 9 ఫోర్లతో 49 బంతుల్లోనే కెరీర్ తొలి అర్థ సెంచరీ నమోదు చేసింది. వికెట్ కాపాడుకోవటంతో పాటు రన్‌రేట్ సైతం ముందుకు సాగటంతో తొలి సెషన్లో భారత్ 136/2 పరుగులు చేసింది.

శుభ, జెమీమా జోరు : లంచ్ విరామం అనంతరం శుభ సతీశ్, జెమీమా రోడ్రిగస్ జోరు కొనసాగింది. ఈ జోడీ మూడో వికెట్‌కు శతక భాగస్వామ్యం నిర్మించింది. 146 బంతుల్లో 115 పరుగులు పిండుకుంది. దీంతో భారత్ నెమ్మదిగా టెస్టుపై పట్టు బిగించింది. రొడ్రిగస్ సైతం ఎనిమిది ఫోర్ల సాయంతో 82 బంతుల్లో అర్థ సెంచరీ సాధించింది. శుభ సతీశ్ ధనాధన్ బ్యాటింగ్‌తో ఇంగ్లాండ్ బౌలర్ల ప్రణాళికలు తారుమారు చేసింది. స్ఫూర్తిదాయక అర్థ సెంచరీల నుంచి శతక ప్రయాణం దశలో ఇద్దరూ వికెట్ కోల్పోయారు. దీంతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, యస్తికా భాటియా ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకున్నారు. రెండో సెషన్లో 125 పరుగులు పిండుకున్న భారత్ 2 వికెట్లు కోల్పోయింది. టీ విరామానికి భారత్ 261/4తో నిలిచింది.

పరుగుల వరద : తొలి రోజు చివరి సెషన్లో భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ఐదో వికెట్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్, యస్తికా భాటియా జోడీ సైతం సెంచరీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ జోడీ 146 బంతుల్లో 116 పరుగులు జోడించింది. ఓ ఎండ్‌లో ప్రమాదకర హిట్టర్ హర్మన్ నిలిచినా.. ఈ భాగస్వామ్యంలో యువ బ్యాటర్ భాటియా అధిక పరుగులు చేయటం విశేషం. ఎనిమిది ఫోర్లు, ఓ సిక్సర్‌తో భాటియా 66 బంతుల్లోనే అర్థ సెంచరీ అందుకుంది. హర్మన్‌ప్రీత్ అర్థ సెంచరీకి పరుగు దూరంలో రనౌట్‌గా నిష్క్రమించింది. అయినా, ఈ సెషన్లో భారత్ జోరు తగ్గలేదు. డ్రింక్స్ విరామం అనంతరం స్నేహ్ రానా, దీప్తి శర్మ దంచికొట్టారు. ఈ జోడీ ఏడో వికెట్‌కు 147 బంతుల్లో 92 పరుగులు పిండుకుంది. దీప్తి శర్మ ఎనిమిది ఫోర్లు, ఓ సిక్సర్‌తో 78 బంతుల్లో అర్థ శతకం సాధించింది. రానా సైతం ఐదు బౌండరీలతో మెరిసింది. చివరి సెషన్లో భారత్ 149 పరుగులు చేసి, 3 వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో తొలి రోజు ముగిసే సరికి 94 ఓవర్లలో 7 వికెట్లకు 410 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. ఇంగ్లాండ్ బౌలర్లలో లారెన్ బెల్ (2/64), సీవర్ (1/25) రాణించారు.



స్కోరు వివరాలు :

భారత్ మహిళల తొలి ఇన్నింగ్స్ : స్మృతీ మంధాన (బి) బెల్ 17, షెఫాలీ వర్మ (బి) క్రాస్ 19, శుభ సతీశ్ (సి) సీవర్ (బి) ఎకల్‌స్టోన్ 69, జెమీమా రొడ్రిగస్ (బి) బెల్ 68, హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్) 49, యస్తికా భాటియా (సి) బెల్ (బి) డీన్ 66, దీప్తి శర్మ నాటౌట్ 60, స్నేహ్ రానా (బి) సీవర్ 30, పూజ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 28, **మొత్తం : (94 ఓవర్లలో 7 వికెట్లకు) 410.**

వికెట్ల పతనం : 1-25, 2-47, 3-162, 4-190, 5-306, 6-313, 7-405.

బౌలింగ్ : కేట్ క్రాస్ 14-0-64-1, లారెన్ బెల్ 15-1-64-2, సీవర్ 11-4-25-1, లారెన్ ఫైలర్ 15-1-84-0, చార్లీ డీన్ 17-1-62-1, సోఫీ ఎకల్‌స్టోన్ 22-4-85-1.

సిరీస్ సమం

- మూడో టీ20లో భారత్ గెలుపు
- సూర్య కుమార్ సెంచరీ
- కుల్దీప్ ఐదు వికెట్ల మాయ



జొహనెస్‌బర్గ్ : టీ20 సిరీస్ సమం. వరుణుడి ఆటతో రెండు మ్యాచుల సిరీస్‌గా మారిన పోరులో దక్షిణాఫ్రికా, భారత్ ట్రోఫీని పంచుకున్నాయి. కీలక మూడో టీ20లో భారత్ 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో టీ20 సిరీస్ 1-1తో సమమైంది. 202 పరుగుల భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా 95 పరుగులకే కుప్పకూలింది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (5/17) ఐదు వికెట్ల మాయాజాలంతో చెలరేగటంతో సఫారీలు 13.5 ఓవర్లలోనే చేతులెత్తేశారు. రవీంద్ర జడేజా (2/25) సైతం రాణించాడు. సఫారీ బ్యాటర్లలో డెవిడ్ మిల్లర్ (35, 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్క్‌రామ్ (25, 14 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (100, 56 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) సెంచరీకి తోడు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (60, 41 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో చెలరేగటంతో 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగుల భారీ స్కోరు చేసింది. టీ20 సిరీస్ ట్రోఫీని ఇరు జట్లు పంచుకోగా.. సూర్య కుమార్ యాదవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

చెలరేగిన సూర్య, యశస్వి : టాస్ ఓడిన టీమ్ ఇండియా.. తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. ఓ ఎండ్‌లో యశస్వి జైస్వాల్ (60) దంచికొట్టినా.. స్టార్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (8) నిరాశపరిచాడు. రెండు బౌండరీలతో పరుగుల ఖాతా తెరిచిన శుభ్‌మన్.. మహరాజ్ మాయలో పడ్డాడు. హైదరాబాదీ ఆటగాడు తిలక్ వర్మ (0) ఎదుర్కొన్న తొలి బంతికే గోల్డెన్ డక్‌గా నిష్క్రమించాడు. ఈ దశలో యశస్వితో జతకట్టిన సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. యశస్వి, సూర్య జోడీ మూడో వికెట్‌కు 70 బంతుల్లోనే 112 పరుగులు జోడించింది. దీంతో భారత్ భారీ స్కోరు నమోదు చేసింది. యశస్వి జైస్వాల్ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 34 బంతుల్లో అర్థ సెంచరీ సాధించగా.. సూర్యకుమార్ యాదవ్ రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 32 బంతుల్లోనే ఫిఫ్టీ అందుకున్నాడు. జైస్వాల్ నిష్క్రమించినా.. రింకూ సింగ్ (14) జతగా సూర్య ప్రతాపం కొనసాగింది. ఏడు ఫోర్లు, ఎనిమిది సిక్సర్లతో 55 బంతుల్లోనే సెంచరీ బాదిన సూర్యకుమార్ యాదవ్.. చివరి ఓవర్లో వికెట్ కోల్పోయాడు. ఆఖర్లో జితేశ్ శర్మ (4), రవీంద్ర జడేజా (4) సైతం నిరాశపరిచారు. ఇక భారత్ ఇన్నింగ్స్ తొలి ఓవర్లో అరంగ్రేట బౌలర్ బర్గర్ ఏడు బంతుల ఓవర్ వేయటం గమనార్హం.

కోల్‌కత కెప్టెన్‌గా అయ్యర్

వైస్ కెప్టెన్‌గా నితీశ్ రానా

కోల్‌కత : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ కోల్‌కత నైట్‌రైడర్స్‌కు శ్రేయస్ అయ్యర్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. గాయంతో గత సీజన్‌కు శ్రేయస్ అయ్యర్ దూరమవగా.. నితీశ్ రానా కెప్టెన్సీ బాధ్యతలు వహించాడు. ఈ ఏడాది శ్రేయస్ అయ్యర్ పునరాగమంతో తిరిగి అతడికే కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తూ ఫ్రాంచైజీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. నితీశ్ రానా వైస్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. ఈ మేరకు కోల్‌కత నైట్‌రైడర్స్ సీఈవో వెంకీ మైసూర్ వెల్లడించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.